S TV SAMAYAM

epaper.samayamdaily.net APTEL/2006/18267

# సమయం

మన గొంతుకే.. మన పత్రిక
తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

ఫోన్ నెం : 99483 13985/ 89789 80131

సంపుటి: 19 | సంచిక: 66 | ఎడిటర్ : విక్రం కుమార్ | శుక్రవారం 19 డిసెంబర్ 2025 | ప్రచురణ : హైదరాబాద్ | పేజీలు: 12 | వెల:రూ.5 |



## ప్రధాని మోడీకి మరో గౌరవం

ఆర్డర్ ఆఫ్ ఒమన్ పురస్కారం ప్రదానం 4

### ఉపాధి హామీ చట్టం స్థానంలో

## 'వీబీ జీ రామ్ జీ'

### బిల్లుకు లోక్‌సభ ఆమోదం

లోక్‌సభలో ప్రతులు చించి నిరసన తెలిపిన విపక్షం

వెల్‌లోకి దూసుకెళ్లి పప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన

మహాత్ముడి పేరు మార్పు దుర్మార్గమని విమర్శలు

గాంధీ ఆశయాలను ముందుకు తీసుకు వెళుతున్నమన్న శివరాజ్‌సింగ్



4



### మహాత్ముడిని అవమానించారు

రాష్ట్రాలపై భారం మోపేలా బిల్లు: ప్రియాంకగాంధీ

### మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ

# దేశంలో అతిపెద్ద స్కాం

### కోటి సంతకాల సేకరణ దస్త్రాలు గవర్నర్‌కు అందచేత

ఈ పోరాటం ఇంతటితో అగదని స్పష్టీకరణ

కోర్టులో కేసు వేస్తామని జగన్ హెచ్చరిక



**విజయవాడ :** రాష్ట్రంలో మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ దేశంలో అతిపెద్ద స్కాం అని వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అన్నారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సేకరించిన కోటి సంతకాల సేకరణ ప్రతులను గురువారం విజయవాడలోని లోక్‌భవన్‌లో గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు అందించారు. అనంతరం లోక్‌భవన్ వద్ద వైఎస్ జగన్ మీడియాతో మాట్లాడారు. 'మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణతో చంద్రబాబు చేస్తున్న అన్యాయాన్ని గవర్నర్ దృష్టికి తీసుకెళ్లడమే కాకుండా రాష్ట్ర ప్రజల ఆకాంక్షను కూడా ఆయనకు తెలియజేశాం. ఈరోజు ఒక చారిత్రక ఘట్టం. ఏకంగా 1,04,11,136 సంతకాలు. దేశ చరిత్రలో కూడా ఇలాంటి

మిగతా 5 లో



# వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో

# ఇదే రిపీట్

- పంచాయతీ ఫలితాలు మా పాలనకు గీటురాయి
- రెండేళ్ల మా పాలన పట్ల ప్రజల్లో సానుకూలత
- కంటోన్మెంట్, జూబ్లీహిల్స్‌లో సైతం ఆదరించారు
- బీఆర్ఎస్, బీజేపీకి 3-శాతం కూడా సీట్లు దక్కలేదు
- ఇప్పటికైనా బీఆర్ఎస్ బుద్దిగా మసలుకోవాలి
- మీడియా సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, డిసెంబర్ 18:** మూడు దశల్లో జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ అద్భుతమైన ఫలితాలను సాధించిందని.. 2029 అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఇవే ఫలితాలు పునరావృత మవుతాయని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. మా రెండేళ్ల పాలనకు ప్రజలు ఇచ్చిన తీర్పు ఈ ఫలితాలని ఆయన అభివర్ణించారు. కంటోన్మెంట్, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో సైతం కాంగ్రెస్ పార్టీని ప్రజలు ఆశీర్వదించారని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశా రు. పార్టీ విజయం కోసం కష్టపడిన కాంగ్రెస్ కార్యకర్తలం దరికీ ధన్యవాదాలు తెలిపారు. జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డి ప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు సీతక్క, ఉత్తమ్ కుమార్ రెడ్డిచ దామోదర్ రాజనర్సింహలతో కలిసి

మిగతా 2 లో



### దమ్ముంటే కేసీఆర్ చర్చకు రావాలి

నదీ జలాలపై బీఆర్ఎస్ ద్రోహం

అసెంబ్లీలో ఎప్పుడైనా చర్చిస్తాం

కేసీఆర్‌కు రేవంత్ రెడ్డి సవాల్ 2

### స్థానిక, మున్సిపల్ ఎన్నికలపై త్వరలో నిర్ణయం

అందరితో చర్చించి ఓ నిర్ణయానికి వస్తాం 2

### ఫోన్ ట్యాపింగ్ దర్యాప్తునకు మరో సిట్

నగర పోలీస్ కమిషనర్ సజ్జనార్ నాయకత్వం



2



### తెలంగాణ సర్కార్‌కు భారీ ఊరట

102 ఎకరాల భూమి అటవీశాఖదే అని తేల్చిన సుప్రీం 3

### గ్రూప్-3 ఫలితాలు విడుదల



2



### శాంతిభద్రతల విషయంలో రాజీలేదు

పోలీసింగ్ అంటే భయం ఉండాల్సిందే

రెండో రోజు కలెక్టర్ల సదస్సులో శాంతిభద్రతలపై చంద్రబాబు



# కాంగ్రెస్ అగ్రనేతలకు వేధింపులు

**నిరసనలకు కాంగ్రెస్ దిగడంతో ఉద్రిక్తత**

**హైదరాబాద్, డిసెంబర్ 18:** నగరంలోని గాంధీభవన్ వద్ద భారీగా పోలీసులను మోహరించారు. నేషనల్ హెరాల్డ్ కేసులో కాంగ్రెస్ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్‌ను ఈడీ కేసులతో వేధిస్తున్నారని పార్టీ శ్రేణులు ఆరోపించాయి. ఈ నేపథ్యంలో ఏఐసీసీ పిలుపు మేరకు టీపీసీసీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ కార్యకర్తలు నిరసన ర్యాలీకి సిద్ధమయ్యారు. భాజపా కార్యాలయం వరకు వెళ్లేందుకు పెద్దఎత్తున కాంగ్రెస్ కార్యకర్తలు తరలిరావడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఈ నిరసనకు అనుమతి లేదని చెప్పారు. దీంతో అక్కడ ఉద్రిక్తత నెలకొంది. రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్‌తో పాటు ముఖ్యనేతలు గాంధీభవన్‌కు చేరుకున్నారు. నిరసనకు పోలీసుల నిరాకరించడంతో నేతలు అక్కడే బైఠాయించారు. భాజపాకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

# టాంజానియాలో నల్లగొండవాసి మృతి

**నల్గొండ, డిసెంబర్ 18:** నల్గొండ జిల్లా మునుగోడు మండలం పలివెల గ్రామానికి చెందిన బడుగు రాజు (38) టాంజానియా దేశంలో గుండెపోటుతో మృతి చెందారు. ఈ విషయాన్ని అతడి సహచరులు రాజు కుటుంబ సభ్యులకు తెలియజేశారు. మృతదేహాన్ని స్వస్థలానికి తీసుకొచ్చేందుకు స్థానిక ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి.. మంత్రి శ్రీధర్ బాబుతో కలిసి ఆ దేశ రాయబారులతో మాట్లాడుతున్నారు. బడుగు రాజు టాంజానియా రాజధాని దారుస్సలాంలో జియాలాజిస్ట్‌గా పనిచేస్తున్నట్టు సమాచారం. ఆయన మరణవార్తతో గ్రామంలో విషాదం అలముకుంది. కుటుంబసభ్యులు కన్నీరు మున్నీరయ్యారు.

# గ్రూప్-3 ఫలితాలు విడుదల

**హైదరాబాద్, డిసెంబర్ 18:** తెలంగాణ గ్రూప్-3 అభ్యర్థుల ఫలితాలు గురువారం విడుదల య్యాయి. సెలక్షన్ లిస్ట్‌ను తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ విడుదల చేసింది. గ్రూప్-3కి 1,370 మంది అభ్యర్థులు ఎంపికయ్యారు. గతేడాది నవంబర్ 17, 18 తేదీల్లో జరిగిన గ్రూప్-3 పరీక్ష జరిగిన విషయం తెలిసిందే. జూనియర్ అసిస్టెంట్, ఎల్‌డి స్టెనో, టైపిస్ట్, జూనియర్ స్టెనోగ్రాఫర్ తదితర పోస్టులను భర్తీ చేసేందుకు నిర్వహించిన పరీక్షకు సుమారు 2.5 లక్షల మంది అభ్యర్థులు హాజరయ్యారు.గ్రూప్ 3 పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల హాల్ టికెట్ నంబర్లు అధికారిక వెబ్‌సైట్ లో అందుబాటులో ఉంచింది. కోర్టులో ఉన్న పెండింగ్ కేసుల తుది తీర్పుకు లోబడి ఈ ఫలితాల ఎంపిక ఉంటుందని టీజీపీఎస్సీ స్పష్టం చేసింది. ఒక్క ఖాళీని ప్రస్తుతం విత్‌హెల్డ్ లో ఉంచింది కమిషన్. తప్పుడు వివరాలు సమర్పించినట్లు తేలితే ఎంపికను రద్దు చేస్తామని కమిషన్ హెచ్చరించింది. గత ఏడాది నవంబర్ 17, 18 తేదీల్లో గ్రూప్-3 పరీక్షలు జరిగిన విషయం తెలిసిందే.

# సర్కార్‌కు భారీ ఊరట

**102 ఎకరాల భూమి అటవీశాఖదే అని తేల్చిన సుప్రీం**

**స్వాధీనం చేసుకుని నోటిపై చేయాలని సీఎస్‌కు ఆదేశం**

**న్యూఢిల్లీ, డిసెంబర్ 18:** సుప్రీంకోర్టులో తెలంగాణ ప్రభుత్వానికి భారీ ఊరట లభించింది. రూ.15 వేల కోట్ల విలువైన భూములపై సుప్రీంకోర్టు తీర్పు వెలువరించింది. వనస్థలిపురం దగ్గర ఉన్న 102 ఎకరాల భూమి తెలంగాణ రాష్ట్ర పరిధిలోని అటవీ శాఖదేనని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. దాదాపు 20 ఏళ్లుగా ఈ భూమిపై వివాదం కొనసాగుతోంది. హైదరాబాద్ వనస్థలిపురం సమీపంలోని సాహెబ్‌నగర్ వద్ద ఉన్న 102 ఎకరాల భూమి తెలంగాణ అటవీశాఖదేనని తేల్చింది. ఈ భూమిపై యాజమాన్య హక్కులు కోరుతూ నిజాం, సాలార్ జంగ్, మీరాలం వారసులమంటూ పలువురు న్యాయస్థానంలో పిటిషన్లు దాఖలు చేశారు. గతంలో పిటిషన్లు వేసిన 260 మందికి అనుకూలంగా హైకోర్టు తీర్పు ఇచ్చింది. హైకోర్టు తీర్పుపై రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో అప్పీలు చేసింది. సుదీర్ఘ విచారణ అనంతరం జస్టిస్ పంకజ్ మిత్తల్, జస్టిస్ ఎస్‌వీఎన్ భట్టిల ధర్మాసనం.. ఇది పూర్తిగా అటవీ భూమి అని రాష్ట్ర ప్రభుత్వానికి పూర్తి హక్కులు కల్పిస్తూ తీర్పు ఇచ్చింది. తీర్పు వెలువడిన 8 వారాల్లో రిజర్వ్ ఫారెస్ట్‌గా నోటిఫై చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని సుప్రీంకోర్టు ఆదేశించింది. నోటిఫికేషన్ ప్రతిని సుప్రీంకోర్టు రిజిస్ట్రీకి పంపాలని ధర్మాసనం ఆదేశించింది.సుదీర్ఘ విచారణ తర్వాత ద్విసభ్య ధర్మాసనం తాజాగా తీర్పు వెలువరించింది. అది పూ ర్తిగా అటవీ భూమి అని.. దానిపై రాష్ట్ర ప్రభుత్వానికి పూర్తి హక్కులు ఉన్నాయని తేల్చి చెప్పింది. భూమిపై రాష్ట్ర ప్రభుత్వానికి హక్కులు కల్పిస్తూ సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. తీర్పు వెలువడిన 8 వారాల్లో ఆ 102 ఎకరాలను రిజర్వ్ ఫారెస్ట్‌గా నోటిఫై చేయాలని సీఎస్‌కు ఆదేశాలు జారీ చేసింది. నోటిఫికేషన్ కాపీని సుప్రీంకోర్టు రిజిస్ట్రీకి పంపాలని ధర్మాసనం సూచించింది. దీంతో 2 దశాబ్దాలుగా కొనసాగుతున్న భూ వివాదం ఓ కొలిక్కి వచ్చింది.

# ఫోన్ ట్యాపింగ్ దర్యాప్తునకు మరో సిట్

**నగర పోలీస్ కమిషనర్ సజ్జన్నార్ నాయకత్వం**



**హైదరాబాద్, డిసెంబర్ 18:** ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తులో మరో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఇప్పటికే ఈ కేసులో సిట్ విచారణ చేస్తుండగా, హైదరాబాద్ సీపీ సజ్జనార్ ఆధ్వర్యంలో సీనియర్ ఐపీఎస్ అధికారులతో మరో సిట్‌ను ఏర్పాటు చేస్తూ తెలంగాణ డీజీపీ శివధర్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. సిట్‌లో రామగుండం కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, సిద్దిపేట కమిషనర్ ఎస్.ఎం.విజయ్ కుమార్, మాదాపూర్ డీసీపీ రితురాజ్, మహేశ్వరం డీసీపీ నారాయణ్‌రెడ్డి, గ్రేహౌండ్స్ గ్రూప్ కమాండర్ రవీందర్‌రెడ్డి, రాజేంద్రనగర్ అదనపు డీసీపీ కేఎస్ రావు, జూబ్లీహిల్స్ ఏసీపీ వెంకటగిరి, టీజీ న్యాబ్ డీఎస్పీ శ్రీధర్, హైదరాబాద్ మెట్రోలో పనిచేస్తున్న నాగేందర్ సభ్యులుగా ఉన్నారు. వీరు ఏంచేస్తారన్నది విధి విధానాలు రాలవాల్సి ఉంది.

# వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఇదే రిపీట్

మొదటి పేజీ తరువాయి



ఆశీర్వదించారని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. పార్టీ విజయం కోసం కష్టపడిన కాంగ్రెస్ కార్యకర్తలందరికీ ధన్యవాదాలు తెలిపారు. జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు సీతక్క, ఉత్తమ్ కుమార్ రెడ్డిచ దామోదర్ రాజనర్సింహలతో కలిసి సీఎం మాట్లాడారు. మూడు విడతల్లో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అద్భుత ఫలితాలు సాధించిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఆశీర్వదించిన ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ గెలుపునకు కష్టపడిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు శుభాకాంక్షలు చెప్పారు. ఈ పంచాయతీ ఎన్నికలను విజయవంతంగా నిర్వహించిన అధికారులకు సీఎం అభినందనలు తెలియజేశారు. 12,702 పంచాయతీలకు 7,527 పంచాయతీల్లో కాంగ్రెస్ గెలిచిందన్నారు. 808 కాంగ్రెస్ రెబల్స్ నెగ్గారని వివరించారు. 66 శాతం ఫలితాలను కాంగ్రెస్ సాధించిందని తెలిపారు. 3,511 కాంగ్రెస్, 710 బీజేపీ మొత్తంగా 33 శాతం గెలిచాయని పేర్కొన్నారు. 94 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ఎన్నికలు జరిగాయని.. 87 నియోజకవర్గాల పరిధిలో కాంగ్రెస్ మెజారిటీ సాధించిందని స్పష్టం చేశారు. పంచాయతీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయన్నారు. తమ ప్రభుత్వంపై ప్రజలు సంపూర్ణ విశ్వాసం కనబరిచారని ధీమా వ్యక్తం చేశారు. స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్, బీజేపీ కూటమిగా పోటీ చేశాయని ఆరోపించారు. బీఆర్ఎస్, బీజేపీ కూటమికి 33శాతం విజయాలు మాత్రమే దక్కాయన్నారు. బీఆర్ఎస్‌కు 3,511 సర్పంచ్ స్థానాలు, బీజేపీ 710 చోట్ల గెలిచాయని చెప్పారు. బీఆర్ఎస్, బీజేపీ కూటమికి 4,221 స్థానాలు మాత్రమే దక్కాయని సీఎం రేవంత్ తెలిపారు. ఇటీవల ప్రజాపాలన రెండేళ్ల సంబురాలు నిర్వహించుకున్నామని పేర్కొన్నారు. రాష్ట్రంలోని 12వేలకు పైగా గ్రామపంచాయతీల్లో ఎన్నికలు ప్రశాంతంగా, ప్రజాస్వామ్య బద్ధంగా జరిగాయి. ఎన్నికలు సజావుగా నిర్వహించిన అధికారులకు అభినందనలు తెలిపారు. దాదాపు 146 గ్రామ పంచాయతీలు (ఒక శాతం) సీపీఐ, సీపీఎం, ఇతరులు గెల్చుకున్నారు. ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లయిన తర్వాత జరిగిన ఎన్నికల్లోనూ ప్రజలు కాంగ్రెస్‌ను ఆదరించారు. పంచాయతీ ఎన్నికల ఫలితాలు మా రెండేళ్ల పాలనపై తీర్పుగా భావిస్తున్నాం అని సిఎం అన్నారు. ఎంత ఎదిగినా ఒదిగి ఉండాలనే పెద్దల సూచనను పాటిస్తాం. కానీ, ప్రతిపక్షంలో ఉన్న వారికి ఇంకా అహంకారం తగ్గలేదు. ఇప్పటికైనా ప్రజా తీర్పును గౌరవించి.. ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలకు సహకరించాలని రేవంత్‌రెడ్డి అన్నారు. పేదలకు మేం అందిస్తున్న సంక్షేమ పథకాలే మా విజయానికి కారణం. ఈ ఫలితాలను చూసి భారత రాష్ట్ర సమితి నేతలు అద్భుతం అంటున్నారు. సంతోషం.. మీరు కోరుకున్నట్టే ఈ అద్భుతం 2029లో కూడా జరుగుతుంది. 2/3 మెజార్టీతో 2029లో కాంగ్రెస్ తిరిగి అధికారంలోకి వస్తుంది. 1/3తో భారత రాష్ట్ర సమితి ఉంటే.. 2/3 మెజార్టీతో కాంగ్రెస్ ఉంటుంది. ఈ తీర్పు 2029లో కూడా పునరావృతం కాబోతోందని సీఎం అన్నారు.

# దమ్ముంటే కేసీఆర్ చర్చకు రావాలి

**నదీ జలాలలపై బీఆర్ఎస్ ద్రోహం**

**అసెంబ్లీలో ఎప్పుడైనా చర్చిస్తాం**

**మీడియా ముందుకు వచ్చినా వివరిస్తాం**

**కేసీఆర్‌కు సీఎం రేవంత్ రెడ్డి సవాల్**

**హైదరాబాద్, డిసెంబర్ 18:** నదీజలాల విషయంలో ద్రోహం చేసిందెవరో మీడియా ముందకు వస్తే నిజాలు వెల్లడిస్తానని సీఎం రేవంత్ సవాల్ చేశారు. ఈ మేరకు బీఆర్ఎస్ అధినేత, రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కి సీఎం రేవంత్ రెడ్డి సవాల్ విసిరారు. నదీ జలాల విషయంలో మాట్లాడేందుకు కేసీఆర్ మీడియా ముందుకు రానున్నారని వార్తలు వస్తున్న నేపథ్యంలో.. సీఎం రేవంత్ రెడ్డి స్పందించారు. నదీ జలాలు, ప్రాజెక్టులపై చర్చిద్దాం రండి అంటూ కేసీఆర్‌కు ముఖ్యమంత్రి ఛాలెంజ్ విసిరారు. కేసీఆర్ ఎప్పుడు కోరితే అప్పుడు అసెంబ్లీ సమావేశాలు పెడతానని అన్నారు. బురదజల్లి పారిపోవ దం కాదు.. నీటి వాటాల్లో ఎవరి హయాంలో అన్యాయం జరిగిందో చర్చిద్దాం రావాలంటూ కేసీఆర్‌కు సవాల్ విసిరారు. కృష్ణా జలాలపై ప్రతిపక్ష నేతగా లేఖ రాయండి. కృష్ణా జలాల్లో ఎవరు అన్యాయం చేశారో చర్చకు సిద్ధం. గోదావరి, కృష్ణా జలాలపై సభలో చర్చకు సిద్ధంగా ఉన్నాం. ఉమ్మడి రాష్ట్రంలో కంటే బీఆర్ఎస్ హయాంలోనే ఎక్కువ ద్రోహం చేశారు. మీరు చేసిన ద్రోహాన్ని ఆధారాలతో సహా నిరూపిస్తాం అని రేవంత్ అన్నారు. ఇదిలాఉంటే.. ఫార్ములా ఈ రేస్ కేసుపైనా సీఎం రేవంత్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ కేసుపై దర్యాప్తు జరుగుతోందన్నారు. అరవింద్ కుమార్‌కు సంబంధించి అనుమతి రావాల్సి ఉందన్నారు. డీవోపీటీ నుంచి అనుమతి రాగానే చర్యలు తీసుకుంటామని సీఎం తెలిపారు. మెస్సీ ఈవెంట్ పూర్తిగా ప్రైవేట్ కార్యక్రమం అని సీఎం మరోమారు స్పష్టం చేశారు. మెస్సీ ఈవెంట్‌కు తాను గెస్ట్ మాత్రమేనని చెప్పారు. సింగరేణి యాజమాన్యం అడ్వర్‌టైజ్‌మెంట్ ఇచ్చిందన్నారు. ఫుట్‌బాల్ ఆడించాలనే తన మనవడిని తీసుకెళ్లినట్లు సీఎం వివరించారు. తాము పబ్బులు, గబ్బుల చుట్టూ తిప్పలేదన్నారు.

# స్థానిక, మున్సిపల్ ఎన్నికలపై త్వరలో నిర్ణయం

**అందరితో చర్చించి ఓ నిర్ణయానికి వస్తాం**

**ఎన్నికలు సజావుగా నిర్వహించిన అధికారులకు కృతజ్ఞతలు**



**హైదరాబాద్, డిసెంబర్ 18:** రాష్ట్రంలో గ్రామ పంచాయతీ ఎన్నికలను ప్రశాంతమైన వాతావరణంలో, ప్రజాస్వామిక బద్ధంగా ఎక్కడా ఎలాంటి లోటుపాట్లు లేకుండా నిర్వహించినందుకు ఎన్నికల యంత్రాంగానికి, అధికారులకు ప్రభుత్వం తరపున ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందనలు తెలిపారు. బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42శాతం రిజర్వేషన్లను సాధించడంపై శాసన సభ సమావేశాల్లో చర్చించి అన్ని పార్టీల అభిప్రాయం మేరకు ఎంపీటీసీ, జెడ్పీటీసీ, మున్సిపల్ ఎన్నికలపై నిర్ణయానికి వస్తామని చెప్పారు. ప్రజా ప్రభుత్వం రెండేళ్ల పరిపాలన తర్వాత స్థానిక సంస్థల ఎన్నికలతో ప్రజల ముందుకు వెళ్లగా, తమకు 7,527 గ్రామ పంచాయతీల్లో (66 శాతం) ప్రజలు అందించిన ఆశీర్వాదం.. ప్రభుత్వంపై మరింత బాధ్యత పెంచిందని చెప్పారు. ప్రజల ఆశీర్వాదంలో రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి రెండిండినీ సమపాళ్లలో ముందుకు తీసుకెళుతున్నామని అన్నారు. రాష్ట్రంలో కొత్తగా రేషన్ కార్డుల జారీ, సన్నబియ్యం పంపిణీ, రైతు రుణమాఫీ, రైతు భరోసా, సన్నధాన్యానికి బోనస్ చెల్లింపు, ఉచిత కరెంట్, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్, రూ. 500 లకే సిలిండర్, 27 వేల కోట్ల రూపాయల మేరకు సున్నా వడ్డీకే మహిళా సమాఖ్యలకు రుణాలు, 4.5 లక్షల మంది నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు, అధికారం చేపట్టిన తొలి ఏడాదిలోనే 61 వేల ఉద్యోగాల భర్తీ, సుదీర్ఘకాలం అపరిష్కృతంగా ఉన్న ఎస్సీ వర్గీకరణ సమస్యకు పరిష్కారం, వందేళ్లుగా జరగని బీసీ కులగణన చేపట్టడం, పేదలకు మంచి విద్యను అందించాలన్న ప్రయత్నాలు... ఇలా అనేక అంశాల్లో ప్రభుత్వం ఒక క్రమపద్ధతిలో అభివృద్ధిని, సంక్షేమ కార్యక్రమాలతో ముందుకు వెళుతోందని ముఖ్యమంత్రి వివరించారు. ఒకవైపు ఆదాయాన్ని పెంచుకుంటూ దుబారాను తగ్గిస్తూ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని, ఒక్క రూపాయి కూడా దుర్వినియోగం జరక్కుండా ప్రజలకు మేలు చేయాలన్నదే ప్రభుత్వ తాపత్రయమని ఒక ప్రశ్నకు సమాధానంగా ముఖ్యమంత్రి గారు చెప్పారు. కృష్ణా, గోదావరి జలాలపై తెలంగాణ హక్కులకు సంబంధించి పూర్తి వివరాలతో శాసనసభలో చర్చించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు.

# ఇద్దరు అవినీతి ఉద్యోగుల పట్టివేత

**లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన వైనం**



**హైదరాబాద్, డిసెంబర్ 18:** అవినీతికి పాల్పడ్డ ఇద్దరు ఉద్యోగులు ఏసీబీకి చిక్కారు. నిర్మల్, ఖమ్మం జిల్లాలో జరిగిన ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. నిర్మల్ జిల్లా భైంసా మండలంలో తానూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న జి భీమన్న గురువారం మధ్యాహ్నం బాధితుడి నుంచి రూ. 9వేలు ఫోన్ పే చేయించుకున్నందుకు ఆధారాలతో సహ ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. భైంసా ఎన్‌బీ నగర్‌లో నివాసముండే ఒకరు మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులు, సరెండర్ లీవ్, ఎఫ్‌టీఏ బిల్లు కోసం సీనియర్ అసిసెంట్‌ను సంప్రదించగా లంచం డిమాండ్ చేశారు. దీంతో బాధితుడు ఆదిలాబాద్ రేంజ్ ఏసీబీ అధికారులను ఆశ్రయించగా వ్యూహం ప్రకారం దాడులు చేసి భీమనన్ను పట్టుకున్నారు. ఖమ్మం జిల్లా కారేపల్లి తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ గా పనిచేస్తున్న ఉషా శుభ కామేశ్వరి రూ. 10 వేలు లంచం తీసుకుంటు పట్టుబడ్డారు. ల్యాండ్ మ్యుటేషన్ కోసం అవసరమైన ఫ్యామిలీ మెంబర్స్ సర్టిఫికేట్‌కు ఆర్ఐను సంప్రదించారు. దీంతో లంచం డిమాండ్ చేసిన ఆమెకు రూ.10 వేలు బాధితులు అందిస్తుండగా మాటు వేసిన ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. ఆర్ఐపై కేసు నమోదు చేసుకుని ఏసీబీ కేసులను విచారిస్తున్న వరంగల్ జడ్జి ఎదుట ప్రవేశపెట్టారు.

# కోర్టు సమయం వృథా చేస్తారా?

**హీరా గ్రూప్‌నకు భారీ జరిమానా**

**5కోట్ల జరిమానా విధించిన హైకోర్టు**



**హైదరాబాద్, డిసెంబర్ 18:** నౌహీరా షేక్‌కు చెందిన హీరా గ్రూప్‌నకు హైకోర్టు భారీ జరిమానా విధించింది. రూ.5 కోట్ల జరిమానా విధించిన న్యాయమూర్తి జస్టిస్ నగేశ్ భీమపాక... ఆ మొత్తాన్ని 8 వారాల్లో పీఎం సహాయ నిధికి జమ చేయాలని హీరా గ్రూప్‌ను ఆదేశించారు. కోర్టును తప్పుదోవ పట్టించేలా పిటిషన్ దాఖలు చేశారని ఆగ్రహం వ్యక్తం చేసిన న్యాయమూర్తి.. భారీ జరిమానా విధిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. పేదల నుంచి పెట్టుబడి పేరుతో డబ్బులు వసూలు చేసి తిరిగి చెల్లించలేదని హీరా గ్రూప్‌తో పాటు.. నౌహీరా షేక్ పైనా ఈడీ అధికారులు పీఎంఎల్‌ఏ కింద కేసు నమోదు చేశారు. దర్యాప్తులో భాగంగా ఈడీ అధికారులు హీరా గ్రూప్‌నకు చెందిన 59 ఆస్తులను అటాచ్ చేశారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఈ ఆస్తులను వేలం వేసేందుకు ఈడీ అధికారులు వెబ్ సైట్‌లో వివరాలు ఉంచారు. ఈనెల 26న వేలం వేయనున్నట్లు పేర్కొన్నారు. ఈడీ అధికారులు సరిగా వేలం నిర్వహించడం లేదని, ఆస్తుల విలువ తక్కువగా చూపించారని నౌహీరా షేక్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వేలాన్ని రద్దు చేయాలని కోరారు. అప్పటి వరకు వేలం వేయకుండా మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. ఇరువైపులా వాదనలు విన్న జస్టిస్ నగేశ్ భీమపాక.. పిటిషనర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. తప్పుడు పిటిషన్లు వేసి కోర్టు సమయ వృథా చేస్తున్నారన్న న్యాయమూర్తి.. ఈ మేరకు హీరాగ్రూప్‌నకు రూ.5కోట్ల జరిమానా విధిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

# జిల్లా పరిషత్ ఎన్నికలకు సిద్ధం కండి

- భువనగిరి కోటపై గులాబీ జెండా ఎగరాలి
- సర్పంచ్ ఎన్నిక లఫలితాలతో వెయ్యి ఏనుగుల బలం
- ఇదే స్ఫూర్తితో ముందుకు సాగితే మనదే విజయం
- యాదాద్రి జిల్లాలో గెలిచిన సర్పంచ్‌ల అభినందనలో కేటీఆర్



**యాదాద్రి భువనగిరి, డిసెంబర్ 18:** జిల్లా పరిషత్ ఎన్నికలకు సిద్ధం కావాలని బీఆర్ఎస్ పార్టీ శ్రేణులకు ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ పార్టీకి పూర్వ వైభవం ప్రారంభమైందని, భవిష్యత్తులో సాధించబోయే అఖండ విజయాలకు యాదాద్రి భువనగిరి జిల్లా గడ్డ పునాది వేసిందని కేటీఆర్ స్పష్టం చేశారు. యాదాద్రి భువనగిరి జిల్లా బీఆర్ఎస్ కార్యాలయంలో నూతనంగా ఎన్నికైన సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ కార్యకర్తల్లో నూతనోత్సాహాన్ని నింపారు. తులం బంగారం ఇస్తామని, పింఛన్లు పెంచుతామని లంగ మాటలు చెప్పి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని, ఇప్పుడు రైతుబంధు రాక రైతులు అల్లాడుతున్నారని పేర్కొన్నారు. తినే ప్లేటులో మన్ను పోసుకున్నామని, పాలిచ్చే బర్రెను వదిలి తన్నే దున్నపోతును తెచ్చుకున్నామని ప్రజలు బాధపడుతున్నారని వ్యాఖ్యానించారు. వచ్చే జిల్లా పరిషత్ ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటాలని, భువనగిరి కోటపై గులాబీ జెండా ఎగరాలని పిలుపునిచ్చారు. పెద్దలు చెప్పినట్లు ఎక్కడైతే అధికారం పోగొట్టుకున్నామో, అక్కడే వెతుక్కోవాలని, ఈరోజు సర్పంచ్ ఎన్నికల ఫలితాలు ఆ ఉత్సాహాన్ని ఇస్తున్నాయని కేటీఆర్ పేర్కొన్నారు. రెండేళ్ల కిందట అసెంబ్లీ ఎన్నికల్లో కొద్దిపాటి ఓట్ల తేడాతో నిరాశ ఎదురైనా, నేడు భువనగిరిలో 56 మంది, ఆలేరులో 74 మంది, మునుగోడులో 15 మంది, తుంగతుర్తిలో 9 మంది, నకిరేకల్‌లో 7 మంది.. ఇలా జిల్లావ్యాప్తంగా మొత్తం 161 మంది సర్పంచులను గెలిపించుకోవడం సామాన్య విషయం కాదని ఆయన కొనియాడారు. ఈ విజయం రాష్ట్రవ్యాప్తంగా పార్టీ శ్రేణులకు వెయ్యి ఏనుగుల బలాన్ని ఇచ్చిందని, లక్ష్మీ నరసింహస్వామి ఆశీస్సులతో గులాబీ జెండా మళ్లీ రెపరెపలాడుతుందని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత రాజకీయం అత్యంత గలీజుగా మారిందని కేటీఆర్ మండిపడ్డారు. ఉమ్మడి నల్గొండ జిల్లాలో బీఆర్ఎస్ కార్యకర్తలపై జరుగుతున్న దాడులను ఆయన తీవ్రంగా ఖండించారు. నూతన్‌కల్ మండలంలో మల్లయ్య యాదవ్‌ను కిరాతకంగా చంపడం, నల్గొండలో అభ్యర్థిపై దాడి చేసి అమానవీయంగా మూత్రం తాగించి అవమానించడం వంటి ఘటనలు కాంగ్రెస్ నాయకుల వికృత మనస్తత్వానికి నిదర్శనమని ధ్వజమెత్తారు. పదేళ్ల పాలనలో కేసీఆర్ ఎప్పుడూ ఇలాంటి చిల్లర రాజకీయాలకు తావివ్వలేదని గుర్తు చేశారు. అధికారులు కూడా అధికార పక్షానికి కొమ్ముకాస్తూ, గెలిచిన బీఆర్ఎస్ అభ్యర్థులను దొంగతనంగా ఓడించే ప్రయత్నం చేస్తున్నారని, 150కిపైగా గ్రామాల్లో జరుగుతున్న ఈ అన్యాయంపై కోర్టుల ద్వారా న్యాయపోరాటం చేస్తామని హెచ్చరించారు. పార్టీ మారిన 10 మంది ఎమ్మెల్యేలపై కేటీఆర్ నిప్పులు చెరిగారు. అభివృద్ధి కోసమే కాంగ్రెస్‌లోకి వెళ్లామని సిగ్గు లేకుండా మైకుల్లో చెబుతున్న కడియం శ్రీహరి వంటి నాయకులు, అసెంబ్లీలో ఏ పార్టీలో ఉన్నారో చెప్పుకోలేని హీనస్థితిలో ఉన్నారని ఎద్దేవా చేశారు. 70 ఏళ్ల వయసులో సంపాదించుకున్న గౌరవాన్ని రేవంత్ రెడ్డి సంకలో చేరి నాశనం చేసుకున్నారని, గబ్బిలాలు సూరు పట్టుకుని వేలాడినట్లు వీరి పరిస్థితి తయారైందని ఘాటుగా విమర్శించారు. స్పీకర్ కూడా ముఖ్యమంత్రి చెప్పినట్లు ఆడుతూ, ఫిరాయింపులు కనపడనట్లు నటిస్తున్నారని దుయ్యబట్టారు. రేవంత్ రెడ్డి మూడు ఫీట్లు ఉన్నా ముప్పై ఫీట్ల డైలాగులు కొడతారని, కానీ క్షేత్రస్థాయిలో ప్రజలు మోసపోయామని గ్రహిస్తున్నారని కేటీఆర్ అన్నారు. సర్పంచులు, ఎంపీటీసీలు సమన్వయంతో పనిచేయాలని, పార్టీ బీ-ఫామ్ మీద జరిగే ఈ ఎన్నికల్లో కారు గుర్తుకు తిరుగులేని విజయం అందించాలని కోరారు. ఇందిరమ్మ ఇళ్లు, పింఛన్లు ఎవరి అత్త సొమ్ము కాదని, అవి రాజ్యాంగబద్ధంగా ప్రజలకు అందాల్సిన హక్కులని, ఏ ఎమ్మెల్యే వాటిని ఆపలేడని భరోసా ఇచ్చారు. గత పదేళ్లలో కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ, ముఖ్యంగా ఉమ్మడి నల్గొండ జిల్లా సాధించిన అభివృద్ధిని కేటీఆర్ వివరించారు.

# కార్మికుల షెడ్డులో అగ్నిప్రమాదం

- సిలిండర్లు పేలడంతో భారీగా ఎగిసిపడ్డ మంటలు
- కార్మికులు పనుల్లో ఉండడంతో తప్పిన ముప్పు



**హైదరాబాద్, డిసెంబర్ 18:** షార్ట్ సర్క్యూట్‌తో చెలరేగి మంటలు ప్రమాదకరంగా మారిన సంఘటన చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు, ఫైర్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. లింగంపల్లిలో కొనసాగుతున్న క్యాండూర్ భారీ బహుళ అంతస్థుల నిర్మాణానికి పనులు చేసే కార్మికుల షెడ్లలో గురువారం ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. మంటలు ఒక్కసారిగా పెద్ద ఎత్తున ఎగిసిపడడంతో షెడ్లలో ఉండే కార్మికులు వంట గ్యాస్ భారీ శబ్దాలు చేస్తూ పేలిపోయాయి. ప్రమాదం జరిగిన సమయంలో అధిక సంఖ్యలో కార్మికులు విధుల్లో ఉండడంతో పెను ప్రమాదం తప్పింది. నిర్మాణ సంస్థ ఉద్యోగుల సమాచారంతో రంగంలోకి దిగిన మాదాపూర్, పటాన్‌చెరువు ఫైర్ అధికారులు 3 గంటలపాటు శ్రమించి మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. అగ్నిప్రమాదంలో కార్మికులకు సంబంధించిన సామాగ్రి పూర్తిగా అగ్నికి ఆహుతయ్యాయి. శేరిలింగంపల్లిలో అత్యధిక అంతస్థులతో నిర్మాణాన్ని చేపట్టిన క్యాండూర్ నిర్మాణ సంస్థ, తమ వద్ద పని చేస్తున్న కార్మికుల జాగ్రత్తను గాలికొదిలేసిందని, ఒకే చోట రేకుల షెడ్లను నిర్మించి వందలాది మందిని ఇరుకు గదులలో ఉంచిందని కార్మిక సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవలే చందానగర్‌లో నిర్మాణ కార్మికుల షెడ్లు అగ్నిప్రమాదంలో కాలిబూడిదైన సంఘటన మరువకముందే మరో ఘటన చోటు చేసుకోవడం బాధకరమని విచారం వ్యక్తం చేశారు. ప్రాణ నష్టం జరిగితే తప్ప అధికారులు నిర్మాణ సంస్థలపై చర్యలు తీసుకోరంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

# రంజాన్ ఏర్పాట్లపై ముందస్తు సమీక్ష నిర్వహించాలి

**పండుగ వేళ ఇబ్బందులు కలగకుండా చూడాలి**

**ప్రభుత్వానికి అమ్జెద్ ఉల్లా ఖాన్ విజ్ఞప్తి**




**హైదరాబాద్, డిసెంబర్ 18:** రాబోయే రంజాన్ పండుగ, పవిత్ర రాత్రులైన షబ్బే మెహ్రాజ్, షబ్బే బరాత్ ఏర్పాట్లపై ప్రభుత్వం ఇప్పటి నుంచే స్పష్టమైన ప్రణాళికతో వ్యవహరించాలని మజ్లిస్ బచావో తెహ్రీక్ (ఎం బి టీ) స్పొక్స్ పర్సన్ అమ్జెద్ ఉల్లా ఖాన్ కోరారు. 2026 ఫిబ్రవరి 19న రంజాన్ మాసం ప్రారంభం కానుండగా, దానికి ముందు జనవరి 16న షబ్బే మెహ్రాజ్ మరియు ఫిబ్రవరి 3న షబ్బే బరాత్ పర్వదినాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో, పండుగ పనులు సకాలంలో పూర్తి కావాలంటే జనవరి మొదటి వారంలోనే ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు. సాధారణంగా ప్రభుత్వం రంజాన్ ప్రారంభానికి వారం ముందు సమీక్ష నిర్వహిస్తుందని, అయితే ఆ సమయంలో మంజూరైన సివిల్ పనులు పండుగ ముగిసే వరకు పూర్తి కావడం లేదని ఆయన గుర్తు చేశారు. ఈ పరిస్థితిని నివారించడానికి ముఖ్యమంత్రి స్వయంగా అన్ని విభాగాల అధిపతులతో సమావేశమై పనులను పర్యవేక్షించాలని కోరారు. ఈ సమావేశం ద్వారా ప్రభుత్వం మైనారిటీల పండుగ ఏర్పాట్లను తీవ్రంగా పరిగణిస్తుందనే బలమైన సందేశం వెళ్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా ఈ సమీక్షా సమావేశాలకు కేవలం అధికారిక అనుబంధ పార్టీలనే కాకుండా, అన్ని రాజకీయ పక్షాలను, రాజకీయేతర మతపరమైన సంస్థలను ఆహ్వానించి వారి సలహాలు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా, ఫిబ్రవరి 3న జరగనున్న షబ్బే బరాత్ సందర్భంగా ముస్లింలు పెద్ద సంఖ్యలో స్మశానవాటికలను సందర్శిస్తారని, అందువల్ల గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ( జిహెచ్ఎం ) ఇతర జిల్లాల మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీల యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టాలని కోరారు. స్మశానవాటికలలో అడవి చెట్ల తొలగింపు, గోడలకు సున్నం వేయడం, విద్యుత్ దీపాల ఏర్పాటు వంటి పనులు పర్వదినానికి ముందే పూర్తి కావాలని స్పష్టం చేశారు. గతంలో పనులు ఆలస్యంగా జరగడం వల్ల భక్తులు ఇబ్బంది పడ్డారని, ఈసారి అటువంటి పొరపాట్లు జరగకుండా చూడాలని అధికారులను కోరారు. ఈ మేరకు మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి అజారుద్దీన్, ముఖ్యమంత్రి సలహాదారు షబ్బీర్ అలీ, వక్ఫ్ బోర్డు చైర్మన్ అజ్మత్ ఉల్లా హుస్సేని ,ఇతర ఉన్నతాధికారులకు ఆయన లేఖలు పంపారు.

**బీబీ కా ఆలం ఊరేగింపు కోసం సొంత ఏనుగులను కొనుగోలు చేయాలని విజ్ఞప్తి**

హైదరాబాద్‌లోని చారిత్రాత్మక మొహ్రం ఊరేగింపు నిర్వహణలో ఎదురవుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, తెలంగాణ ప్రభుత్వమే సొంతంగా రెండు ఏనుగులను కొనుగోలు చేయాలని ఎం బి టీ స్పొక్స్ పర్సన్ అమ్జెద్ ఉల్లా ఖాన్ ముఖ్యమంత్రికు విజ్ఞప్తి చేశారు.

ఇతర రాష్ట్రాల నుండి ఏనుగులను తీసుకురావడం ప్రభుత్వానికి పెను సవాలుగా మారుతోంది. రవాణా పరంగా ఎదురయ్యే ఇబ్బందులతో పాటు, బయటి నుండి వచ్చే ఏనుగులకు స్థానిక వాతావరణం మరియు భారీ జనం మధ్య నడవడంలో తగిన శిక్షణ ఉండటం లేదన్నారు. దీనివల్ల ఊరేగింపు సమయంలో ఏనుగులు అదుపు తప్పే అవకాశం ఉందని, ఇది పోలీసు శాఖకు శాంతిభద్రతల నిర్వహణలో పెద్ద సమస్యగా మారుతుందని తెలిపారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు.



# స్థానిక ఎన్నికల్లో బలపడ్డాం

**బీజేపీ అధ్యక్షుడు రామచంద్రరావు**

**యాదాద్రిభువనగిరి, డిసెంబర్ 18:** స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజాప్రతినిధులుగా ఎన్నికైన బీజేపీ సర్పంచ్, ఉపసర్పంచ్‌లకు జరిగిన సన్మాన కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు పాల్గొన్నారు. దీనిలోభాగంగా ఆయన మాట్లాడుతూ.. ' యాదాద్రి భువనగిరి జిల్లాలో 4 సర్పంచులు 20 మంది ఉపసర్పంచ్లు 1000 వార్డులు గెలిచాం. రాష్ట్రంలో 900 సర్పంచులు 1200 ఉపసర్పంచ్లు 10,000 మంది వార్డులను గెలిచాం. గతంలో 162 సర్పంచ్ స్థానాలను ఉండేది. గ్రామీణ ప్రాంతాలలో కూడా బీజేపీ బలం పెరుగుతుంది. కాంగ్రెస్ పార్టీ అధికార బలంతో, అవినీతి, అరాచకంతో గెలిచింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం బీజేపీ పథకాల పేరు మార్చి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టింది. బీఆర్ఎస్ పార్టీ పని అయిపోయింది వారి అవినీతి గురించి వారి కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజాపాలనలో మినిస్టర్ పీఏలు తుపాకులు పెట్టి బెదిరిస్తున్నారు, రాజ్యాంగం మీద గౌరవం లేని వ్యక్తి రాహుల్ గాంధీ. బీఆర్ఎస్ పార్టీనే ఫిరాయింపుల మొదటి ప్రోత్సహించింది. ప్రభుత్వం ఒత్తిడితో స్పీకర్ రాజ్యాంగం వ్యతిరేకంగా తీర్పు ఇచ్చారు. రాహుల్ గాంధీ సోనియాగాంధీ వారి వారి కేసులలో బెయిల్ పై ఉన్నారు. బీజేపీ వారిపై కేసు పెట్టలేదు దర్యాప్తు సంస్థలు కేసు పెట్టాయి. మా పార్టీ కార్యాలయంలపై దాడి చేస్తే లా అండ్ ఆర్డర్ ప్రాబ్లమ్ వస్తే కాంగ్రెస్ పార్టీదే పూర్తి బాధ్యత' అని రామచంద్రరావు పేర్కొన్నారు.

# సీఎం రేవంత్ రెడ్డి నిర్వాకం

**రెండుసార్లు రైతుభరోసాకు ఎగనామం**

**మాజీ మంత్రి హరీష్‌రావు విమర్శలు**



**మెదక్, డిసెంబర్ 18:** రేవంత్ రెడ్డి వచ్చాక రెండు సార్లు రైతు భరోసా ఎగ్గొట్టారని మాజీ మంత్రి హరీష్‌రావు అన్నారు. వ్యవసాయానికి కరెంట్, నీళ్ల అవసరం అయితే కాంగ్రెస్ మాత్రం యాప్‌లు, మ్యాప్‌లు కావాలి అంటుందన్నారు. తాజాగా మెదక్‌లో ఆయన మాట్లాడారు. రేవంత్ రెడ్డి వచ్చాక బస్ ఛార్జీలు రెండేళ్లలో రెండింతలు పెరిగాయి.. కాంగ్రెస్, బీజేపీ పార్టీలు రైతు వ్యతిరేక ప్రభుత్వాలని ఆరోపించారు. రైతులకు యూరియా సరిపడ రెండు ప్రభుత్వాలు ఇవ్వట్లేదు.. కాంగ్రెస్ చేసే తుగ్లక్ పనులతో కౌలు రైతులు, రైతుల మధ్య పంచాయితీ జరుగుతుందని విమర్శించారు. ఎరువుల కోసం యాప్ తెచ్చి రైతులను కాంగ్రెస్ పార్టీ మోసం చేస్తుంది.. సింగూరు ప్రాజెక్టుపై ఆధారపడ్డ రైతులకు క్లారిటీ ఇవ్వాలన్నారు. ఒక వేళ నీళ్లు ఇవ్వకుంటే ప్రకటన విడుదల చేసి నష్ట పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పాలనలో రైతులకు అడుగడుగునా కష్టాలే.. ఈ రోజు వరకు కూడా 40 శాతం రైతులకు మాత్రమే రుణమాఫీ జరిగిందని చెప్పారు.కాంగ్రెస్ ప్రభుత్వం రైతు అంశాల్లో ఫెయిల్ అయ్యిందని మాజీ మంత్రి హరీష్‌రావు అన్నారు. 'యాసంగి 1200 కోట్ల బోనస్, వర్షాకాలం రూ. 600 కోట్ల బోనస్ నగదు ఇప్పటి వరకు ఇవ్వలేదు.. రైతు భరోసా ఇప్పటివరకు ఇవ్వలేదు.. మెదక్ రైతులు అగమ్యగోచరంగా ఉన్నారు.. ఘనపురం అనకట్ట నుంచి యాసంగి పంటకు నీళ్లు ఇస్తారా లేదా క్లారిటీ లేదు.. సింగూరు ప్రాజెక్టు మరమ్మతుల పేరిట నీళ్లు ఖాళీ చేస్తున్నారు.. గత వేసవిలో ప్రాజెక్టు మరమ్మతులు చేసే అవకాశం ఉన్నా చేయలేదు.. ప్రభుత్వం నుంచి స్పష్టత కోసం రైతులు ఎదురు చూస్తున్నారు.. సింగూరు ప్రాజెక్టు ఉమ్మడి మెదక్, నిజామాబాద్ జిల్లాలో వ్యవసాయానికి జీవనాధారం.. పదేళ్ల ఃఖా పాలనలో బోరు బండ్లు లేవు.. ఇప్పుడు మళ్ళీ బోరు బండ్లు వచ్చాయి..' అని వ్యాఖ్యానించారు.

# బెళగావి రైలు బోగీలో మంటలు

**రైలును నిలిపి మంటలను ఆర్పిన సిబ్బంది**

**హైదరాబాద్, డిసెంబర్ 18:** హైదరాబాద్ నుంచి బెళగావి వెళ్తున్న స్పెషల్ రైలు బోగీల కింద ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి రైల్వేస్టేషన్ సమీపంలో ఈ ప్రమాదం జరిగింది. మంటలను గమనించిన రైల్వే సిబ్బంది వెంటనే రైలును నిలిపివేసి.. మంటలను అదుపులోకి తీసుకువచ్చింది. ఒక్కసారిగా ఉన్నట్టుండి రైలులో మంటలు రావడంతో ప్రయాణీకులు ఆందోళనకు గురయ్యారు. అయితే, ఎవరికీ ఏమీ కాకపోవడంతో పెను ప్రమాదం తప్పినట్లయ్యింది. బ్రేక్ జామ్ అవడం వల్లే మంటలు చెలరేగి ఉంటాయని భావిస్తున్నారు. మంటలను అదుపులోకి తీసుకువచ్చిన తర్వాత రైలు తిరిగి బెళగావికి బయలుదేరి వెళ్లింది. ఈ ప్రమాదానికి సంబంధించి ఇంకా పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది.

# నాంపల్లి కోర్టుకు బాంబు బెదిరింపు

**హైదరాబాద్, డిసెంబర్ 18:** నాంపల్లి కోర్టుకు బాంబు బెదిరింపు వచ్చింది. కోర్టులో బాంబు పెట్టామంటూ గుర్తుతెలియని వ్యక్తులు బెదిరింపులకు పాల్పడ్డారు. ఈ రోజు ఉదయం 11.30 గంటల ప్రాంతంలో బెదిరింపు మెయిల్‌ను పంపారు. నేడు రెండు గంటల సమయంలో కోర్టును పేల్చివేస్తామంటూ దుండగులు ఆ మెయిల్‌లో పేర్కొన్నారు. దాంతో కోర్టులో ఉన్న వారిని పోలీసులు బయటకు పంపిస్తున్నారు. కోర్టు హాల్స్ మొత్తం కాళీ చేపిస్తున్నారు. బాంబు బెదిరింపుతో ఒక్కసారిగా అలర్ట్ అయిన పోలీసులు. వెంటనే బాంబ్ డిస్పోజల్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ టీం రంగంలోకి దిగి తనిఖీలు చేపట్టారు. కోర్టు ఆవరణలో అణువణువూ గాలిస్తున్నారు. అయితే ఇప్పటివరకు ఎలాంటి పేలుడు పదార్థాలు లభించినట్లు అధికారిక సమాచారం లేదు.




సంపాదకీయం

# ఆ పదిమందిని బీఆర్ఎస్ ఆహ్వానించాలి!

ప్రజాప్రతినిధులు పార్టీలు మారడం అన్నది అనైతికమని అందరూ అనుకుంటున్నా.. కాదని తేలిపోయింది. ఎవరు ఎటుపోయినా కిమ్మనకుండా ఉంటే మంచిది. దీనికోసం కోర్టులు, విచారణలు అవసరం లేదని తెలంగాణ ఎమ్మెల్యేల ఫిరాయింపులు స్పష్టం చేశాయి. నిజానికి ఫిరాయింపులకు ఏ పార్టీ కూడా మినహాయింపు కాదు. కాకపోతే దానికి రకరకాల పేర్లు పెట్టి పిలిచారు. తెలంగాణ ఏర్పడ్డ తరవాత టిఆర్ఎస్ అధినేతగా ఉన్న కెసిఆర్ ఆనాడు నిర్లజ్జగా ఇతర పార్టీల ఎమ్మెల్యేలను తమ పార్టీలో చేర్చుకున్నారు. అలాగే ఇద్దరు ఎమ్మెల్యేలను అకారణంగా అసెంబ్లీ నుంచి సస్పెండ్ చేయించారు. జర్మనీ పౌరసత్వం ఉన్న చెన్నమనేని రమేశ్‌ను రెండు పర్యాయాలు ఎమ్మెల్యేను చేసి కథ నడిపించారు. ఇవన్నీ అనైతికమైతే... పదిమంది పార్టీ మారడం కూడా అనైతికం అవుతుంది. లేదంటే చెల్లుకు చెల్లు అని సరిపెట్టుకోవాల్సిందే. ఇక ఎలాటూ ఆ పదిమంది తాము బిఆర్ఎస్‌లోనే ఉంటున్నామని చెప్పడం ద్వారా వారికి తిరిగి గులాబీ కండువా కప్పి తెలంగాణ భవన్‌లో సన్మానించాలి. ఇవన్నీ మరచి ఇప్పుడు తమ పార్టీకి చెందిన వారు కాంగ్రెస్‌లో చేరితే గగ్గోలు పెట్టారు. సుప్రీం తీర్పు, తరవాత స్పీకర్ తీర్పు దరిమిలా సమాజంలో పెద్దగా మార్పు కనిపించదు. ఎందుకంటే నైతికతకు తావులేని చోట తీర్పులు ఇలాగే ఉంటాయి. కొండను తవ్వి ఎలుకను పట్టిన చందంగా ఇప్పుడు ఫిరాయింపులపై తేలిందంతే. ఎమ్మెల్యేలంతా తాము బిఆర్ఎస్‌లోనే ఉన్నామంటున్నారు. స్పీకర్ కూడా అదే చెప్పారు. కనుక ఈ పదిమంది ఎమ్మెల్యేలను స్వాగతించి, ప్రచారం చేసుకోవడం ద్వారా బిఆర్ఎస్ చతురత ప్రదర్శించాలి. ఆ పదిమందిని పార్టీ కార్యక్రమాలకు ఆహ్వానించాలి. అప్పుడు వారి రంగు తెలుస్తుంది. ఇకపోతే రాజ్యాంగానికి అన్యాయం జరిగిందంటూ. ఓట్ చోరీ అంటూ గగ్గోలు పెడుతున్న కాంగ్రెస్ నేతలు ఇకనుంచి ఈ రకమైన అరుపులు మానేయాలి. రాజ్యాంగం ప్రకారం ముందు వారు నడవడం నేర్చుకోవాలి. రాహుల్ పార్లమెంట్‌లో ఒకమాట బయట మరోమాట మాట్లాడడం మానాలి. నీతిమాలిన రాజకీయాలను పక్కన పెట్టాలి . హర్యానాలో కాంగ్రెస్ నుంచి గెలిచి బీజేపీలో చేరిన ఎమ్మెల్యేలపై ఫిరాయింపు నిరోధక చట్టాన్ని ప్రయోగించి వెంటనే వారిపై అనర్హత వేటు వేయాలని ఆనాడు కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. ఫిరాయింపు చట్ట ప్రయోగానికి సాంకేతికత కంటే నైతికతే ప్రామాణికమని ఆ రాష్ట్ర శాసనసభ స్పీకర్‌కు సూచించింది. మరోవైపు కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ భారత రాజ్యాంగ రక్షకుడిని తానే అన్నంతగా రాజ్యాంగ ప్రతిని చేతిలో పట్టుకొని రాష్ట్రాలు తిరుగుతూ ఫొటోలకు పోజులిస్తుంటారు. మోడీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని కాలరాస్తోందని అంటున్నారు. ఒక్క మోడీయే కాదు..దేశమంతా ఇలాగే తగులబడింది. అధికారానికి అలవాటు పడ్డ పార్టీలు ఇంతకన్నా భిన్నంగా చేయలేవు. రాజ్యాంగ రక్షణ విషయంలో దేశమంతా ఒకే విధానం ఉండాలి. రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ సాంకేతిక కారణాలను చూపుతూ ఫిరాయింపు ఎమ్మెల్యేలు బిఆర్ఎస్‌లోనే ఉన్నారని తేల్చారు. ఫిరాయింపు ఎమ్మెల్యేలపై బీఆర్ఎస్ దాఖలు చేసిన అనర్హత పిటిషన్లను కొట్టివేశారు. కారు గుర్తు మీద గెలిచి కాంగ్రెస్‌లో చేరిన 10 మంది ఎమ్మెల్యేల్లో ఐదుగురు గోడ దూకినట్టు నిర్ధారించేందుకు తగినన్ని భౌతిక ఆధారాలు లేవని, సాంకేతికంగా వారు బీఆర్ఎస్‌లోనే కొనసాగుతున్నారని స్పీకర్ పేర్కొన్నారు. ఫిరాయింపు ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావు (భద్రాచలం), బండ్ల కృష్ణమోహన్ రెడ్డి (గద్వాల), గూడెం మహిపాల్ రెడ్డి (పటాన్ చెరు), ప్రకాశ్ గౌడ్ (రాజేంద్రనగర్), అరికెపూడి గాంధీ (శేరిలింగంపల్లి)పై దాఖలైన పిటిషన్లను స్పీకర్ కొట్టివేశారు. ఎమ్మెల్యేలు పార్టీ మారారని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు చేసిన ఆరోపణలను నిరూపించడానికి అవసరమైన ఆధారాలను సమర్పించలేదని పేర్కొన్నారు. ఈ క్రమంలో ఇప్పుడు బిఆర్ఎస్ కూడా నైతికత ప్రదర్శించాలి. ఈ ఎమ్మెల్యేలను తిరిగి పార్టీలోకి ఆహ్వానించి గులాబీ కండువా కప్పాలి. అప్పుడు వారు వస్తారా లేదా అన్నది వారి ఇష్టం లేదంటే బిఆర్ఎస్‌లోనే మరో గ్రూపుగా అయినా ఉండిపోతారు. నిజానికి గతంలో వేములవాడ ఎమ్మెల్యే విషయంలో బిఆర్ఎస్ కూడా అనైతికతకు పాల్పడింది. ఆయనకు జర్మనీ పౌరసత్వం ఉందని తెలిసినా కులగజ్జితో ఎమ్మెల్యేను చేశారు. రెండుసార్లు ఎమ్మెల్యేగా సకల సౌఖ్యాలు అనుభవించారు. దీనిపై ఆనాడు ఫిర్యాదు వచ్చిన వెంటనే కెసిఆర్ స్పందించలేదు. ఈ వ్యవహారం కోర్టుల్లో తేలడానికి పదేళ్లు పట్టింది. అందుకే పదిమంది ఎమ్మెల్యేలు పార్టీ ఫిరాయించారంటూ బీఆర్ఎస్ ఇచ్చిన ఫిర్యాదులపై వాదించే అధికారం బిఆర్ఎస్ నైతికంగా కోల్పోయింది. రాజకీయాల్లో కఠిన చట్టాలను తుంగలో తొక్కుతున్నదే ప్రజాప్రతినిధులు అన్నది మరచిపోరాదు. ఫిరాయింపులపై బీఆర్ఎస్ వరింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తోపాటు మరి కొందరు ఎమ్మెల్యేలు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఫిరాయింపుదారులను విచారించి వారిపై చర్యలు తీసుకోవడంలో జాప్యాన్ని ఆక్షేపించారు. స్పీకర్ సాగదీత ధోరణిపై సుప్రీంకోర్టు ధర్మాసనం పలుమార్లు ఆగ్రహం వ్యక్తంచేసింది. ఫిరాయింపుపై మూడు నెలల్లో తేల్చాలని తొలుత జూలై 31న ఆదేశించింది. అక్టోబర్ 21తో గడువు ముగిసినా తేల్చక పోవడంపై కోర్టు సీరియస్ అయ్యింది. నవంబర్ 17న మరోసారి సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. తెలంగాణ శాసనసభ స్పీకర్ కోర్టు ధికరణకు పాల్పడ్డారని సీరియస్ అయ్యింది. నాలుగు వారాల్లోగా విచారణ పూర్తిచేయాలని, లేదా నూతన సంవత్సర వేడుకలు ఎక్కడ జరుపుకోవాలను కుంటున్నారో నిర్ణయించుకోండి' అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేసింది. నిజానికి సుప్రీం కనుక తన తీర్పును స్పీకర్ కోర్టులోకి నెట్టకుండా నేరుగా నిర్ణయం తీసుకుని తీర్పు ఇచ్చివుంటే పరిస్థితి మరోలా ఉండేది. పక్కా అఫిడవిట్లు, ఫొటోలు, బహిరంగ ప్రకటనలు, సోషల్ మీడియా పోస్టులు, అనేక నెలలుగా కాంగ్రెస్ కార్యక్రమాల్లో ఎమ్మెల్యేల భాగస్వామ్యాన్ని స్పష్టంగా నివేదించినా అవేవీ పరిగణనలోకి తీసుకోకుండా స్పీకర్ సాంకేతికంగా ఇప్పటికీ బీఆర్ఎస్‌తోనే ఉన్నారని పేర్కొనడంపై పెద్దగా ఆశ్చర్య పడాల్సిన పనిలేదు. పార్టీ ఫిరాయింపుల విషయంలో వెలువడిన నిర్ణయం రాజకీయ పార్టీలకు కనువిప్పు కావాలి. తమకు మాత్రం వ్యతిరేకమైన సందర్భాల్లో మాత్రమే స్పందించడం కాదు...ఎప్పుడూ ఒకేలా ఉండాలి. దీనికి భిన్నంగా ఏదో జరుగుతుందని కూడా ఎవరూ అనుకోవద్దు. ప్రజాజీవితంలో నైతిక విలువలు పూర్తిగా లుప్తమైన స్థితిలో ఇలాంటి అనైతికత ఓడుతుందని నైతికత గెలుస్తుందనీ ఎదురుచూడటం అత్యాశే అవుతుంది.

# 'వీబీ జీ రామ్ జీ' బిల్లుకు లోక్‌సభ ఆమోదం

- లోక్‌సభలో ప్రతులు చించి నిరసన తెలిపిన విపక్షం
- వెల్‌లోకి దూసుకెళ్లి పప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన
- మహాత్ముడి పేరు మార్పు దుర్మార్గమని విమర్శలు
- గాంధీ ఆశయాలను ముందుకు తీసుకు వెళ్తున్నమన్న శివరాజ్‌సింగ్






**న్యూఢిల్లీ, డిసెంబర్ 18:** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం స్థానంలో 'వీబీ జీ రామ్ జీ' పేరుతో తీసుకువచ్చిన బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది. ప్రతిపక్ష ఎంపీల ఆందోళనలు, నిరసనల మధ్య ఈ బిల్లును ఆమోదించారు. అయితే, బిల్లును స్టాండింగ్ కమిటీకి పంపించాలని డిమాండ్ చేస్తూ ప్రతిపక్ష సభ్యులు వెల్‌లోకి దూసుకొచ్చి నిరసన వ్యక్తం చేశారు. విపక్ష సభ్యుల నిరసనలపై స్పందించిన స్పీకర్.. ఓం బిర్లా బిల్లుపై సుదీర్ఘంగా చర్చించారని చెప్పారు. 'మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం' ఎంజీనరేగాను రద్దు చేసి దాని స్థానంలో కొత్త చట్టం తీసుకొచ్చేందుకు ఉద్దేశించిన 'వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్-గ్రామీణ్' (వీబీ జీ రామ్ జీ) బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది. ఈ బిల్లుపై చర్చ సందర్భంగా విపక్షాలు పెద్దఎత్తున నిరసన వ్యక్తంచేశాయి. వారి ఆందోళన నడుమ స్పీకర్ ఓటింగ్ నిర్వహించగా.. బిల్లుకు ఆమోదం లభించింది. ఈ సమయంలో విపక్ష ఎంపీలు వెల్‌లోకి వచ్చి నిరసన చేపట్టాయి. కొందరు ప్రతిపక్ష నేతలు 'వీబీ జీ రామ్ జీ' బిల్లు ప్రతులను చించి విసిరేశారు. ఈ గందరగోళం నేపథ్యంలో లోక్‌సభ శుక్రవారానికి వాయిదా పడింది.అంతకుముందు బిల్లు తీరుపట్ల మరింత ఆగ్రహానికి గురైన విపక్ష సభ్యులు.. బిల్లు ప్రతులను చించి పడేశారు. వీరి ఆందోళనల మధ్యే బిల్లు ఆమోదం పొందినట్లు స్పీకర్ ప్రకటించారు. ఇక లోక్‌సభలో బిల్లు ఆమోదం పొందిన నేపథ్యంలో.. ఈ బిల్లును రాజ్యసభలో ప్రవేశపెట్టనున్నారు. కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా, డీఎంకే నాయకులు టీఆర్ బాలు, సమాజ్‌వాదీ పార్టీ నాయకులు ధర్మేంద్ర యాదవ్ సహా పలువురు విపక్ష పార్టీల సభ్యులు.. జీ రామ్‌జీ బిల్లును తీవ్రంగా వ్యతిరేకించారు. బిల్లుకు వ్యతిరేకంగా సభలో ఆందోళన చేపట్టారు. ఈ పథకానికి మహాత్మాగాంధీ పేరును తొలగించడం అంటే జాతిపితను అవమానించడమేనని, కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ఈ బిల్లుతో రాష్ట్రాలపై మరింత భారం పడుతుందని ఆరోపించారు. మరోవైపు జీ రామ్‌జీ బిల్లును కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ సమర్థించారు. బిల్లుపై లోక్‌సభలో మాట్లాడిన శివరాజ్ సింగ్.. కాంగ్రెస్ ప్రభుత్వం అనేక పథకాలకు నెహ్రూ పేరును పెట్టిందని గుర్తుచేశారు. ఇప్పుడు ఎన్డీయే ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తోందని విమర్శించారు. ప్రభుత్వానికి పేర్లు మార్చాలనే దురుద్దేశం ఉందంటూ ప్రియాంక వ్యాఖ్యలను సైతం ఆయన ఖండించారు. పేర్లు మార్చాలనే ఉద్దేశం కేవలం ప్రతిపక్ష పార్టీలకు మాత్రమే ఉందన్నారు. ప్రధాని నేతృత్వంలోని తమ ప్రభుత్వం కేవలం పనిపై మాత్రమే దృష్టి పెడుతోందని చెప్పుకొచ్చారు. అందరితో చర్చించిన తర్వాతే కొత్త చట్టాన్ని తీసుకువచ్చామని కేంద్రమంత్రి ఉద్ఘాటించారు. కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ కామెంట్స్‌పై ప్రతిపక్ష సభ్యులు మరింత ఆగ్రహం వ్యక్తం చేశారు. పలువురు ఎంపీలు సభ వెల్‌లోకి ప్రవేశించి.. బిల్లుకు వ్యతిరేకంగా నిరసన తెలిపారు. బిల్లు ప్రతులను చించేశారు. ఈ సందర్భంగా స్పీకర్ ఓం ప్రకాశ్ బిర్లా మాట్లాడుతూ.. 'కాగితాలను చించివేయడానికి ప్రజలు మిమ్మల్ని ఇక్కడికి పంపలేదు. దేశం మిమ్మల్ని చూస్తోంది.' అని విపక్ష సభ్యులను హెచ్చరించారు. అంతకుముందు బిల్లుపై చర్చ సందర్భంగా విపక్షాల ఆరోపణలకు కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ బదులిచ్చారు. మహాత్మాగాంధీ సిద్ధాంతాలకు అనుగుణంగానే మోదీ ప్రభుత్వం పలు సంక్షేమ కార్యక్రమాలు చేపడుతోందన్నారు. బాపూ సిద్ధాంతాలను కాంగ్రెస్ సర్కారు చంపేసింది. కానీ, ఎన్డీయే ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం పనిచేస్తోంది. పీఎం ఆవాస్ యోజన, ఉజ్వల యోజన, స్వచ్ఛభారత్ మిషన్, ఆయుష్మాన్ భారత్ వంటి పథకాలతో గాంధీజీ కలలను మేం సాకారం చేస్తున్నాం అని తెలిపారు. ఈ సందర్భంగా గత కాంగ్రెస్ పాలనపై ఆయన విరుచుకుపడ్డారు. తొలుత ఉపాధి హామీ పథకానికిఎన్ఆర్‌జిఎ అనే పేరు ఉండేది. ఆ తర్వాత 2009లో లోక్‌సభ ఎన్నికల సమయంలో ఓటర్లను ఆకర్షించేందుకు నాటి కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పథకానికి మహాత్మాగాంధీ పేరు చేర్చింది. అంతేకాదు.. వారి హయాంలో ఈ పథకం అమలులో అనేక లోటుపాట్లు చోటుచేసుకున్నాయి. కూలీలపై ఎక్కువ ఖర్చు చేసి.. మెటీరియల్ కొనుగోలుకు తక్కువ వెచ్చించారని చౌహాన్ మండిపడ్డారు. పేరు మార్పుపై కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ విమర్శలను ప్రస్తావిస్తూ.. గతంలోనే అనేక పథకాలకు కాంగ్రెస్ గాంధీ-నెహ్రూ పేర్లు పెట్టిన విషయాన్ని గుర్తుచేశారు. పల్లె ప్రాంత నిరుపేదలకు ఉపాధి కల్పించడం ద్వారా వారి జీవన ప్రమాణాలను మెరుగుపరచడం, గ్రామీణ ప్రాంతాల్లో సుస్థిర ఆస్తుల కల్పన, వనరుల ఉత్పాదకత, అభివృద్ధి లక్ష్యాలుగా దాదాపు రెండు దశాబ్దాల కిందట 'ఎన్ఆర్ఈజీఏ' చట్టాన్ని 2005లో అప్పటి యూపీఏ ప్రభుత్వం తీసుకొచ్చింది. తర్వాత 2009లో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టంగా పేరు మార్చారు. అనంతరం సభను వాయిదా వేశారు.

## మహాత్ముడిని అవమానించారు

రాష్ట్రాలపై భారం మోపేలా బిల్లు: ప్రయాంక



**న్యూఢిల్లీ, డిసెంబర్ 18:** మహాత్మాగాంధీని అవమానించేందుకే కొత్తగా జి రామ్ జీ బిల్లును తీసుకుని వచ్చారని కాంగ్రెస్ ఎంపి ప్రియాంకగాంధీ ఆరోపించారు. సభ వాయిదా పడిన తరువాత పార్లమెంట్ వెలుపల ప్రియాంక గాంధీ వాద్రా మీడియాతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన జీ రామ్‌జీ బిల్లును ప్రతిపక్షాలు తీవ్రంగా వ్యతిరేకించాయన్నారు. 'బిల్లులోని వివరాలను చదివిన ఎవరికైనా గ్రామీణ ఉపాధి హామీ పథకం ఎలా పూర్తి కాబోతోందో అర్థమవుతుంది. ఈ బిల్లు వలన రాష్ట్రాలపై మరింత ఆర్థిక భారం పడనుంది. రాష్ట్రాలు ఆర్థికంగా ఇబ్బంది పడే అవకాశం ఉంది. నరేగా పథకం పేదలకు అండగా ఉండేది. కానీ, ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన బిల్లు పేదలకు పూర్తి వ్యతిరేకంగా ఉంది.' అంటూ కేంద్ర ప్రభుత్వం తీరుపై ప్రియాంక తీవ్ర విమర్శలు చేశారు.

## సభలో విపక్షం తీరు దారుణం

ప్రతులను చించివేయడం సభను అవమానించడమే

కేంద్రమంత్రులు బఘేల్, చిరాగ్ పాశ్వాన్

**న్యూఢిల్లీ, డిసెంబర్ 18:** కేంద్ర మంత్రి ఎస్పీ సింగ్ బఘేల్ మాట్లాడుతూ.. లోక్‌సభలో విపక్ష సభ్యులు వ్యవహరించిన తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సభలో బిల్లు కాగితాలను చించివేశారని.. ఇది ఖండించాల్సిన అంశమన్నారు. ప్రజాస్వామ్యంలో ఇలాంటి చర్యలకు చోటు లేదన్నారు. జీ రామ్‌జీ బిల్లుపై సుదీర్ఘంగా చర్చించారని.. అయినప్పటికీ విపక్ష సభ్యులు బిల్లు ప్రతులను చించడం దారుణమన్నారు. ప్రజల ప్రయోజనాల కోసమే ఈ బిల్లును తీసుకురావడం జరిగిందని కేంద్ర మంత్రి స్పష్టం చేశారు. కేంద్ర మంత్రి చిరాగ్ పాశ్వాన్ మాట్లాడుతూ.. లోక్‌సభలో ప్రతిపక్ష సభ్యులు వ్యవహరించిన తీరు ఏమాత్రం ఆమోదనీయం కాదన్నారు. 'మీకు వ్యతిరేకించే హక్కు ఉంది. కానీ, ఈ రకమైన ప్రవర్తన సరికాదు. బిల్లు ప్రతులను చించివేయడం, విమానాలు తయారు చేయడం, స్పీకర్‌పై విసరడం సరికాదు. దేశంలోనే అతిపురాతన పార్టీగా చెప్పుకునే కాంగ్రెస్ పార్టీ సభ్యులు.. ఇలా ప్రవర్తించడం గర్హనీయం. బిల్లుకు పెట్టిన పేరును విపక్ష సభ్యులు వ్యతిరేకిస్తున్నారు. కానీ, రాముడి పేరు ఆ మహాత్మా గాంధీకి ఎంతో ఇష్టమైన పేరు. ఆయన తుదిశ్వాస విడిచే సమయంలోనూ 'హే రామ్' అనే అన్నారు.' అంటూ కేంద్ర మంత్రి పేర్కొన్నారు.

# ప్రైవేట్ రంగంలో అణు విద్యుత్

బిల్లుకు పార్లమెంట్ ఆమోదం

న్యూఢిల్లీ, డిసెంబర్ 18: అణు ఇంధన రంగంలో ప్రైవేటు భాగస్వామ్యాన్ని అనుమతించే బిల్లుకు పార్లమెంట్ ఆమోదం తెలిపింది. సస్టెయినబుల్ హార్నెసింగ్ అండ్ అడ్వాన్స్‌మెంట్ ఆఫ్ న్యూక్లియర్ ఎనర్జీ ఫర్ ట్రాన్స్‌ఫార్మింగ్ ఇండియా- శాంతి పేరుతో రూపొందించిన ఈ బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలపగా.. గురువారం రాజ్యసభలో మూజువాణి ఓటుతో ఆమోదం పొందింది. భాగస్వాముల్ని అనుమతించడం వల్ల పెట్టుబడులు, ఉద్యోగావకాశాలు కూడా పెరుగుతాయని అధికారపక్షం చెబుతోంది. ఈ బిల్లుపై చర్చకు మంత్రి జితేంద్రసింగ్ సమాధానమిస్తూ.. ఇతర పునరుత్పాదక ఇంధన వనరులతో పోలిస్తే అణుశక్తి ద్వారా నిరంతరాయ విద్యుత్ సరఫరాకు ఆస్కారం ఉంటుందని చెప్పారు. భద్రత విషయంలో ఆందోళన అక్కర్లేదున్నారు. రేడియేషన్ వల్ల ప్రజలకు హాని జరిగినట్లుగా ఎలాంటి ఆధారాలు లేవని స్పష్టంచేశారు. 2047 నాటికి 100 గిగావాట్ల అణు విద్యుదుత్పత్తిని సాధించాల్సి ఉందని గుర్తుచేశారు. ప్రైవేటు రాజ్యసభలో ఈ బిల్లుపై చర్చ సందర్భంగా ప్రైవేటు భాగస్వామ్యాన్ని విపక్ష ఎంపీలు తప్పుబట్టారు. దేశ సార్వభౌమత్వం, భద్రతపై దీనివల్ల ప్రభావం పడుతుందని తృణమూల్ ఎంపీ సాగరిక ఘోష్ ఆరోపించారు. ఈ బిల్లు చాలా ప్రమాదకరమని డీఎంకే ఎంపీ పీ విల్సన్ విమర్శించారు. ప్రైవేటుకు లాభాలు కట్టబెట్టడమే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశంగా కనిపిస్తోందన్నారు. ఈ బిల్లును సెలక్ట్ కమిటీకి పంపించాలని డిమాండ్ చేశారు. పునరుత్పాదక ఇంధనం ఉండగా.. న్యూక్లియర్ పవర్‌పై అంత ఆసక్తి దేనికని ఆప్ ఎంపీ సందీప్ పాఠక్ ప్రశ్నించారు. ఇదే భాజపా గతంలో భారత్- అమెరికా అణు ఒప్పందాన్ని వ్యతిరేకించిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తుచేశారు. చైనా, ఫ్రాన్స్, రష్యా వంటి దేశాల్లో అణు ఇంధన రంగం ప్రభుత్వం చేతిలోనే ఉందని, అమెరికాలో మాత్రమే 80 శాతం మేర ప్రైవేటు భాగస్వామ్యం ఉందని పేర్కొన్నారు. అమెరికా మోడల్ మనలాంటి దేశాలకు ఏమాత్రం సరికాదన్నారు. ఈ బిల్లును జేపీసీకి పంపించాలని బీజేడీ ఎంపీ ముజిబుల్లాఖాన్ డిమాండ్ చేశారు.





# ప్రధాని మోడీకి మరో గౌరవం

ఆర్డర్ ఆఫ్ ఒమన్' పురస్కారం ప్రదానం

**న్యూఢిల్లీ, డిసెంబర్ 18:** భారత ప్రధాని నరేంద్ర మోదీకి అంతర్జాతీయ స్థాయిలో మరో అరుదైన గౌరవం దక్కింది. బుధవారం ఇథియోపియా అత్యున్నత పురస్కారాన్ని అందుకున్న ప్రధాని మోదీ.. మరుసటి రోజే మరో అరుదైన ఘనతను దక్కించుకున్నారు. ఒమన్ దేశం కూడా తన అత్యున్నత పౌర పురస్కారంతో ప్రధాని మోదీని గౌరవించడం విశేషం. ప్రధాని మోదీ తన మూడు దేశాల పర్యటనలో భాగంగా చివరిగా ఒమన్‌లో పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా ఇరు దేశాల మధ్య పలు ఒప్పందాలు ఖరారయ్యాయి. భారత్, ఒమన్ దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేయడంలో చేసిన కృషికి గుర్తింపుగా ఒమన్ సుల్తాన్ హైతం బిన్ తారిక్.. మోదీకి 'ఆర్డర్ ఆఫ్ ఒమన్' పురస్కారాన్ని ప్రదానం చేశారు. 'ఆర్డర్ ఆఫ్ ఒమన్' అనేది ఒమన్, విదేశీయులకు ఇచ్చే అత్యంత విశిష్టమైన పౌర పురస్కారం.భారత్ - ఒమన్ దేశాల మధ్య దౌత్య సంబంధాలు ఏర్పడి 70 ఏళ్లు పూర్తయిన సందర్భంగా మోదీ ఒమన్‌లో పర్యటిస్తున్నారు. కాగా, ప్రధాని మోదీ ఇప్పటివరకు వివిధ దేశాల నుంచి 29 అత్యున్నత పౌర పురస్కారాలను అందుకున్నారు. ఇటీవల కువైట్ ప్రభుత్వం కూడా 'ఆర్డర్ ఆఫ్ ముబారక్ అల్-కబీర్'తో ఆయనను గౌరవించింది. బుధవారం ఇథియోపియా తన అత్యున్నత పురస్కారమైన 'నిషాన్ ఆఫ్ ఇథియోపియా'తో ప్రధాని మోదీని సత్కరించింది.

# శాంతిభద్రతల విషయంలో రాజీలేదు

**అమరావతి :** రాష్ట్రంలో శాంతిభద్రతలే ప్రభుత్వానికి ముఖ్యమని సీఎం చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ఇందుకోసం అధికారులు కఠినంగా ఉండాల్సిందేనని అన్నారు. పోలీసింగ్ అంటే భయం ఉండాలని స్పష్టం చేశారు. గురువారం జిల్లా కలెక్టర్ల సదస్సులో రెండోరోజు శాంతిభద్రతలపై జిల్లా ఎస్పీలు, కలెక్టర్లకు ముఖ్యమంత్రి చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ.. కొన్ని జిల్లాల్లో క్రైమ్ రేటు ఎక్కువగా ఉందని.. మరికొన్ని చోట్ల తక్కువగా ఉందన్నారు. కడప, అల్లూరి, ఏలూరు జిల్లాల్లో ప్రాపర్టీ సంబంధిత కేసులు ఎక్కువగా ఉండటానికి కారణం ఏమిటో విశ్లేషించాలని ఉన్నతాధికారులకు ఆయన సూచించారు. రాష్ట్రంలో 5.5 శాతం మేర నేరాల రేటు తగ్గిందని.. కానీ జిల్లాల మధ్య వ్యత్యాసం చాలా ఎక్కువగా ఉందని పేర్కొన్నారు. అన్నమయ్య, కోనసీమ, నెల్లూరు, గుంటూరు, తిరుపతి జిల్లాల్లో ఎందుకు నేరాలు అధికమయ్యాయో విశ్లేషించాలని అధికారులకు సూచించారు. రాష్ట్రంలో గతంతో పోలిస్తే 5.5 శాతం మేర నేరాల రేటు తగ్గిందని వెల్లడించిన డీజీపీ హరీష్ కుమార్ గుప్తా తెలిపారు. అలాగే మహిళలపై నేరాలు గణనీయంగా తగ్గాయన్నారు. ఈ సమావేశంలో రాష్ట్రంలో శాంతి భద్రతలపై డీజీపీ హరీష్ కుమార్ గుప్తా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. 16 జిల్లాల్లో నేరాలు బాగా తగ్గాయని.. మిగతా జిల్లాల్లో వేర్వేరు కారణాల వల్ల క్రైమ్ ట్రెండ్ పెరుగుతోందని వివరించారు. అన్నమయ్య లాంటి జిల్లాలో మైగ్రేషన్ లేబర్ కారణంగా నేరాలు జరుగుతున్నాయని ఆయన సోదాహరణగా వివరించారు. కిడ్నాపింగ్ లాంటి కేసులు తగ్గుముఖం పట్టాయని పేర్కొన్నారు. 56 శాతం మేర డిటెక్షన్ రేట్, 55 శాతం మేర రికవరీ రేటు ఉందన్నారు. ఎన్టీఆర్, పశ్చిమగోదావరి జిల్లాల సహా ఐదు జిల్లాల్లో సీసీటీవీల అనుసంధానంతో నేరాలు క్రమంగా తగ్గుముఖం పట్టాయని చెప్పారు. డీహెచ్ఎంఎస్.. ఆధునిక సాంకేతికత ద్వారా సీసీ కెమెరాల హెల్త్‌ను నమోదు చేస్తున్నామన్న ఈ సమావేశంలో విజయవాడ నగర పోలీస్ కమిషనర్ రాజశేఖర బాబు వివరించారు. నగరంలో నిఘా కోసం 10 వేల సీసీ కెమెరాల డ్యాష్ బోర్డును కమ్యూనిటీ సహకారంతో రూపొందించామన్నారు. ఫేస్ రికగ్నిషన్ కెమెరాల ద్వారా నిందితుల్ని పట్టుకునే ప్రయత్నం చేస్తున్నామని సీపీ రాజశేఖర్ బాబు వెల్లడించారు.

### 22ఎ భూ వివాదాల పరిష్కారానికి ప్రాధాన్యత

22ఎ భూముల వివాదాల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులకు సీఎం చంద్రబాబు సూచించారు. వచ్చే కలెక్టర్ల భేటీలో 22ఎ భూముల వివాదాల పరిష్కారంపై తొలి ఎజెండాగా చేపడతామని ఆయన తెలిపారు. ఇదే సమయంలో రెవెన్యూ శాఖపై సీఎం చంద్రబాబు సీరియస్ అయ్యారు. కొందరు ప్రొఫెషనల్స్ కావాలనే భూవివాదాలు సృష్టించే యత్నం చేస్తున్నారని సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాంటి వారిపై అవసరమైతే పీడీ యాక్ట్ పెట్టి కఠినంగా వ్యవహరించండని అధికారులకు సీఎం చంద్రబాబు సూచించారు. అలానే రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు నేరుగా ఓనర్లకు చేర్చేలా చర్యలు తీసుకోవాలని చంద్రబాబు ఆదేశించారు. ఈ క్రమంలో రెవెన్యూ శాఖపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సీరియస్ అయ్యారు. గురువారం కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో భూ వివాదాలు, 22ఎ భూములపై సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. హౌసింగ్‌లో పొజిషన్ సర్టిఫికెట్లు త్వరితగతిన క్లియర్ చేయాలని అధికారులకు తెలిపారు.



20-30 ఏళ్లుగా నివసిస్తున్న ఇళ్లకు పొజిషన్ సర్టిఫికేషన్ జారీ చేయాలని సీఎం తెలిపారు. విశాఖ, అనకాపల్లి సహా ఐదారు జిల్లాల్లో భూ కబ్జాలు నియంత్రించండని, భూకబ్జా ఫిర్యాదులపై తక్షణం కలెక్టర్లు, ఎస్పీలు చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబు తెలిపారు. నిందితుల్ని ఎట్టి పరిస్థితుల్లో వదిలిపెట్టకుండా చర్యలు తీసుకోండని ఎస్పీలకు చంద్రబాబు ఆదేశించారు. అలానే విశాఖలో భూ వివాదాల్లో నేతల జోక్యంపై డిప్యూటీ సీఎం పవన్ ప్రస్తావించారు. భూ వివాదాల్లో కొందరు రాజకీయ నేతల జోక్యం ఉంటోందని, ఆ అంశంలో తనకు ఫిర్యాదులు అందాయని సీఎం దృష్టికి పవన్ కల్యాణ్ తెచ్చారు. డిప్యూటీ సీఎం తెలిపిన అంశంపై సీఎం చంద్రబాబు స్పందిస్తూ.. భూ వివాదాల్లో రాజకీయ నేతల జోక్యాన్ని సహించొద్దని కలెక్టర్లు, ఎస్పీలను ఆదేశించారు. భూవివాదాల్లో రాజకీయ నేతలు జోక్యం చేసుకున్నారనే ఫిర్యాదులు రాకూడదని సీఎం చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు.

# ఢిల్లీ చేరుకున్న సీఎం చంద్రబాబు

### ఎకనమిక్ టైమ్స్ అవార్డుపై ఎంపీల హర్షం

### చంద్రబాబును సన్మానించిన టీడీపీ ఎంపీలు

**న్యూఢిల్లీ :** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడికి అరుదైన గౌరవం దక్కింది. ఎకనామిక్ టైమ్స్ సంస్థ 'బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ద ఇయర్' పురస్కారానికి ఆయనను ఎంపిక చేసింది. ఈ నేపథ్యంలో గురువారం న్యూఢిల్లీలో సీఎం చంద్రబాబు నాయుడును టీడీపీ ఎంపీలు ఘనంగా సన్మానించారు. సీఎం చంద్రబాబుకు బొబ్బిలి వీణను విజయనగరం ఎంపీ కె. అప్పలనాయుడు బహూకరించారు. సీఎం చంద్రబాబును కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు శాలువాతో సత్కరించారు. చంద్రబాబు నాయుడు నాయకత్వ శైలి ఎందరికో స్ఫూర్తినిస్తుందని ఎంపీలు ప్రశంసించారు. రాష్ట్రంలో రాష్ట్రాభివృద్ధితోపాటు పారిశ్రామికవృద్ధికి ఇంకా చాలా చేయాల్సి ఉందని ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. మరో వైపు కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కె. రామ్మోహన్ నాయుడు జన్మదినం ఈ రోజు కావడంతో సీఎం సన్మాన కార్యక్రమంలో ఆయన కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ ఉభయ సభల్లోని టీడీపీ ఎంపీలంతా పాల్గొన్నారు. మరోవైపు సీఎం చంద్రబాబు నాయుడు గురువారం సాయంత్రం న్యూఢిల్లీ చేరుకున్నారు. అనంతరం ఎంపీలో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన్ని ఎంపీలంతా సన్మానించారు. అనంతరం పలువురు కేంద్ర మంత్రులతో సీఎం సమావేశమయ్యారు. శుక్రవారం సైతం న్యూఢిల్లీలో సీఎం చంద్రబాబు బిజీ బిజీగా గడపనున్నారు. ఏపీకి సంబంధించిన పలు పెండింగ్ ప్రాజెక్టులు, రాష్ట్రానికి అవసరమైన కేంద్ర నిధులు, అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన అనుమతులతోపాటు ఆమోదం తెలిపే అంశాలపై కేంద్ర మంత్రులతో సీఎం చర్చించే అవకాశమున్నట్లు తెలుస్తోంది. మరోవైపు పార్లమెంట్ శీతాకాల సమావేశాలు రేపటితో అంటే.. డిసెంబర్ 19వ తేదీతో ముగియనున్నాయి. ఈ నేపథ్యంలో సీఎం చంద్రబాబు ఢిల్లీ పర్యటన ప్రాధాన్యత సంతరించుకుంది.


# చంద్రబాబుకు మరో అరుదైన గౌరవం



**అమరావతి :** ఏపీ సీఎం చంద్రబాబుకు 'బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ద ఇయర్' అవార్డు లభించింది. ప్రముఖ ఆంగ్ల మీడియా సంస్థ 'ఎకనమిక్ టైమ్స్' ఈ పురస్కారాన్ని ప్రకటించింది. ఈ మేరకు మంత్రి నారా లోకేశ్ 'ఎక్స్'లో వెల్లడించారు. 'చంద్రబాబుకు ఈ అవార్డు రావడం రాష్ట్రానికి గర్వకారణం. రాష్ట్రంతో పాటు మా కుటుంబానికి ఇది ఎంతో ప్రతిష్ఠాత్మకం. సంస్కరణలను చంద్రబాబు ధైర్యంగా ముందుకు తీసుకెళ్లారని జ్యూరీ ప్రశంసించింది. పాలనలో సంస్కరణలు, వేగం, విశ్వాసంపై చూపిన నిబద్ధతకి ఈ అవార్డు నిదర్శనం. రాష్ట్రాభివృద్ధికి చంద్రబాబు నాయకత్వం దేశవ్యాప్తంగా ఆదర్శంగా నిలుస్తోంది. పెట్టుబడుల ఆకర్షణ, సంస్కరణాత్మక పాలనకు సీఎం స్ఫూర్తిగా నిలుస్తున్నదని లోకేశ్ పేర్కొన్నారు. ఇదిలావుంటే సీఎం చంద్రబాబుకి ఎకనమిక్ టైమ్స్ సంస్థ 'బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ద ఇయర్' పురస్కారాన్ని ప్రకటించడం సంతోషదాయకమని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. ఈమేరకు ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. చంద్రబాబు నాయకత్వ శైలి ఎంతో స్ఫూర్తినిస్తుంది. రాష్ట్రాభివృద్ధి కోసం, నవతరం భవిష్యత్తు కోసం ఆయన అమలు చేస్తున్న పాలనా విధానాలు, పారిశ్రామికవృద్ధికి చేపడుతున్న సంస్కరణలు కచ్చితంగా సత్ఫలితాలనిస్తాయి. ఆయనకు దక్కిన ఈ అవార్డు రాష్ట్రమంతటికీ గర్వ కారణంగా భావిస్తున్నాను. ఈ పురస్కారం ద్వారా రాష్ట్రానికి ఒక బ్రాండ్ ఇమేజ్ వస్తుందని పవన్ అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో వ్యాపార అనుకూల విధానాల అమలు, పారిశ్రామిక సంస్కరణలు, రాష్ట్రానికి పెద్దఎత్తున పెట్టుబడులు ఆకర్షిస్తున్నందుకు గానూ.. 'బిజినెస్ రీ ఫార్మర్ ఆఫ్ ది ఇయర్' అవార్డు ముఖ్యమంత్రి చంద్రబాబును వరించింది. మార్చిలో నిర్వహించనున్న ప్రత్యేక కార్యక్రమంలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చేతుల మీదుగా ఈ అవార్డును చంద్రబాబుకు ప్రదానం చేయనున్నారు. ముఖ్యమంత్రికి అవార్డు రావడం పట్ల మంత్రులు, అధికారుల నుంచి అభినందనలు వెల్లువెత్తాయి. ఈ అవార్డు తనకు లభించడంపట్ల సహచర మంత్రులు, అధికారులు, కలెక్టర్ల సమష్టి కృషి అని సీఎం చంద్రబాబు అన్నారు.

# జగన్ ఓ విజిటింగ్ పొలిటీషియన్

**అమరావతి :** రాష్ట్రంలో ఒక విజిటింగ్ పొలిటీషియన్ అభివృద్ధికి ఆటంకాలు కల్పిస్తున్నారని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ విమర్శించారు. కావాలని బలప్రదర్శనలు చేయడం ఆయనకు రివాజుగా మారిందన్నారు. గవర్నర్‌ని కలిసి కోటి సంతకాల సేకరణ అంటూ బాధ్యతా రాహిత్యంగా వ్యవహరిస్తున్నారంటూ వైఎస్ జగన్‌పై మంత్రి సత్యకుమార్ మండిపడ్డారు. ఈ మేరకు వైఎస్ జగన్మోహన్ రెడ్డి వైఖరిపై మంత్రి సత్య కుమార్ నిప్పులు చెరిగారు. ఈ రోజు అన్ని పరిధిలు దాటి చింత చచ్చినా పులుపు చావలేదన్న విధంగా ఆయన వ్యవహరించారని విమర్శించారు. మెడికల్ కాలేజిలో ఎవరైనా కన్‌స్ట్రక్షన్‌కు తీసుకుంటే తాము అధికారంలోకి వచ్చిన తర్వాత జైలుకు పంపుతాననడం అత్యంత హేయ-ంమైన వ్యాఖ్యలుగా ఆయన అభివర్ణించారు. ఈ వ్యాఖ్యలు ఆయన సంకుచిత మనస్తత్వానికి నిదర్శనమన్నారు. మీకు ధైర్యం ఉంటే ఈ శాఖను నిర్వహిస్తున్న తనను జైలుకు పంపాలని మాజీ సీఎం జగన్‌కు మంత్రి సత్యకుమార్ సవాల్ విసిరారు. ఈ విషయంలో ధైర్యం ఉంటే సీబీఐ విచారణ కోరండని సూచించారు. మీకు ధైర్యం ఉంటే తనను న్యాయస్థానాలు ద్వారా జైలుకు పంపాలని మాజీ సీఎం జగన్‌కు స్పష్టం చేశారు. వైద్య కళాశాలల నిర్మాణం కోసం ముందుకు వస్తున్న సంస్థలను బెదిరించడం సరికాదని వైఎస్ జగన్‌కు ఆయన హితవు పలికారు. 30 కేసులకుపైగా అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తి .. ఒక జైలు జీవి ఇలాంటి అసత్య ప్రచారం చేయడం ఏమిటని మంత్రి ప్రశ్నించారు. ఈ తరహా అహంకారపూరిత వ్యాఖ్యల వల్లే మిమ్మల్ని ఎన్నికల్లో ప్రజలు ఓడించారని గుర్తు చేశారు. ప్రభుత్వంలో ఏమైనా లోపభూయిష్ట విధానం ఉంటే దాని గురించి మాట్లాడాలంటూ జగన్‌కు సూచించారు. గతంలో మీరు నడిపిన ఆరోగ్యశ్రీ, క్యాథలాబ్‌లను కూడా పిపిపి అంటారా? అని సందేహం వ్యక్తం చేశారు. ఈ 18 నెల్లల్లో పేదల వైద్యం కోసం ఎన్టీఆర్ వైద్య సేవల పేరుతో రూ. 6 వేల కోట్లు ఖర్చు చేశారని వివరించారు. వైఎస్ జగన్ ఈ రకంగా మాట్లాడడం వాస్తవానికి దూరంగా ఉందన్న విషయాన్ని గుర్తించాలన్నారు. స్కాలర్‌షిప్‌ల విషయంలోనూ పెద్ద స్కాం చేశారని.. తమ తప్పును కప్పిపుచ్చడానికి ఈ తప్పులు వెతుకుతున్నారన్నారు. 420 పడకల ఆసుపత్రుల నిర్మాణానికి ఎక్కువ నిధులు కేటాయించారని.. వారు ప్రస్తుతం అవినీతి అని ఆరోపిస్తున్నారని పేర్కొన్నారు. జిల్లా ఆసుపత్రులు మెడికల్ కాలేజిలకు రూ.125 కోట్లు ఖర్చు అవుతుందంటున్నారన్నారు. ఈ రోజు సైతం జగన్ చెప్పిందే చెబుతున్నారని తెలిపారు. స్థాయి సంఘం కూడా ప్రభుత్వానికి ఆర్థికపరమైన ఇబ్బందులు ఉన్నాయని.. ఈ నేపథ్యంలో పిపిపికి వెళ్లడం తప్పు లేదని స్పష్టం చేసిందని గుర్తు చేశారు. పిపిపి అనేది ఎన్డీఏ ప్రభుత్వ విధానం..100 మంది జగన్మోహన్ రెడ్డిలు కట్టగట్టుకుని వచ్చినా ఎవర్ని ఏం చేయలేరని స్పష్టం చేశారు. రూ. కోటి 40 లక్షల కుటుంబాలకు రూ. 25 లక్షల వరకూ వైద్యం అందాలని ఎన్డీఏ ప్రయత్నం చేస్తుందని వివరించారు. అందుకు కొన్ని సంస్థలు ముందుకు వస్తున్నాయని తెలిపారు. జగన్ ఈ పరిస్థితి నుంచి బయటకు రాకుంటే.. వచ్చే ఎన్నికల్లో ఆయన పార్టీకి ఇప్పుడు వచ్చినన్ని సీట్లు కూడా రావని




జోస్యం చెప్పారు. జగన్ ఏదీ చేయడు తాటాకు చప్పుళ్లు చేస్తాడని వ్యంగ్యంగా అన్నారు. కాలేజిలు నిర్మాణం ఉండకూడదు.. విద్యార్థులకు సీట్లు రాకూడదు... పేదలకు వైద్య అందకూడదనేది వైఎస్ జగన్ నినాదంలా ఉందంటూ ఎద్దేవా చేశారు. జగన్ మానసిక పరిస్థితి చూస్తే.. ఆత్మనూన్యతా భావనలో ఆయన ఉన్నట్లు ఉన్నారన్నారు. ఇది ఒక రకమైన మానసిక స్థితి అని చెప్పారు. తొందరగా ట్రీట్‌మెంట్ చేయించుకోవాలని ఆయన సూచించారు. పిపిపి మోడ్‌లో ప్రభుత్వాసుపత్రులు రావడం వల్ల పేద విద్యార్థులకు సీట్లు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. పిపిపి మోడ్‌ను ప్రైవేటైజేషన్ అంటూ ఆయన సేకరిస్తున్నవి కోటి సంతకాలు కావని.. అవి కోడి గీతలంటూ ఎద్దేవా చేశారు. జగన్మోహన రెడ్డి పాలనలో ఐదు సంవత్సరాల్లో ఆయుష్ ప్రతిపాదనలు సైతం కేంద్రానికి పంప లేదని గుర్తు చేశారు. విశాఖపట్నం వేదికగా నిర్వహించిన యోగాకు రూ. 300 కోట్లు ఖర్చు కాలేదన్నారు. అది కేంద్ర ప్రభుత్వం కార్యక్రమం అని.. అందుకు నిధులు కేంద్రం నుండి వచ్చాయని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ స్పష్టం చేశారు.

## రాష్ట్రంలో మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ

# దేశంలో అతిపెద్ద స్కాం



మొదటి పేజీ తరువాయి

ఉద్యమం జరిగి ఉండదేమో?. గత అక్టోబరు 7న ప్రజా ఉద్యమ కార్యాచరణ ప్రకటించాం. ఆ తర్వాత అక్టోబరు 10 నుంచి ఈనెల 10 వరకు ప్రతి గ్రామం, పట్టణం, ప్రతి వార్డులో రచ్చబండ కార్యక్రమం ద్వారా మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ వల్ల కలిగే నష్టాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ.. వారిని ఉద్యమంలోకి తీసుకువచ్చాం. వాళ్ల సంతకాలు తీసుకున్నాం అని అన్నారు. నవంబర్ 12న ఒకసారి, మళ్లీ ఈనెల 10న మరోసారి అన్ని అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాల్లో భారీ ర్యాలీలు నిర్వహించాం. డిసెంబరు 10న ర్యాలీల తర్వాత కోటి సంతకాల పత్రాలను జిల్లా కేంద్రాలకు తరలించాం. అక్కడ డిసెంబరు 15న ర్యాలీలు నిర్వహించి, వాటిని ప్రజలకు చూపాం. ఆ తర్వాత వాటన్నింటినీ పార్టీ కేంద్ర కార్యాలయానికి తరలించి, గురువారం గవర్నర్‌కి చూపించాం. ఆ విధంగా మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణపై ప్రజల నిరసన, వారి మనోభావాలను వివరించామని అన్నారు. ఈరోజు మీ అందరి ద్వారా రాష్ట్ర ప్రభుత్వాన్ని గట్టిగా ప్రశ్నిస్తున్నాను. మనం తీసుకునే నిర్ణయాలు భవిష్యత్ తరాలకు ఎలాంటి ప్రభావం పడుతుందన్నది ఆలోచన చేయాలి. రాష్ట్ర ప్రభుత్వం స్కూల్స్ ఎందుకు నడుపుతుంది? దేశంలో అన్ని చోట్ల స్కూళ్లు, ఆస్పత్రులు, ఆర్టీసీ బస్సులను ప్రభుత్వమే ఎందుకు నడుపుతుందో ఆలోచించారా? రాష్ట్ర ప్రభుత్వమే వీటిని నడపకపోతే పేద, మధ్య తరగతి వారు ప్రైవేటును ఆశ్రయించలేక నష్టపోతారు. అందుకే రాష్ట్ర ప్రభుత్వాలు వాటిని ఒక బాధ్యతగా భావించి నిర్వహిస్తాయి. ఇలా అన్నీ ప్రైవేటీకరిస్తూ పోతే, దోపిడికి చెక్ పడదు. ప్రజా సేవలు పొందాలంటే ఆస్తులు అమ్ముకోవాల్సి వస్తుంది. కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఇన్‌పేషెంట్‌గా చేరాలంటే కనీసం రూ.5 వేలు ఛార్జ్ చేస్తారు. కనీస వసతుల రూమ్ కావాలంటే రోజుకు రూ.10 వేలు, ఐసీయూలో రోజుకు కనీసం రూ.50 వేలు చెల్లించాల్సి ఉంటుంది. అందుకే మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ ప్రభుత్వ అసంబద్ధ నిర్ణయం. మా ప్రభుత్వ హయాంలో ప్రతి పార్లమెంటు నియోజకవర్గాన్ని జిల్లాగా చేయడంతో పాటు, ప్రతి జిల్లా కేంద్రంలో మెడికల్ కాలేజీకి శ్రీకారం చుట్టాం. ఎక్కడైనా మెడికల్ కాలేజీ ఏర్పాటు చేస్తే, అక్కడ టీచింగ్ ఆస్పత్రి అందుబాటులోకి వస్తుంది. అప్పుడు ఆ ఆస్పత్రిలో, మెడికల్ కాలేజీలో అసిస్టెంట్ ప్రొఫెసర్లు, నర్సులు అందరూ అందుబాటులో ఉంటారు. దీంతో పేదలకు ఉచితంగా సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందుతాయి. దాని వల్ల చుట్టుపక్కల ఉన్న ప్రైవేటు ఆస్పత్రులు ఇష్టం వచ్చినట్లు ఛార్జ్ చేయలేవు. మేము నాడు తలపెట్టిన 17 మెడికల్ కాలేజీలు ప్రారంభమైతే, మన పిల్లలకు మరిన్ని మెడికల్ సీట్లు అందుబాటు లోకి వస్తాయి. దాని వల్ల వైద్య విద్య కోరుకునే పేద విద్యార్థులకు న్యాయం జరుగుతుందని జగన్ అన్నారు. ఇప్పుడు చంద్రబాబు ఆ పని చేయకపోగా, కొత్త మెడికల్ కాలేజీలను ప్రైవేటీకర్దిస్తూ, స్కామ్‌లు చేస్తున్నారు. స్కామ్‌ల విషయంలో చంద్రబాబు నాలుగు అడుగులు ఎక్కువ వేస్తున్నారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ ఒక స్కామ్ అయితే, ఆ తర్వాత రెండేళ్ల పాటు, ఆ కాలేజీల సిబ్బందికి ప్రభుత్వం జీతాలు ఇవ్వడం మరో స్కామ్. అంటే అక్కడున్న భూమి, భవనాలు, పని చేసే వారంతా ప్రభుత్వ ఉద్యోగులు. కానీ, నిర్వహణ మాత్రం ప్రైవేటువారిది. అంటే ఖర్చు ప్రభుత్వానిది. సంపద ప్రైవేటువారికి. ఒక మెడికల్ కాలేజీలో జీతాలు ఏడాదికి కనీసం రూ.60 కోట్లు. రెండేళ్లకు రూ.120 కోట్లు. అంటే ఆ లెక్కన 10 మెడికల్ కాలేజీల సిబ్బందికి రెండేళ్లపాటు జీతంగా కనీసం రూ.1200 కోట్లు అవుతుంది. ఇలాంటి స్కామ్‌లు దేశంలో ఎక్కడా ఉండవన్నారు. మా హయంలో ప్రతి చోట 50 ఎకరాలు ఉండేలా 17 మెడికల్ కాలేజీలకు శ్రీకారం చుట్టాం. వాటికి నాబార్డ్, ఇతర బ్యాంకులు, కేంద్ర ప్రభుత్వ నిధులు టైఅప్ చేశాం. వాటిలో 7 కాలేజీలు పూర్తి చేశాం. అవి ఇప్పుడు రన్నింగ్‌లో ఉన్నాయి. వాటి ద్వారా 800 మెడికల్ సీట్లు అందుబాటులోకి వచ్చాయి. మిగిలిన కాలేజీలు పూర్తి చేసేందుకు ఐదేళ్లలో రూ.5 వేల కోట్లు అవసరం. రూ.2 లక్షల కోట్ల బడ్జెట్ ఉన్న రాష్ట్ర ప్రభుత్వం కనీసం ఆ మాత్రం నిధులు ఖర్చు చేయలేదా అని ప్రశ్నించారు. పోనీ మీరు ఖర్చు చేయలేకపోతే వదిలేయండి. మేం వచ్చాక వాటిని పూర్తి చేస్తాం. చంద్రబాబుకు గట్టిగా తగిలేట్టుగా గవర్నర్ దృష్టికి అన్ని విషయాలు తీసుకెళ్లాం. మెడికల్ కాలేజీలు పూర్తి చేస్తే, మాకు క్రెడిట్ దక్కుతుందన్న అక్కసుతో చంద్రబాబు పేదలకు నష్టం చేస్తున్నారు. మరోవైపు ప్రైవేటీకరణతో స్కామ్‌లు చేస్తున్నారు. నిజానికి ఆ మెడికల్ కాలేజీలన్నీ భవిష్యత్‌లో లక్ష కోట్ల ఆస్తి అవుతాయి. ఇంకా కొన్ని కోట్ల మందికి ఉచిత వైద్యం అందిస్తూ, వెల కట్టలేని సేవలందిస్తూ కోట్లాది మందికి వెలుగులు నింపుతాయన్నారు. మా ఈ పోరాటం ఇంతటితో ఆగదు. గవర్నర్‌కి కోటి సంతకాలు చూపించాం. ఇక్కడి నుంచి రేపు కోర్టులో పిటిషన్ వేస్తాం. అక్కడ కూడా ఈ కోటి సంతకాలు చూపిస్తాం. మనం ఇప్పుడు ఆ పని చేయకపోతే, రేపొద్దున వైద్యం కోసం ఒక్కొక్కరు రూ.4 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు చెల్లించాల్సి వస్తుంది. గవర్నర్ కానీ, మనసున్న ఏ వ్యక్తికి కానీ చంద్రబాబు చేసేది తప్పు అని అర్థమవుతుంది. ఇదే గవర్నర్ ఇంట్లో పని చేసే వ్యక్తులు మెడికల్ కాలేజీకి వెళ్తే ఉచితంగా వైద్యం అందుతుంది. గవర్నర్‌ది మంచి మనసు. ఆయన అన్నీ అర్థం చేసుకున్నారు. మెడికల్ కాలేజీలను కాపాడుకునేందుకు ప్రతి ద్వారం తొక్కుతాం. కోర్టుల ద్వారా వీటిని అడ్డుకునే ప్రయత్నం చేస్తాం. ఇంకా ఉద్యమమూ కొనసాగుతుంది. ఎందుకంటే ఇది కచితంగా స్కామ్. అన్నీ ప్రభుత్వానివే. అప్పగించేది మాత్రం ప్రైవేటు వ్యక్తులకా?. ఎన్నికల ముందు ఏం చెప్పారు? బిర్యానీ పెడతామని నమ్మించారు. కానీ, ఈరోజు అవేవీ లేవు. చదువుకుంటున్న పిల్లలకు ఫీజు రీయింబర్స్ లేదు. దాంతో వారు చదువులు మానేస్తున్నారు. ఆరోగ్యశ్రీ లేదు. నెట్‌వర్క్ ఆస్పత్రులకు బకాయిలు ఇవ్వడం లేదు. విశాఖలో మా హయాంలో రిషికొండపై రూ.230 కోట్లతో బ్రహ్మాండమైన బిల్డింగ్ నిర్మిస్తే, అది ఇప్పుడు నగరానికే తలమానికంగా ఉంది. అయినా దానిపై పిచ్చి విమర్శలు చేస్తున్నారు. విశాఖలో ఒకరోజు నిర్వహించిన యోగా డే కోసం అంత కంటే ఎక్కువే ఖర్చు చేశారు. మ్యాట్లు మొదలు మిగిలిన సామాగ్రి కొనుగోలులోనూ తీవ్ర అవినీతికి పాల్పడ్డారని వైఎస్ జగన్ గుర్తు చేశారు. జగన్ వెంట మాజీమంత్రులు విడుదల రజని తదితరులు ఉన్నారు.

# జోగి బ్రదర్స్‌కు దక్కని ఊరట

**అమరావతి :** నకిలీ మద్యం కేసులో జోగి బ్రదర్స్‌కు ఊరట లభించలేదు. అద్దేపల్లి బ్రదర్స్, జోగి బ్రదర్స్ బెయిల్ పిటిషన్లను ఎక్సైజ్ కోర్టు గురువారం డిస్మిస్ చేసింది. ఈ కేసులో ఏడుగురు నిందితులు.. బాదల్ దాస్ (ఎ7), ప్రదీప్ దాస్ ( ఎ8), కళ్యాణ్ ( ఎ12), రవి (ఎ4), శ్రీనివాస్ తిరుమలశెట్టి (ఎ13), శ్రీనివాస్ రెడ్డి (ఎ11), సతీష్ (ఎ17) లకు కోర్టు బెయిల్ మంజూరు చేసింది. నకిలీ మద్యం కేసులో అరెస్టయిన మాజీ మంత్రి జోగి రమేష్, ఆయన సోదరుడు జోగి శ్రీరాములు, అద్దేపల్లి జనార్దన్ రావు (ఎ1)తోపాటు ఆయన సోదరుడు అద్దేపల్లి జగన్మోహన్ రావు (ఎ2)తోపాటు ఈ కేసులో ప్రమేయం ఉన్న నిందితులు నెల్లూరు జైలులో రిమాండ్ ఖైదీలుగా ఉన్నారు. బెయిల్ కోసం వీరు ఎక్సైజ్ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్లపై గురువారం విచారణ జరిపిన కోర్టు ఈ కేసులో కీలక నిందితులుగా ఉన్న ఈ నలుగురికి తప్పించి.. మిగిలిన ఏడుగురికి బెయిల్ మంజూరు చేసింది. ఈ నేపథ్యంలో ఎక్సైజ్ కోర్టు ఈ నలుగురి బెయిల్ పిటిషన్‌ను డిస్మిస్ చేస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ నలుగురికి ఈ రోజుతో రిమాండ్ ముగియనుంది. దాంతో వర్చువల్‌గా న్యాయమూర్తి ముందు పోలీసులు వీరిని హాజరుపరిచారు. డిసెంబర్ 31వ తేదీ వరకు వారి రిమాండ్‌ను పొడిగిస్తూ.. ఎక్సైజ్ కోర్టు న్యాయమూర్తి నిర్ణయం తీసుకున్నారు. అయితే తమను నెల్లూరు కోర్టు నుంచి విజయవాడ కోర్టుకు మార్చాలంటూ వీరు కోర్టులో మరో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై మధ్యాహ్నం విచారిస్తామని ఎక్సైజ్ కోర్టు స్పష్టం చేసింది. ఈ పిటిషన్‌పై విచారణ జరిపి కోర్టు తన నిర్ణయాన్ని వెలువరించే అవకాశం ఉంది.

# వాతావరణ మార్పుల వలన పాఠశాల సమయాల్లో మార్పులు.



**అదిలాబాద్ డిసెంబర్18( సమయం న్యూస్).:** జిల్లాలో తీవ్ర చలి వాతావరణ పరిస్థితులు కొనసాగుతున్న నేపథ్యంలో పాఠశాల సమయాల్లో మార్పులు చేసినట్లు జిల్లా కలెక్టర్ రాజర్షి షా గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇండియన్ మెటీరియాలజికల్ డిపార్ట్‌మెంట్ నివేదిక మేరకు జిల్లా వ్యాప్తంగా ఉష్ణోగ్రతలు గణనీయంగా తగ్గిన నేపథ్యంలో, విద్యార్థుల ఆరోగ్యం, భద్రతను దృష్టిలో ఉంచుకుని ఈ మార్పులు అమలు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ప్రస్తుతం అమల్లో ఉన్న ఉదయం 9.00 గంటల నుంచి సాయంత్రం 4.15 గంటల వరకు పాఠశాల సమయాలను సవరించి, ఉదయం 9.40 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు కొనసాగేలా నిర్ణయించారు. ఈ మార్పులు జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని ప్రాథమిక, అప్పర్ ప్రైమరీ, హై స్కూళ్లకు వర్తిస్తాయని పేర్కొన్నారు. అన్ని మండల విద్యా అధికారులకు, ప్రభుత్వ, ఎల్బీ, కేజీబీవీ, మోడల్ హై స్కూళ్లు, అలాగే ప్రైవేటు విద్యాసంస్థల ప్రధానోపాధ్యాయులు ఈ ఉత్తర్వులను కచ్చితంగా అమలు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. మార్గదర్శకాలను పాటించకపోతే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ ఉత్తర్వులు వెంటనే అమల్లోకి వస్తాయని, పాఠశాల సమయాల మార్పుల అమలును విద్యాశాఖ పర్యవేక్షించనుందని కలెక్టర్ స్పష్టం చేశారు.

# నారాయణపేట జిల్లా ఇంచార్జీ కలెక్టర్ గా సంచిత్ గంగ్వార్



**నారాయణపేట, డిసెంబర్,18(సమయం న్యూస్):** నారాయణపేట జిల్లా ఇంచార్జీ ( కలెక్టర్ గా సంచిత్ గంగ్వార్ ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఈ నెల 17 నుంచి వచ్చే నెల (2026 జనవరి) 11 వరకు లాంగ్ లీవ్ పెట్టడంతో జిల్లా ఇంచార్జీ కలెక్టర్ గా పూర్తి స్థాయి అదనపు బాధ్యతలను స్థానిక సంస్థల జిల్లా అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ కు అప్పగిస్తూ సీ.ఎస్. ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు. ఈ నెల 17 నుంచి వచ్చే నెల జనవరి 11 వరకు జిల్లా ఇంచార్జీ కలెక్టర్ గా సంచిత్ గంగ్వార్ బాధ్యతలు నిర్వర్తించనున్నారు.

# డిసెంబర్ 21వరకు జరగనున్న జాతీయ మెగా లోక్-అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి.

- రాజీ మార్గమే రాజ మార్గం. జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, IPS
- డిసెంబర్ 21, 2025 (ఆదివారం) వరకు జరగనున్న జాతీయ మెగా లోక్
- అదాలత్ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా,తెలిపారు.



**వికారాబాద్, డిసెంబర్,18(సమయం న్యూస్):** ఈ సందర్భంగా వికారాబాద్ జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, క్షణికావేశంలో జరిగిన చిన్న తప్పులు, అనవసర వివాదాలను పరిష్కరించుకోవడానికి లోక్-అదాలత్ ఒక ఉత్తమ అవకాశం అని పేర్కొన్నారు. రాజీ కుదుర్చుకునే అవకాశం ఉన్న అన్ని రకాల కేసుల్లో కక్షిదారులు పరస్పర అంగీకారంతో రాజీ పడవచ్చని తెలిపారు. న్యాయ ప్రక్రియల వల్ల కలిగే ఆర్థిక, మానసిక ఒత్తిడులను తగ్గించుకోవడానికి లోక్-అదాలత్ ఎంతో ఉపయోగకరమని, రాజీ ద్వారా ఇరు వర్గాలు గెలిచినట్లే అవుతుందని అన్నారు. అనవసర గొడవలకు దూరంగా ఉండి, శాంతియుతంగా సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. కాబట్టి, ఈ నెల డిసెంబర్ 21వరకు జరగనున్న జాతీయ మెగా లోక్-అదాలత్‌ను జిల్లా ప్రజలు, కక్షిదారులు పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎస్పీ కోరారు.

# బీఆర్ఎస్ పార్టీ మాజీ కౌన్సిలర్ మధు యాదవ్ మార్కెట్ కమిటీ వైస్ చైర్పర్సన్ వాణిశ్రీ యాదవ్ దంపతులకు

- పెళ్లిరోజు శుభాకాంక్షలు తెలిపిన బీఆర్ఎస్
- పార్టీ సోషల్ మీడియా ఇంచార్జ్- చెన్నకేశవులు ముదిరాజ్



**కొడంగల్ మున్సిపల్, డిసెంబర్,18(సమయం న్యూస్):** వికారాబాద్ జిల్లా కొడంగల్ మున్సిపల్ తాజా మాజీ కౌన్సిలర్ ఆర్ మధు సుధన్ యాదవ్ మరియూ కొడంగల్ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చేర్పర్సన్ వాణిశ్రీ యాదవ్ దంపతులకు పెళ్లి రోజు సందర్భంగా ముందుగా హృదయపూర్వక పెళ్లి రోజు శుభాకాంక్షలు తెలిపిన దౌల్తాబాద్ మండల బీఆర్ ఎస్ పార్టీ సోషల్ మీడియా ఇన్చార్జి పి చెన్నకేశవులు ముదిరాజ్, తదితరులు


# కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభించిన SCERT డైరెక్టర్ గాజర్ల రమేష్



**సమయం న్యూస్ గజ్వేల్ డిసెంబర్ 18 :** సిద్దిపేట జిల్లా కుకునూర్పల్లి మండలం చిన్న కిష్టాపూర్‌లోని పాఠశాల లో కంప్యూటర్ ల్యా బ్‌ను డైరెక్టర్ గాజర్ల రమేష్ గారు ప్రారంభించారు. బ్యాంక్ వారి ఆర్థిక సహకారంతో 10 కంప్యూటర్ టేబుల్స్ ఏర్పాటు చేయగా, పాఠశాల ప్రధానోపాధ్యాయులు చెన్న శ్రీనివాస్ గారు తమ వంతుగా ల్యాబ్ అభివృద్ధి కోసం ₹40,000 విరాళంగా అందించారు. ఈ సందర్భంగా రమేష్ సార్ తరగతి గదులను పరిశీలించి విద్యార్థులతో మమేకమయ్యారు. అలాగే ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థులను అభినందించారు. విద్యార్థుల అభ్యాస స్థాయిపై ఉపాధ్యాయులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ సత్తయ్య, %ఓజూష్ట్రం% పాఠశాల ప్రధానోపాధ్యాయులు చెన్న శ్రీనివాస్, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు బండి అశోక్‌తో పాటు పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# బాన్సువాడ నియోజకవర్గం అంతటా చెక్కుచెదరని విశ్వాసం

## - ప్రజల ఆలోచనల్లో పోచారం



**బాన్సువాడ డిసెంబర్18(సమయం న్యూస్) :** బాన్సువాడ నియోజకవర్గంలో జరిగిన మూడవ విడత గ్రామ పంచాయతీ ఎన్నికలు ఒక స్పష్టమైన తీర్పును వెలిబుచ్చాయి. ఈ ఎన్నికలు కేవలం గ్రామస్థాయి పదవుల కోసం జరిగిన పోటీగా కాకుండా, నియోజకవర్గం మొత్తం ప్రజల ఆలోచనలు ఏ దిశగా ఉన్నాయో తెలియజేసే ప్రజాభిప్రాయంగా నిలిచాయి. ఈ ఫలితాలు పోచారం శ్రీనివాస్ రెడ్డి పై గ్రామీణ ప్రజల అభిమానం ఇప్పటికీ చెక్కుచెదరలేదని మరోసారి రుజువయ్యాయి. మూడవ విడత గ్రామ పంచాయతీ ఎన్నికల్లో నియోజకవర్గంలోని 57 గ్రామ పంచాయతీలకు గాను పోచారం బలపరిచిన అభ్యర్థులు 41 చోట్ల విజయం సాధించారు. ఇందులో ముందుగానే ఏకగ్రీవంగా ఎన్నికైన 14 గ్రామ పంచాయతీలు కూడా ఉన్నాయి. ఈ సంఖ్యలు కేవలం రాజకీయ గణాంకాలు కావు. ఇవి గ్రామీణ ప్రజల విశ్వాసానికి ప్రతిబింబం. మొదటి మరియు మూడవ విడతలలో కలిపి మొత్తం 137 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరగగా, వాటిలో 106 గ్రామ పంచాయతీలలో పోచారం బలపరిచిన అభ్యర్థులే సర్పంచులుగా ఎన్నికయ్యారు. ఇది నియోజకవర్గం అంతటా ప్రజల ఆలోచన ఒకే దిశలో ఉన్నదని స్పష్టంగా తెలియజేస్తోంది.

ఈ ఎన్నికల ఫలితాల వెనుక ఉన్న అసలు కారణం మాటల రాజకీయాలు కాదు. గ్రామీణ ప్రజలు తమ జీవితాల్లో కనిపించిన మార్పుల ఆధారంగా తీర్పు ఇచ్చారు. సాగునీటి లభ్యత పెరగడం, చెరువులు నిండటం, వ్యవసాయం నిలకడగా మారడం, గ్రామాల్లో ఆర్థిక చలనం పెరగడం వంటి అంశాలు ప్రజల ఆలోచనను ప్రభావితం చేశాయి. ఈ మార్పుల వెనుక ఉన్న కృషిని ప్రజలు గుర్తించారు. నియోజకవర్గం అంతటా గ్రామాల్లో రైతులు నీటి మార్పును ప్రత్యక్షంగా అనుభవించారు. పంట కాలంలో నీటి కొరత తగ్గింది. చెరువులు పునరుజ్జీవం పొందాయి. కాలువల్లో నీరు సజావుగా ప్రవహించడం మొదలైంది. గతంలో అనిశ్చితిలో ఉన్న పంటలు ఇప్పుడు స్థిరంగా నిలబడుతున్నాయి. ఈ అనుభవాలు ప్రజల ఆలోచనల్లో లోతుగా నాటుకుపోయాయి. ఎత్తైన భూములకు సాగునీరు చేరడం నియోజకవర్గంలో పెద్ద మార్పుకు దారి తీసింది. ఒకప్పుడు పంట రాని భూములు నేడు సాగుకు ఉపయోగపడుతున్నాయి. రైతుల ఆదాయం పెరిగింది. వ్యవసాయం మీద నమ్మకం తిరిగి వచ్చింది. చెరువుల పునరుద్ధరణ వల్ల భూగర్భ జలాలు మెరుగుపడ్డాయి. బోర్ల ద్వారా సాగు విస్తరించింది. ఈ మార్పులు ప్రజల ఆలోచనల్లో నాయకత్వంపై విశ్వాసాన్ని మరింత బలపరిచాయి. ప్రజల అవసరాల విషయంలో పోచారం ఆలోచన ఎప్పుడూ ఒకటే. అధికారంలో ఎవరు ఉన్నారన్నది కాదు, ప్రజలకు ఏం కావాలన్నదే ఆయనకు ముఖ్యమైనది. రాష్ట్రానికి ఎవరు ముఖ్యమంత్రి అయినా, ప్రజా అవసరాల కోసం, ప్రజాసేవ కోసం వారితో కలిసి పని చేయడమే ఆయన రాజకీయ ధోరణి. ఎన్టీఆర్ కాలం నుంచి ఇప్పటి వరకు వచ్చిన ప్రతి ముఖ్యమంత్రితో కూడా నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారానికి ఆయన వెనకడుగు వేయలేదు. ప్రభుత్వాలు మారినా, పాలకులు మారినా, బాన్సువాడ ప్రజల అవసరాలు మాత్రం మారలేదన్న స్పష్టతతోనే ఆయన ముందుకు సాగారు. సాగునీరు కావాలన్నా, గ్రామాలకు మౌలిక వసతులు కావాలన్నా, రైతుల సమస్యలు పరిష్కరించాలన్నా, అధికారంలో ఉన్న ప్రభుత్వంతో సమన్వయం చేసుకోవడమే ఆయన విధానం. రాజకీయ లాభనష్టాలను పక్కన పెట్టి, ప్రజల అవసరాల కోసం ఏ ముఖ్యమంత్రితో అయినా మాట్లాడగలగడం ఆయన రాజకీయ పరిపక్వతకు నిదర్శనం. ఈ లక్షణమే ఆయనను కేవలం పార్టీ నాయకుడిగా కాకుండా, ప్రజా నాయకుడిగా నిలిపింది. ప్రజల ఆలోచనల్లో పోచారం ఎన్నికల సమయంలో మాత్రమే గుర్తొచ్చే నాయకుడిగా నిలవలేదు. ప్రతి పంట కాలంలో, ప్రతి నీటి సమస్యలో, ప్రతి చెరువు నిండిన సందర్భంలో గుర్తొచ్చే వ్యక్తిగా స్థిరపడాడు. గ్రామాల్లో అభివృద్ధి గురించి చర్చ మొదలైతే సహజంగానే ఆయన పేరు వినిపిస్తుంది. ఇదే నియోజకవర్గ ప్రజల ఆలోచనల్లో ఆయనకు ఉన్న స్థానం.

ఈ విశ్వాసం ఒక్క రోజు ఏర్పడినది కాదు. దాదాపు నలభై ఏండ్ల సుదీర్ఘ రాజకీయ జీవితం ప్రజాసేవకే అంకితం చేసిన వ్యక్తిగా ఆయన పేరు ప్రజల గుండెల్లో నిలిచిపోయింది. ఇంత సుదీర్ఘకాలం రాజకీయాల్లో కొనసాగిన నాయకుడిపై సహజంగా ప్రజల్లో వ్యతిరేకత పెరగాలి. కాలం గడిచేకొద్దీ అలసట రావాలి. కానీ బాన్సువాడ నియోజకవర్గంలో ఇందుకు విరుద్ధమైన పరిస్థితి కనిపిస్తోంది. కాలం గడిచేకొద్దీ ప్రజల అభిమానం తగ్గడం కాదు, మరింత పెరుగుతూనే ఉంది. ఇది ఆయన పనితీరుకు నిదర్శనం. ప్రజలు ఆయనను రాజకీయ నాయకుడిగా మాత్రమే కాదు, తమ మట్టి బిడ్డగా భావిస్తున్నారు. ప్రజలతో ఉన్న అనుబంధం, వారి సమస్యలపై చూపిన స్పందన, నిరంతర ప్రజాసేవ ఈ భావనకు పునాది అయ్యాయి. రాజకీయాల్లో ఎన్నో ఒడిదుడుకులు ఎదురైనా, వ్యక్తిగత విమర్శలు ఎదురైనా, ప్రజల మనసుల్లో ఆయన స్థానం మాత్రం మారలేదు. సుదీర్ఘ రాజకీయ ప్రయాణంలో విమర్శలు సహజం. ప్రత్యర్థుల నుంచి ఆరోపణలు రావడం సహజం. కానీ ఆయన విషయంలో రాజకీయ పరిమితులు దాటి అవమానకరమైన మాటలు వినిపించిన సందర్భాలు కూడా ఉన్నాయి. ఎన్నో కుట్రలు జరిగాయి. అయినప్పటికీ ఆయన ప్రతిస్పందన ఎప్పుడూ ఒకేలా కనిపించింది. ప్రతీకారం కాదు, ప్రజాసేవ. వాగ్వాదం కాదు, పని. మాటలకు సమాధానం పనితో ఇవ్వాలన్న ధోరణి ఆయన రాజకీయ జీవితంలో స్పష్టంగా కనిపిస్తుంది. ఈ సహనం, ఈ స్థైర్యమే ఆయనను ప్రజల మనిషిగా నిలిపింది. అవమానాలను భరిస్తూనే, ఆరోపణలను పట్టించుకోకుండా ప్రజల కోసం పని చేయడం గ్రామీణ ప్రజలను మరింత దగ్గర చేసింది. ప్రజలు ఇది గమనించారు. నిజాయితీని, పట్టుదలను గుర్తించారు. అందుకే ప్రతి ఎన్నికలోనూ ప్రజల ఆలోచనల్లో ఆయన పేరు ముందుకు వస్తోంది. గ్రామీణ ప్రజలు రాజకీయాలను ప్రసంగాల ద్వారా కాదు, తమ జీవితాల ద్వారా అంచనా వేస్తారు. తమ పొలాల్లో పంట ఎలా ఉంది, తమ గ్రామంలో నీరు ఎంత ఉంది, తమ కుటుంబం భవిష్యత్తు సురక్షితంగా ఉందా లేదా అనే ప్రశ్నలే వారి ఆలోచనను నిర్ణయిస్తాయి. ఈ ప్రశ్నలకు సానుకూల సమాధానం లభించిన చోట ప్రజల ఆలోచన ఒకే దిశలో నిలిచింది. ఈ ఎన్నికల ఫలితాలు పెద్దాయన పనితీరుకు నిదర్శనంగా నిలిచాయి. గ్రామ పంచాయతీ స్థాయి నుంచి నియోజకవర్గ స్థాయి వరకు ప్రజలు ఇచ్చిన ఈ స్పష్టమైన మద్దతు, అభివృద్ధి ఆధారిత రాజకీయాలకు వచ్చిన గుర్తింపుగా భావించబడుతోంది. మాటలకన్నా పనిని నమ్మే ప్రజల తీర్పు ఇది. మొత్తంగా బాన్సువాడ నియోజకవర్గం అంతటా ప్రజల ఆలోచన ఒక స్పష్టమైన సంకేతాన్ని ఇస్తోంది. ప్రజల జీవితాల్లో మార్పు తీసుకువచ్చిన నాయకత్వంపైనే విశ్వాసం కొనసాగుతుంది. ఆ విశ్వాసం పోచారం శ్రీనివాస్ రెడ్డి పట్ల చెక్కుచెదరలేదని ఈ ఎన్నికలు మరోసారి నిరూపించాయి. నాలుగు దశాబ్దాల ప్రజాసేవకు ప్రజల నుంచి వచ్చిన ఈ గుర్తింపు, రానున్న రోజుల్లో మరింత అభివృద్ధికి బలమైన పునాదిగా నిలవనుంది.

# చెత్త సేకరణ ప్రక్రియను పకడ్బందీగా పర్యవేక్షించాలి

- రోడ్లపై చెత్త పారవేయకుండా
- ప్రజలకు అవగాహన కల్పించాలి
- కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి
- డంపింగ్ యార్డు సందర్శన



**నిజామాబాద్, డిసెంబర్ 18( సమయం న్యూస్).** ఇంటింటికి తిరుగుతూ చెత్తను సేకరించే ప్రక్రియను పకడ్బందీగా పర్యవేక్షణ జరపాలని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి సూచించారు. రోడ్లపై ఎక్కడబడితే అక్కడ చెత్త పారవేయకుండా ప్రజలకు విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలని అన్నారు. కలెక్టర్ గురువారం నగరంలోని పలు ప్రాంతాల్లో పర్యటించి, క్షేత్రస్థాయిలో కొనసాగుతున్న పారిశుధ్య పనులను తనిఖీ చేశారు. ఎల్లమ్మగుట్ట రైల్వే కమాన్ సమీపంలో, గాయత్రీనగర్ లో ప్రధాన కూడళ్ళ వద్ద రోడ్ల పక్కన చెత్త పారవేయకుండా చేపట్టిన చర్యలను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. ఇంటి వద్దకు వచ్చే చెత్త సేకరణ వాహనాలలోనే చెత్తను వేయాలని, రోడ్లపై చెత్త పారవేస్తే జరిమానాలు విధించబడతాయనే విషయాన్ని ఫ్లెక్సీలు, బ్యానర్లు, మైకుల ద్వారా ప్రచారం చేస్తూ ప్రజలలో అవగాహన పెంపొందించాలని అన్నారు. పారిశుధ్య సమస్య నెలకొనకుండా నగరాన్ని పరిశుభ్రంగా ఉంచడానికి ప్రజలు పూర్తి స్థాయిలో సహకరించేలా చూడాలన్నారు. మురుగు కాలువలను క్రమం తప్పకుండా శుభ్రం చేయిస్తూ, ప్రజల ఆరోగ్యాల పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. అవకాశం ఉన్న చోట జె.సీ.బీ యంత్రాల ద్వారా మురుగు కాలువలను శుభ్రం చేయించాలని ఆదేశించారు. రోడ్లకు ఇరువైపులా ఖాళీ స్థలాలను శుభ్రం చేయించి, పచ్చదనాన్ని పెంపొందించేలా విరివిగా మొక్కలు నాటించి వాటి పరిరక్షణకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని అన్నారు. అనంతరం కలెక్టర్ నాగారం శివారులోని డంపింగ్ యార్డును సందర్శించారు. నగర పాలక సంస్థ పరిధిలో రోజువారీగా ఇంటింటికీ తిరిగి సేకరించే చెత్తను డంపింగ్ యార్డు వద్ద నిలువ చేస్తున్న తీరును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. చెత్తను ఆయా విభాగాల వారీగా వేరు చేస్తూ, ఎరువులు, ఇతర అవసరాల వినియోగం కోసం యంత్రాల సహాయంతో శుద్ధి చేస్తున్న విధానాన్ని పరిశీలించి, వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతిరోజు సగటున ఎంత పరిమాణంలో చెత్తను శుద్ధి చేస్తున్నారు, ఎరువును ఎవరికి అందజేస్తున్నారు తదితర వివరాలను ఆరా తీశారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించేలా చర్యలు తీసుకోవాలని, తద్వారా బయో మైనింగ్ సులభం అవుతుందని అన్నారు. వ్యర్థాలను శుద్ధి చేస్తూ కంపోస్ట్ తయారీ కోసం ప్రతిపాదించిన మరో రెండు వేస్టేజ్ ప్రాసెస్సింగ్ యంత్రాలను సత్వరమే తెప్పించుకుని శుద్ధి ప్రక్రియ ప్రారంభం అయ్యేలా చూడాలని కాంట్రాక్ట్ ఏజెన్సీ ప్రతినిధులను ఆదేశించారు. కలెక్టర్ వెంట నగరపాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, డిప్యూటి కమిషనర్ రవిబాబు, ఇంచార్జీ ఎం.హెచ్.ఓ సాజిద్ తదితరులు ఉన్నారు.

# ఎన్నికల సాధారణ పరిశీలకులకు సన్మానం.



**కామారెడ్డి డిసెంబర్18( సమయం న్యూస్). :** గ్రామ పంచాయతీ ఎన్నికల సందర్భంగా జిల్లాకు కేటాయించబడిన సాధారణ పరిశీలకులు సత్యనారాయణరెడ్డి, జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ పర్యవేక్షణలో ఎన్నికలు సజావుగా, ప్రశాంతంగా ముగిశాయి. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ గురువారం తన ఛాంబర్ లో సాధారణ పరిశీలకులను శాలువాతో సన్మానించి జ్ఞాపికను అందజేశారు. ఎన్నికల నిర్వహణలో జిల్లా యంత్రాంగం సమన్వయంతో పని చేయడం వల్ల ఎన్నికలు పారదర్శకంగా, సజావుగా జరిగాయని కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా సాధారణ పరిశీలకులు సత్యనారాయణరెడ్డి జిల్లా అధికారులు, ఎన్నికల సిబ్బందిని అభినందించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు విక్టర్, మధుమోహన్, %ఎజూశీ% మురళీ పాల్గొన్నారు.

# మానవ నాగరికత అభివృద్ధికి -వ్యవసాయం పునాది

- ప్రజలకు పథకాల మీద అవగహన అవసరం-
- చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్
- చట్టం ముందు అందరు సమానులె
- అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్



**నారాయణపేట, డిసెంబర్,18(సమయం న్యూస్) :** నారాయణపేట జిల్లా న్యాయ సేవ సంస్థ లీగల్ సర్వీసెస్ సంస్థ ఆధ్వర్యంలో గురువారం భైరంకొండ గ్రామంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించడం జరిగింది. ఈ విజ్ఞాన సదస్సును పబ్లిక్ ప్రాసిక్యూటర్ కే.సురేష్ మరియు చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ కే.లక్ష్మిపతి గౌడ్ న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ మరియు డిఫెన్స్ కౌన్సిల్ వారు మాట్లాడుతూ వ్యవసాయం అంటే ఆహారం, పశుగ్రాసం, నార, ఇంధనం కోసం మొక్కలను, జంతువులను పెంచడం, భూమిని సాగు చేయడంబీ ఇది మానవ నాగరికతకు మూలం, దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక, ఇందులో పంటలు పండించడం, పశు పోషణ, నీటి యాజమాన్యం, సాంకేతికత వినియోగం ముఖ్యమైన అంశాలు, ఆధునిక కాలంలో సేంద్రియ, ప్రకృతి వ్యవసాయ పద్ధతులు ప్రాముఖ్యత సంతరించుకుంటున్నాయి.నేలను దున్ని, విత్తనాలు వేసి, నీరు పోసి, సరైన పద్ధతిలో పంటలు పండించడం, పశువులను పెంచడం వంటి ప్రక్రియల ద్వారా ఆహార, ఆహారేతర ఉత్పత్తులను సేకరించడమే వ్యవసాయం లో ప్రధాన పాత్ర అని తెలిపారు. వ్యవసాయం ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక అని, ఆహారం, ఆధునిక పద్ధతులు (సేంద్రీయ, సహజ వ్యవసాయం) గురించి, రైతులకు ప్రోత్సాహకాలు, ప్రభుత్వ విధానాల గురించి వివరించారు, రసాయన ఎరువులు, పురుగుమందుల వాడకం తగ్గించి సేంద్రియ, ప్రకృతి వ్యవసాయం వైపు అడుగులు వేయాలి. ఇది మన ఆరోగ్యానికే కాదు, భూమికి కూడా మంచిది. మట్టి ఆరోగ్యం కాపాడుకోవడం, పంటల దిగుబడి పెంచడంలో ప్రకృతి వ్యవసాయం ఎంతో సహాయపడుతుంది. సరైన మార్కెటింగ్ లేకపోవడం, ధరల హెచ్చుతగ్గులు రైతులకు పెద్ద సమస్యలు. ప్రభుత్వ, ప్రైవేట్ సహకారంతో మెరుగైన మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించాలి. " భూసార పరీక్షలు చేయించుకోవడం, పంటల బీమా గురించి తెలుసుకోవడం ద్వారా నష్టాలను తగ్గించుకోవచ్చు. పాత పద్ధతులతో పాటు ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవాలి. అధిక దిగుబడినిచ్చే విత్తనాలు, డ్రిప్ ఇరిగేషన్ వంటివి నీటిని ఆదా చేస్తాయి. ప్రభుత్వ పథకాలైన ఫసల్ బీమా యోజన వంటివి రైతులకు అండగా నిలుస్తాయి, వాటి గురించి తెలుసుకోవాలి. విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు రసీదు కచ్చితంగా కలిగి ఉండాలి. నకిలీ విత్తనాలు కొనుగోలు చేసి ప్రజలు మోసపోవద్దు తెలిపారు. న్యాయ వ్యవస్థలో రాజ్యాంగం ప్రకారం అందరికి సమాన హక్కులు కల్పించిందన్ని అన్నారు.ప్రజలు వాటిపై అవగాహన కలిగి ఉన్నప్పుడే తమ హక్కులను నిర్భయంగా పొందుతారని తెలిపారు. జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సంస్థ ద్వారా పేదవారు 15100 నెంబర్ కి కాల్ చేసి ఉచిత న్యాయాన్ని పొందవచ్చు అన్నారు. వరకట్న వేదింపులు, సఖి సెంటర్, వోల్డిగే హెూమ్, గవర్నమెంట్ నుంచి వచ్చే బెనిఫిట్స్ ప్రయోజనాలపై అవగాహన కలిపించారు. ఈ కార్యక్రమంలో పీ.నాగిరెడ్డి (పంచాయతీ సెక్రటరీ), అంగన్వాడీ టీచర్లు, ఆశావర్కర్లు, పర లీగల్ వాలంటరీస్ మరియు గ్రామా ప్రజలు పాల్గొన్నారు.

# ప్రజల సహకారంతోనే ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి

జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ IPS



**నారాయణపేట, డిసెంబర్,18(సమయం న్యూస్ :** నారాయణపేట జిల్లాలో నిర్వహించిన గ్రామపంచాయితీ ఎన్నికలు మూడు విడతలుగా పూర్తిగా శాంతియుత వాతావరణంలో ప్రజల సహకారంతో విజయవంతంగా ముగిశాయి అని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ తెలిపారు. ప్రజల సహకారం, అధికారుల సమన్వయం, పోలీసు విభాగం కర్తవ్యనిష్ఠతో పనిచేయడం ఈ ఎన్నికల విజయానికి ప్రధాన కారణమని తెలిపారు.ఎన్నికల భద్రత కోసం అదనపు ఎస్పీ, డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు, కానిస్టేబుళ్లు, హెూంగార్డులు, నారాయణపేట జిల్లా సిబ్బందితోపాటు ఇతర జిల్లాల నుండి వచ్చిన సిబ్బందితో సహ అందరి సమన్వయంతో విడతల వారీగా విధులు నిర్వర్తించినట్లు తెలిపారు. అందరినీ ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన రోజునుంచే జిల్లా వ్యాప్తంగా శాంతి భద్రతల పరిరక్షణకు కఠిన చర్యలు చేపట్టినట్లు వివరించారు.జిల్లా సరిహద్దుల్లో ఏర్పాటు చేసిన 06 చెక్‌పోస్టుల్లో వాహనాలను క్షుణ్ణమైన తనిఖీలు నిర్వహించడంతో పాటు గ్రామాలలో మరియు రహదారులపై ప్రత్యేక పోలీసు టీములతో విస్తృతంగా తనిఖీలు చేసినట్లు ఎస్పీ తెలిపారు. ఈ తనిఖీల్లో రూ.4.62,500/- నగదు, 730 లీటర్ల విలువైన మద్యం దాని విలువ 4,11,685 రూపాయలు ఉంటుందని, ఇతర విలువైన వస్తువులు చీరలు, ఎలక్ట్రానిక్ వస్తువులు, %ణాబా% రైస్ మొత్తం 10,54,000/- రూపాయల విలువ గల వస్తువులు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు, గుట్కాలు 86,039/- వివిధ చట్టవిరుద్ధ చర్యలకు సంబంధించి ఎలక్షన్, మద్యంకి సంబంధించి 88 కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.అదనంగా గత ఎన్నికల్లో ఘర్షణలకు కారణమైన వ్యక్తులు, రౌడీషీటర్లు, అనుమానాస్పద వ్యక్తులపై ముందస్తు చర్యలుగా 1162 మందిని బైండోవర్ చేసినట్లు చెప్పారు.ఎన్నికల సమయంలో చలి, పగలు, రాత్రి అన్న తేడా లేకుండా కర్తవ్యదీక్షతో పనిచేసిన పోలీసు సిబ్బందిని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ప్రజలు, వివిధ శాఖల అధికారులు, పోలీసు విభాగం అందరూ సమన్వయంతో పనిచేయడంతోనే ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయని ఎస్పీ కృతజ్ఞతలు తెలిపారు.



జిల్లాలో గ్రామపంచాయతీ ఎన్నికలు సజావుగా, ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా పూర్తి అయినందున గురువారం క్యాంపు కార్యాలయంలో ఎన్నికల సాధారణ పరిశీలకులు టి. వెంకన్న, వ్యయ పరిశీలకులు విజయ లను శాలువాతో సన్మానించిన జిల్లా కలెక్టర్ రాజర్షి షా. పాల్గొన్న స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్.

# అంతరిక్షం, రక్షణ సాంకేతికతపై గీతంలో జాతీయ సెమినార్

- ముఖ్య అతిథి హాజరైన డీఆర్ డీవో పూర్వ శాస్త్రవేత్త డాక్టర్ జి.రామగురు



**పటాన్ చెరు :**భారత వైమానిక దళం సహకారంతో హైదరాబాదులోని గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీలో అంతరిక్ష శాస్త్రం, రక్షణ సాంకేతికతలో పురోగతి పై రెండు రోజుల జాతీయ సెమినార్ గురువారం ప్రారంభమైంది. ఐఐటీ హైదరాబాదులోని డీఆర్ డీవో-ఇండస్ట్రీ-అకాడెమియా సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (డీఐఏ సీవోఈ) డైరెక్టర్ డాక్టర్ జి. రామగురు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై కీలకోపన్యాసం చేశారు.రక్షణ రంగ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డీఆర్ డీవో)లో తన 35 ఏళ్ల అనుభవాన్ని డాక్టర్ రామగురు వివరించారు.అంతరిక్ష శాస్త్రం, రక్షణ సాంకేతికతలలో పురోగతి జాతీయ భద్రత, వ్యూహాత్మక స్వావలంబనకు కీలకమైన స్తంభాలు అని తెలిపారు. స్వదేశీ ఉపగ్రహాలను ప్రయోగించడం నుంచి అధునాతన క్షిపణి, నిఘా వ్యవస్థలను అభివృద్ధి చేయడం వరకు భారతదేశం యొక్క ప్రయాణంతో సహా, సాంప్రదాయ భూమి, వాయు, నావికా కార్యకలాపాలు సైబర్ భద్రత, అంతరిక్ష యుద్ధంతో సహా ఆధునిక యుద్ధ రంగాల గురించి ఆయన వివరించారు. భారతదేశ రక్షణ, అంతరిక్ష పర్యావరణ వ్యవస్థను బలోపేతం చేయడంలో స్కైరూట్ వంటి ప్రైవేటు స్పేస్ స్టార్టప్ ల పెరుగుతున్న తీరును తెలియజేశారు.

విద్యా సంస్థల పాత్రను వివరిస్తూ యూఏవీలు, డ్రోన్లు, క్షిపణి వ్యవస్థలలో ఆవిష్కరణ విద్యా ప్రాంగణాలలో పెంపొందించే ఉత్సుకత, సృజనాత్మకతతో ప్రారంభమవుతుందని వ్యాఖ్యానించారు. ధైర్యం, ఊహ, క్రమశిక్షణ, శ్రేష్ఠతకు నిబద్ధత పెంపొందించుకోవాలని ఆయన విద్యార్థులను ప్రోత్సహించారు. తన గురువు రవిశంకర్ ను ఉటంకిస్తూ, యువ ఇంజనీర్లు ఊహను క్రమశిక్షణ, స్వేచ్ఛతో సమతుల్యం చేసుకోవాలన్నారు.సరైన సమయంలో, ఎంతో ఉపయుక్తమైన చర్చాగోష్ఠిని నిర్వహిస్తున్న గీతంను ఆయన అభినందించారు.

స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డైరెక్టర్, కోర్ ఇంజనీరింగ్ డీన్ ప్రొఫెసర్ రామశాస్త్రి వేదాల, చర్చాగోష్ఠి కన్వీనర్ ప్రొఫెసర్ ప్రీతి అంబరీష్ పర్వేకర్, సమన్వయకర్త డాక్టర్ ఎండీ. అక్తర్ ఖాన్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. డాక్టర్ గాంధీ, కెప్టెన్ అంబరీష్, భారత వైమానిక దళానికి చెందిన వింగ్ కమాండర్ మనోహరన్, భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ పూర్వ శాస్త్రవేత్త డాక్టర్ శేషగిరిరావుతో సహా పలువురు విశిష్ట వక్తలు ఈ రెండు రోజుల సెమినార్ లో ఉపన్యసించనున్నారు.

# స్లాట్ బుకింగ్ యాప్‌పై శిక్షణ కార్యక్రమం..



**గుండుమాల్ మండలం,డిసెంబర్,18(సమయం న్యూస్) :** తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ సంచాలకుల ఆధ్వర్యంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎరువుల (యూరియా) స్లాట్ బుకింగ్ యాప్ పై శిక్షణ కార్యక్రమం నిర్వహించినట్లు కోస్గి మండల వ్యవసాయ అధికారి రామకృష్ణ తెలిపారు.గురువారం నారాయణపేట జిల్లా గుండుమాల్ మండల కేంద్రంలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. కోస్గి, మద్దూర్, కొత్తపల్లి, గుండుమాల్ మండలాలకు చెందిన వ్యవసాయ విస్తరణ అధికారులు, ఎరువుల డీలర్లు హాజరైన కార్యక్రమంలో శిక్షణలో యాప్ ఉపయోగం, యాప్ ద్వారా యూరియా బుకింగ్ విధానం, పారదర్శక ఎరువుల పంపిణీ అంశాలపై వివరంగా అవగాహన కల్పించారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం రైతులకు అవసరమైన యూరియాను రైతుల సగటు వినియోగాన్ని ఆధారంగా చేసుకొని పారదర్శకంగా అందించాలనే ఉద్దేశంతో ఈ ఫర్టిలైజర్ యాప్‌ను ప్రవేశపెట్టుతోందని అన్నారు. ఈ యాప్ ద్వారా రైతులు తమ మొబైల్ నుండి యూరియా కోసం స్లాట్ బుక్ చేసుకోవచ్చునని తెలిపారు. ఎరువుల పంపిణీలో పారదర్శకత పెరుగడంతో పాటు,క్యూలైన్లు, గందరగోళం పూర్తిగా నివారించబడుతుందని అన్నారు.ప్రతి రైతుకు అవసరమైన మేరకు సరిపడిన యూరియా అందడమే కాకుండా సాగు చేసే రైతులకు మాత్రమే అవసరమైన యూరియా లభిస్తుందని అన్నారు.రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 20వ తేదీ నుండి యూరియా అమ్మకాలు పూర్తిగా ఈ ఫర్టిలైజర్ యాప్ ద్వారా స్లాట్ బుకింగ్ చేసుకున్న రైతులకు మాత్రమే జరుగుతాయని అన్నారు.ఈ కార్యక్రమంలో కోస్గి, గుండుమాల్ మరియు మద్దూర్ మండలాల వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు, ఎరువుల డీలర్లు పాల్గొన్నారు.

# ఈ నెలాఖరులోగా ఆయిల్ ఫామ్ మొక్కల సాగు యొక్క జిల్లా లక్ష్యాన్ని పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా



**అదిలాబాద్ డిసెంబర్18( సమయం న్యూస్). :** గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆయిల్ ఫామ్ సాగు, యూరియా ఫర్టిలైజర్ బుకింగ్ యాప్, ఇతర అంశాలపై వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఆయిల్ ఫామ్ మొక్కల సాగు జిల్లా లక్ష్యాన్ని ఈ నెలాఖరులోగా పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లా లక్ష్యం 2500 ఎకరాల విస్తీర్ణం కాగా ఈ సంవత్సరం ఇప్పటివరకు 386 ఎకరాలు మాత్రమే ఆయిల్ ఫామ్ సాగు చేయడం జరిగిందన్నారు. మండలాల అధికారులకు లక్ష్యాన్ని నిర్దేశించి ఆయిల్ ఫామ్ మొక్కల నాన్ సబ్సిడీ, డ్రిప్ ఇరిగేషన్ సబ్సిడీ, నాన్ సబ్సిడీ డిడి లు ఈ నెలాఖరు లోగా సమర్పించాలని ఆదేశించారు. కంపెనీల నుండి రైతులకు మద్దతు అందించాలని, క్షేత్ర స్థాయి సిబ్బంది రైతులకు అవగాహన కల్పించాలని అన్నారు. అంతకుముందు జిల్లాలో ఆయిల్ పామ్ విస్తీర్ణం విస్తరణ తక్కువగా ఉండటానికి వర్షాధార పరిస్థితులు, నీటి కొరత, అడవి జంతువుల వల్ల కలిగే నష్టం, వంటి వివిధ కారణాలనుఅధికారులు, కంపెనీల ప్రతినిధులు కలెక్టర్ కు వివరించారు.అనంతరం వ్యవసాయ శాఖ అధికారులతో సమీక్షిస్తూ, రైతులకు యూరియా ఇబ్బందులు తగ్గించడానికి ప్రభుత్వం ఫర్టిలైజర్ బుకింగ్ యాప్ తీసుకురావడం జరుగుతుందని, ఈ నెల 20 వ తేదీ నుండి యాప్ అందుబాటులోకి వస్తుందని తెలిపారు. షాప్ ల వద్ద వాలంటీర్లు, మండల వ్యవసాయ విస్తరణ అధికారుల ద్వారా రైతులకు యాప్ పై అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు. డీలర్ వివరాలు తో స్టాక్ వివరాలు యాప్ లో కనిపిస్తాయని, రైతులు ఇంటివద్ద నుండే యూరియా బుకింగ్ చేసుకోవచ్చున్నారు. మొబైల్ నంబర్ %ూా% తో లాగిన్ అవుతుందని, పట్టా పాస్ బుక్, పంట, సంబంధిత వివరాలు నమోదు చేయాల్సి ఉంటుందని, బుకింగ్ అనంతరం 24 గంటల్లో రైతు సరుకును తీసుకువెళ్లావలసి ఉంటుందన్నారు. సమస్యలు ఎదురైతే వ్యవసాయ విస్తరణ అధికారులు తెలియజేసి నివృత్తి చేసుకోవచ్చని ఆయన తెలిపారు.ఈ సమావేశంలో శిక్షణ కలెక్టర్ సలోని చాబ్రా, జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్, జిల్లా ఉద్యానవన అధికారి నర్సయ్య, జిల్లా సహకార అధికారి మోహన్, వ్యవసాయ, ఉద్యానవన విస్తరణ అధికారులు, ఆయా కంపెనీల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# గ్రామపంచాయతీ ఎన్నికల ప్రక్రియ విజయవంతంగా పూర్తి

- సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదములు కలెక్టర్



**మెదక్ డిసెంబర్18( సమయం న్యూస్).:** ప్రజాస్వామ్య వ్యవస్థను మరింత బలోపేతం చేసే విధంగా ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. విజయవంతం చేయడంలో సహకరించిన అన్ని శాఖల అధికారులకు, ఎన్నికల విధులలో పాల్గొన్న ఉపాధ్యాయులకు సిబ్బందికి, పోలీస్ యంత్రాంగానికి, పాత్రికేయులకు అభినందనలు.

రాష్ట్రంలో 89.37 పోలింగ్ శాతంతో 5వ స్థానం మెదక్

మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

పంచాయతీ ఎన్నికలను మూడు దశల్లోనూ విజయవంతంగా నిర్వహించడంలో సహకరించిన అధికారులకు, ఎన్నికల విధులలో పాల్గొను ఉపాధ్యాయులకు పోలింగ్ సిబ్బందికి, పోలీస్ శాఖకు అభినందనలు తెలిపారు.

మెదక్ జిల్లాలో గ్రామపంచాయతీ ఎన్నికలు

జిల్లాలో మూడు దశలుగా నిర్వహించిన గ్రామ పంచాయితీ ఎన్నికలు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు లేకుండా సజావుగా పూర్తవడం ప్రజల సహకారం వల్లనే సాధ్యమైందని అన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థను మరింత బలోపేతం చేసే విధంగా ప్రజలు చూపిన బాధ్యతాయుత ప్రవర్తన ప్రశంసనీయమని ఆయన పేర్కొన్నారు.

జిల్లాలో నిర్వహించినరెండో సాధారణ గ్రామ పంచాయితీ ఎన్నికల పోలింగ్ విజయవంతంగా, ప్రశాంత వాతావరణంలో పూర్తయ్యిందని అన్నారు.

జిల్లాలో మొత్తం మూడు దశల్లో జరిగిన పోలింగ్ ను కలుపుకొని 89.37%. ప్రజలు పోలింగ్లో పెద్ద ఎత్తున పాల్గొని జిల్లాను రాష్ట్రంలో ఐదవ స్థానంలో నిలపడం గర్వించదగ్గ అంశం అని అన్నారు విజయవంతం చేయడంలో సహకరించిన అన్ని శాఖల అధికారులకు, సిబ్బందికి, పోలీస్ యంత్రాంగానికి, పాత్రికేయులకు అలాగే శాంతియుతంగా ఓటు హక్కు వినియోగించుకున్న జిల్లా ప్రజలందరికీ ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈనెల 22వ తేదీన గ్రామపంచాయతీ సర్పంచ్, వార్డు మెంబర్లుగా గెలుపొందిన అభ్యర్థుల పదవి ప్రమాణ స్వీకరా కార్యక్రమం ఉంటుందని తెలిపారు.

# గ్రామపంచాయతీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ ఘన విజయం

**నూతన సర్పంచ్ లకు సత్కరించిన పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి.**



**పరిగి మండలం, డిసెంబర్,18(సమయం న్యూస్) :** గ్రామ పంచాయతీ ఎన్నికల్లో వికారాబాద్ జిల్లా పరిగి మండలంలో బీఆర్ఎస్ పార్టీ ఘన విజయాలు సాధించి ప్రజల మద్దతును చాటుకుంది. తొండపల్లి గ్రామం నుంచి బీఆర్ఎస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి గుర్రంపల్లి కృష్ణయ్య భారీ మెజారిటీతో సర్పంచ్‌గా గెలుపొందారు. ఈ సందర్భంగా కృష్ణయ్య ను వార్డు మెంబర్లను అలాగే గ్రామస్తులను పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ, మొత్తం ఎనిమిది వార్డులకు గాను ఏడు వార్డుల్లో బీఆర్ఎస్ మద్దతు ఉన్న వార్డు మెంబర్లు విజయం సాధించడం ప్రజల్లో అధికార పార్టీపట్ల ఉన్న వ్యతిరేకతను స్పష్టంగా చూపిస్తోందని అన్నారు. గ్రామాభివృద్ధి కోసం ప్రజల నమ్మకానికి తగ్గట్టుగా పనిచేస్తామని హామీ ఇచ్చారు. అదేవిధంగా పరిగి మండలం ఖుదావన్‌పూర్ గ్రామం నుంచి బీఆర్ఎస్ పార్టీ బలపరిచిన యాదయ్య భారీ మెజారిటీతో ఘన విజయం సాధించారు. యాదయ్యతో పాటు గోపాల్, ఉపసర్పంచ్ నర్సింలు ను మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి సత్కరించారు. గ్రామ అభివృద్ధిలో అందరూ కలిసికట్టుగా ముందుకు సాగాలని ఆయన ఆకాంక్షించారు. పరిగి మండలం మిట్ట కోడూరు గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ బలపరిచిన పోనేమోని మాణిక్యం విజయం సాధించడంతో, మాణిక్యం ని కూడా కొప్పుల మహేష్ రెడ్డి సన్మానించారు. గ్రామాల్లో మౌలిక వసతులు, సంక్షేమ పథకాలు ప్రజలకు అందేలా కృషి చేస్తామని విజేతలు తెలిపారు.

# జాతీయ లోక్ అదాలత్ ను విజయవంతం చేయండి

**జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎం. రాజేందర్**



**భద్రాద్రి కొత్త గూడెం డిసెంబర్ 18( సమయం న్యూస్). :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లోని అన్ని కోర్ట్ లలో డిసెంబర్ 21న (ఆదివారం) తారీకున జరిగే జాతీయ లోక్ అదాలత్ ను విజయవంతం చేయాలనీ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎం. రాజేందర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కాబట్టి మీ మీద కానీ, మీకు తెలిసిన వాళ్ల మీద కానీ, మీ బంధువుల మీద కాని ఏమైనా కేసులు ఉన్నట్లైతే వాటిని (కాంప్రమైజ్ ) రాజీ చేసుకోవచ్చని అన్నారు. కక్షిదారులు తమ కేసులను రాజీమార్గంలో పరిష్కరించుకోవడం వలన సమయం, డబ్బు అదా అవుతుందని అన్నారు. పెండింగ్ కేసుల పరిష్కారం కొరకై ఈ లోక్ అదాలత్ ను నిర్వహిస్తున్నామని తెలిపారు. కావున అత్యధిక కేసులను పరిష్కరించడం కొరకు పోలీసు అధికారులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది కృషి చేయాలని తెలిపారు.

1. యాక్సిడెంట్ కేసులు
2. సివిల్ కేసులు
3. చీటింగ్ కేసులు
4. చిట్ ఫన్డ్ కేసులు
5. భూతగాదాలు కు సంబంధించిన కేసులు
6. వివాహ బంధానికి సంబంధించిన కేసులు
7. చిన్నచిన్న దొంగతనం కేసులు
8. డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు
9. కుటుంబ తగాదాలు
10. బ్యాంకు లావాదేవీల కేసులు 11. టెలిఫోన్ బకాయిల కేసులు
12. కొట్టుకున్న కేసులు
13. సైబర్ క్రైమ్ కేసులు
14. చెక్ బౌన్స్ కేసులు

ఈ లోకదాలత్ లో రాజీ చేసుకుని, కేసును పూర్తిగా క్లోజ్ చేసుకునే అవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

# ప్రశాంతంగా ముగిసిన గ్రామ పంచాయతీ ఎన్నికల

**నిర్వహణలో భాగస్వామ్యం అయిన అన్ని శాఖల అధికారులకు అభినందనలు తెలిపిన జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్.**



**కామారెడ్డి డిసెంబర్18( సమయం న్యూస్). :** మూడు దశల్లో నిర్వహించిన గ్రామ పంచాయతీ ఎన్నికలు జిల్లా లో ప్రశాంతంగా ముగిశాయని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ తెలిపారు ఎన్నికల నిర్వహణ లో బాధ్యత గా పని చేసిన వివిధ శాఖల అధికారులను కలెక్టర్ అభినందించారు. ఈ సందర్భంగా గురువారం ఎంపిడిఓ లు, వివిధ ఎన్నికల సిబ్బంది కలెక్టర్ ను శాలువాతో సన్మానించారు.

# క్రిస్టమస్ శాంతి, ప్రేమ, కరుణకు ప్రతీక

**-జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్**



**భద్రాద్రి కొత్తగూడెండిసెంబర్18( సమయం న్యూస్). :** క్రిస్టమస్ పండుగ శాంతి, ప్రేమ, కరుణ, త్యాగం వంటి మానవీయ విలువలకు ప్రతీక అని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు. గురువారం ఐడీఓసీ కార్యాలయంలో కార్యాలయ ఉద్యోగుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్రిస్టమస్ వేడుకలకు జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై కేక్ కట్ చేసి ఉద్యోగులు, సిబ్బందికి క్రిస్టమస్ శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. చిన్నారులు శాంతాక్లాజ్, వేషధారలతో పాటు నృత్యాలు, పాటలు, సందేశాత్మక ప్రదర్శనలు చేసి అందరినీ అలరించారు. క్రిస్టమస్ పండుగ స్ఫూర్తిని ప్రతిబింబించేలా నిర్వహించిన ఈ కార్యక్రమాలు వేడుకలకు ప్రత్యేక శోభను చేకూర్చాయి. అనంతరం జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ మాట్లాడుతూ, క్రిస్టమస్ పండుగ శాంతి, సంతోషం, ప్రేమ, కరుణ, త్యాగం వంటి విలువలను సమాజానికి గుర్తు చేసే గొప్ప పండుగ అని అన్నారు. యేసుక్రీస్తు బోధనలు సర్వ మానవాళికి ఆదర్శప్రాయమని, వాటిని ప్రతి ఒక్కరూ తమ జీవితాల్లో ఆచరించాలని సూచించారు. పరస్పర సహకారం, సహనం, సోదరభావంతో జీవించడమే క్రిస్టమస్ పండుగ యొక్క అసలైన సందేశమని తెలిపారు. క్రిస్టమస్ పండుగను క్రైస్తవ సోదరులు తమ కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా, ప్రశాంతమైన వాతావరణంలో జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ క్రిస్మస్ ప్రతి ఇంట్లో ప్రేమ, సంతోషం, శాంతి, సిరిసంపదలు వెల్లివిరియాలని కోరారు. సమాజంలో అన్ని వర్గాల ప్రజలు ఐక్యతతో కలిసి ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ సంక్షేమ అధికారి సంజీవరావు, ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి శ్రీలత, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి స్వర్ణలత లెనీనా, టేకులపల్లి జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ సులోచన రాణి, టీజీవోస్ జిల్లా అధ్యక్షులు సంఘం వెంకట పుల్లయ్య, టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షులు అమరనేని రామారావు జిల్లా అధికారులు, పాస్టర్లు ప్రభుదాస్, తిమోతి, ఐడీఓసీ కార్యాలయ సిబ్బంది, ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొని క్రిస్టమస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు.

# పుష్కర ఏర్పాట్లు సమర్థవంతంగా నిర్వహించాలి

**● జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



**మంచిర్యాల డిసెంబర్18( సమయం న్యూస్).:** 2027లో గోదావరి, 2028లో కృష్ణా పుష్కరాలను పురస్కరించుకొని నది తీర ప్రాంతాలలో భక్తులకు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సమర్థవంతంగా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి పుష్కరాల నిర్వహణపై రాష్ట్ర దేవాదాయ శాఖ, ఎర్నెస్ట్ %ఇ% యంగ్ సంస్థ ప్రతినిధులతో జరిగిన వీడియో కాన్ఫరెన్స్ లో ఉమ్మడి జిల్లా దేవాదాయ శాఖ అధికారి నవీన్ కుమార్, మంచిర్యాల రెవెన్యూ మండల అధికారి శ్రీనివాస్ రావు ఇతర అధికారులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పుష్కరాల నిర్వహణపై రాష్ట్ర అధికారులు పలు సూచనలు చేశారని, ఏర్పాట్లు, సమన్వయ చర్యలపై సమీక్షించారని తెలిపారు. గోదావరి పుష్కరాలు%-%2027, కృష్ణా పుష్కరాలు%-%2028 లను సురక్షితంగా, సవ్యంగా, భక్తులకు అనుకూలంగా నిర్వహించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టడం జరిగిందని తెలిపారు. ఈ క్రమంలో పుష్కరాల ప్రణాళిక, సమన్వయం, అమలు బాధ్యతలను ఎర్నెస్ట్ %ఇ% యంగ్ సంస్థకు అప్పగించినట్లు తెలిపారు. దేవాదాయ శాఖకు అవసరమైన సమగ్ర వివరాలను అందిస్తామని, పుష్కర ఘాట్లపై క్షేత్ర స్థాయి పరిశీలనలు ఇప్పటికే నిర్వహించామని తెలిపారు. పుష్కరాల ఏర్పాట్లను సమర్థవంతంగా అమలు చేసేందుకు జిల్లా స్థాయిలో చర్యలు చేపట్టడం జరిగిందని, పుష్కరాల ఏర్పాట్లకు సంబంధించి రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ ను జిల్లా నోడల్ అధికారిగా నియమించడం జరిగిందని తెలిపారు. జిల్లాలో మొత్తం 11 ప్రాంతాల్లో పుష్కర ఘాట్లు ఉన్నాయని, భక్తుల సందర్శన సంఖ్య ఆధారంగా ఈ ఘాట్లను 3 టియర్స్‌గా విభజించడం జరిగిందని తెలిపారు. ఆయా ఘాట్ల అభివృద్ధి పనులు, మౌలిక సదుపాయాల కల్పనను పుణ్యక్షేత్రాల అభివృద్ధి, ఆలయాల పునరుద్ధరణ, స్నానఘాట్ల అభివృద్ధి, రహదారులు, త్రాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్, ఆరోగ్యం, భద్రత వంటి అంశాలపై సంబంధిత శాఖలు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యతో పాటు క్రీడలలో రాణించాలి

- **పి. ప్రావీణ్య , జిల్లా కలెక్టర్.**
  **సంక్షేమ రెసిడెన్షియల్ కళాశాలలో విద్యతో పాటు క్రీడల్లో ప్రత్యేక శిక్షణ.**
- **సంక్షేమ రెసిడెన్షియల్ పాఠశాల విద్యార్థులకు 35 విభాగాలకు చెందిన ప్రత్యేక కోచ్ లతో క్రీడల్లో శిక్షణ**
- **రాష్ట్రస్థాయి 11వ స్పోర్ట్స్ మీట్ ప్రారంభం**



**సంగారెడ్డి ,డిసెంబర్18 ( సమయం న్యూస్): –** క్రీడలు వ్యక్తిని ఉన్నతంగా తీర్చిదిద్దడమే కాకుండా, మానసిక–శారీరక ఒత్తిడిని తగ్గించడంలో కీలక పాత్ర పోషిస్తాయని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య అన్నారు. గురువారం పటాన్‌చెరువు మండలం లోని ఇస్నాపూర్ తెలంగాణ రాష్ట్ర సోషల్ వెల్ఫేర్ ఎడ్యుకేషన్ ఇన్స్టిట్యూట్ ( టి జి ఎస్ ఆర్ ఇ ఐ ఎస్ ) లో నిర్వహించిన 11వ రాష్ట్రస్థాయి స్పోర్ట్స్ మీట్ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై అట్టహాసంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి, జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం గురుకుల పాఠశాలలో జాతీయ జెండాతో పాటు స్పోర్ట్స్ ఫ్లాగ్‌ను ఆవిష్కరించారు. క్రీడాకారులతో కలిసి క్రీడా జ్యోతిని వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు .రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చిన క్రీడాకారులను పరిచయం చేసుకొని, క్రీడాకారులతో కలిసి వాలీబాల్ ఆడి వారిలో ఉత్సాహాన్ని నింపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ... రాష్ట్రస్థాయి 11వ స్పోర్ట్స్ మీట్‌కు సంగారెడ్డి జిల్లా వేదిక కావడం ఎంతో సంతోషకరమన్నారు. నిత్యజీవితంలో ముఖ్యంగా అమ్మాయిలకు క్రీడలు, ఫిట్నెస్ అత్యంత అవసరమని తెలిపారు. పాఠశాల, కళాశాల, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో క్రీడల్లో ప్రావీణ్యం సాధించిన క్రీడాకారులు విద్య, ఉద్యోగాలు మాత్రమే కాకుండా జీవితంలో ఉన్నతంగా స్థిరపడేందుకు క్రీడలు దోహదపడతాయన్నారు. మూడు రోజుల పాటు జరిగే రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు జిల్లాలో జరగడం హర్షించదగ్గ విషయం అన్నారు. క్రీడా పోటీల నియమ నిబంధనల ప్రకారం విద్యార్థులు క్రీడా పోటీల్లో పాల్గొని జాతీయ అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని కలెక్టర్ ఆకాంక్షించారు. క్రీడల ద్వారా అమ్మాయిలు శారీరక–మానసిక దృఢత్వాన్ని పొందించుకోవచ్చన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, గౌరవ ముఖ్యమంత్రి, క్రీడాశాఖలు అన్ని క్రీడలకు ప్రాధాన్యత ఇస్తున్నాయని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం నుంచి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలకు క్రీడాకారులు ఎదగాలని ఆకాంక్షించారు. క్రీడల్లో గెలుపుతో వచ్చే పతకాలు మాత్రమే గొప్పవి కాదని, క్రీడల్లో పాల్గొనడమే నిజమైన విజయమని విద్యార్థులకు తెలిపారు. రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన క్రీడాకారులకు మూడు రోజుల పాటు జరిగే స్పోర్ట్స్ మీట్‌లో అన్ని వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా వివిధ సంక్షేమ రెసిడెన్షియల్ పాఠశాలలను కళాశాలల్లో చదివే విద్యార్థులకు విద్యతో పాటు క్రీడల్లో రాణించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు తెలిపారు 35 విభాగాలకు చెందిన నిష్ణాతులైన కోచ్‌లతో విద్యార్థులకు వారికి ఆసక్తి ఉన్న క్రీడలలో ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు . వాటిలో అర్హత గల పీఈటీలు, పీడీలు, వ్యాయామ ఉపాధ్యాయులు ఉన్నారని తెలిపారు. గురుకులాల్లో చదువుతున్న విద్యార్థులను ఉత్తమ క్రీడాకారులుగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా విద్యార్థినులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి . ఈ కార్యక్రమంలో గురుకుల కోఆర్డినేటర్ కల్పన, పటాన్‌చెరువు తహసీల్దార్ రంగారావు , అధికారులు, ప్రిన్సిపాళ్లు, పీఈటీలు, పీడీలు, వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థినులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

# ఆందోళన వద్దు!.. గండిపేట ఘటనపై జలమండలి వివరణ

## ట్యాంకర్ డ్రైవర్, ఓనర్ పై క్రిమినల్ కేసులు




**హైదరాబాద్ డిసెంబర్18( సమయం న్యూస్). :** ఉస్మాన్ సాగర్ (గండిపేట) జలాశయంలో అక్రమంగా మురుగునీటిని పారబోసినట్టు ఉదయం నుంచి సోషల్ మీడియా వేదికగా ప్రచారం జరుగుతోంది. దీనిపై జలమండలి స్పందించింది. హైదరాబాద్ నగర ప్రజలకు తాగునీటిని అందించే ప్రధాన వనరు అయిన గండిపేట జలాశయంలో అక్రమంగా మురుగునీటిని పారబోయడానికి యత్నించిన ప్రైవేట్ సెప్టిక్ ట్యాంకర్‌ను జలమండలి అధికారులు పట్టుకున్నారు. ఈ ఘటనకు పాల్పడిన వ్యక్తులపై మొయినాబాద్ పోలీస్ స్టేషన్‌లో క్రిమినల్ కేసు నమోదు చేసారు.

సంఘటన వివరాలు:డిసెంబర్ 17, 2025 ఉదయం 8:00 గంటల సమయంలో, హిమాయత్ నగర్ గ్రామం వద్ద ఉన్న ఎఫ్.టి.ఎల్ పాయింట్ నంబర్ 428 వద్ద %ు+11 ు%1833 నంబర్ గల సెప్టిక్ ట్యాంకర్ అక్రమంగా మురుగునీటిని జలాశయంలోకి వదలడానికి యత్నించినట్లు పెట్రోలింగ్ సిబ్బంది గుర్తించారు. విచారణలో, డ్రైవర్ రామవత్ శివ నాయక్ (33) మరియు హిమాయత్ నగర్ నివాసి నిరంజన్ ఆదేశాల మేరకు ఈ అక్రమ పనికి పాల్పడినట్లు అంగీకరించారు.తీవ్రమైన ఉల్లంఘనలు: ఈ ఘటనలో జలమండలి అధికారులు ప్రధానంగా మూడు అంశాలను గుర్తించారు:

లోగో దుర్వినియోగం: సదరు ట్యాంకర్‌పై ఎటువంటి అనుమతి లేకుండా HMWSSB లోగోను వినియోగించారు. ప్రజలను మరియు అధికారులను నమ్మించి, తనిఖీల నుంచి తప్పించుకోవడానికి ఈ విధంగా మోసపూరితంగా లోగోను వాడినట్లు తేలింది.అక్రమ వాహనం: ఈ వాహనం బోర్డులో నమోదు చేయబడలేదు. అలాగే నిందితులపై సంబంధిత సెక్షన్ల కింద కేసు నమోదు చేసి, కఠినంగా శిక్షించాలని బోర్డు కోరింది.పర్యావరణానికి హాని: రక్షిత జలాశయంలో మురుగునీరు కలపడం వల్ల లక్షలాది మందికి సరఫరా అయ్యే తాగునీరు కలుషితమై ప్రజా ఆరోగ్యం ప్రమాదంలో పడుతుంది.

జలమండలి ప్రజలకు జల మండలి ఎండీ విజ్ఞప్తి:
ఉస్మాన్ సాగర్ జలాశయంలో మురుగునీటిని పారబోసినట్టు ఉదయం నుంచి సోషల్ మీడియా వేదికగా ప్రచారం అవుతోందని మా దృష్టికి వచ్చింది. ఆ నిజానికి ఒక ట్యాంకర్ క్లీనింగ్ చేసి తీసుకెళ్ళిన ట్యాంకర్ ను మా డిజిఎం పట్టుకొని ఆ మొయినాబాద్ పోలీస్ స్టేషన్ లో లారీ డ్రైవర్, ఓవర్ ఇద్దరిపై క్రిమినల్ కేస్ నమోదు చేసామని అన్నారు. అలాగే జంట రిజర్వాయర్లలో చుట్టుపక్కల నుంచి సీవరేజ్ వాటర్ అప్పుడప్పుడు వస్తుందని జలాశయానికి రెండు వైపులా ఎస్టీపీలు నిర్మాణం చేస్తున్నట్లు చెప్పారు. మరో ఆరు నెలల్లో ఆ ఎస్టీపీలు పూర్తయితే ఆ ప్రాంతంలోని నుంచి వచ్చే సీవరేజ్ ని కూడా 100% ట్రీట్మెంట్ చేయడానికి వెసులుబాటు దొరుకుతుందని ఎండీ వివరించారు.

అలాగే ఉస్మాన్ సాగర్ ఎలాంటి వ్యర్థాలు కలవలేదని, ఈ ఘటనపై ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఐఎస్ ప్రమాణాలతో మూడంచెల క్లోరిన్ ప్రక్రియ ద్వారా నీటి సరఫరా జరుగుతుందని, కాబట్టి మనకి నాకు డ్రింకింగ్ వాటర్ కి సంబంధించిన ఎలాంటి ప్రాబ్లం లేదని అన్నారు.జలమండలి గండిపేట నీటిని ఆసిఫ్ నగర్, మీరాలం వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్ లకు తరలించి ప్రతి గంటకూ నీటి ప్రమాణాలను పరీక్షిస్తామని జలమండలి ఎండీ అశోక్ రెడ్డి వెల్లడించారు. అక్కడ నీటి సరఫరాలో జలమండలి ఇప్పటికే మూడంచెల క్లోరినేషన్ ప్రక్రియ పద్ధతిని అవలంబిస్తుందని ఆయన తెలిపారు. మొదటి దశలో నీటి శుద్ధి కేంద్రాల (డబ్ల్యూటీపీ) వద్ద, రెండో దశలో మెయిన్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ల (ఎంబీఆర్) వద్ద, చివరగా సర్వీస్ రిజర్వాయర్ల వద్ద బూస్టర్ క్లోరినేషన్ ప్రక్రియ జరుగుతుందని పేర్కొన్నారు. దీంతో పాటు ప్రజలకు సరఫరా అవుతున్న నీటిలో కచ్చితంగా 0.5 పీపీఎం క్లోరిన్ ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు వివరించారు. నగర ప్రజలకు శుద్ధమైన నీరు అందించేందుకు ఇండియన్ స్టాండర్డ్ (ఐఎస్ - 10500-2012) ప్రమాణాల్ని పాటిస్తూ.. శాస్త్రీయంగా తీసుకోవాల్సిన అన్ని జాగ్రత్తలనూ తీసుకుంటామని చెప్పారు. ప్రజలెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని విజ్ఞప్తి చేశారు.తాగునీటి వనరులను కలుషితం చేసే ఏ చర్యలనైనా బోర్డు సహించబోదని.. అలంటి వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా నిఘా పెంచుతుమని ఈ సందర్భంగా అశోక్ రెడ్డి అన్నారు.

జలాశయాల పరిసరాల్లో ఎవరైనా అక్రమంగా వ్యర్థాలను పారబోస్తున్నట్లు గమనిస్తే, వెంటనే స్థానిక అధికారులకు లేదా జలమండలి 155313 కస్టమర్ కేర్ నంబర్‌కు సమాచారం అందించాలని బోర్డు కోరుతోంది.

# సిద్దిపేట జిల్లాలో ఆయిల్ ఫాం సాగు పెంపు కు చర్యలు.




**సిద్దిపేట డిసెంబర్18( సమయం న్యూస్).:** గురువారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని కాన్ఫరెన్స్ హాల్ లో జిల్లాలోని ఉద్యాన వన శాఖ, ఆయిల్ ఫ్రైడ్, మైక్రో ఇరిగేషన్ కంపెనీ అధికారులతో ఆయిల్ ఫామ్ సాగు పెంపు పైన జిల్లా కలెక్టర్ కె. హైమావతి సమీక్ష నిర్వహించారు.జిల్లాలో ఇప్పటివరకు 13576 ఆయిల్ ఫామ్ ప్లాంటేషన్ జరిగినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ..జిల్లాలో ఈ సంవత్సరం 6500 ఎకరాల లక్ష్యానికి గాను 2998 ఎకరాల శాంక్షన్ 1536 ఎకరాలు మాత్రమే ప్లాంటేషన్ పూర్తి చేశారని ఆశించిన స్థాయిలో ఆయిల్ ఫామ్ సాగు లేదని అసహనం వ్యక్తం చేశారు. ఖరీఫ్ సీజన్ పూర్తి అయినందున రైతులు రబీ సీజన్ కి సన్నద్ధం అయ్యేలోపు జిల్లాలోని ప్రతి ఒక్క రైతుని కలిసి ఆయిల్ ఫామ్ సాగు చేయడానికి ప్రతి ఒక్క అధికారి పని చెయ్యాలని ఆదేశించారు.ఈ వారం మొత్తం స్పెషల్ డ్రైవ్ గా తీసుకుని ఒక ప్రణాళిక ప్రకారం ప్రతి గ్రామంలో రైతులతో సమావేశాలు నిర్వహించి మీకు ఇచ్చిన టార్గెట్ తప్పనిసరిగా చేరుకోవాలని ప్రతి రోజు పని తీరును పర్యవేక్షణ చెయ్యాలని డిఎచ్ఓ సువర్ణ నీ ఆదేశించారు. గ్రామాల్లో సమావేశాలలో రైతులకు ఆయిల్ ఫామ్ సాగు చేస్తూ ఆదాయం పొందుతున్న రైతులతో వారికి ప్రోత్సాహం సక్సెస్ స్టోరీలు మరియు ఆయా జిల్లాలో ఆయిల్ ఫామ్ సాగు చేస్తున్న వ్యవసాయ క్షేత్రాలను చూసేందుకు చర్యలు తీసుకోవాలి.అడ్మినిస్ట్రేషన్ శాంక్షన్ ఇచ్చిన రైతులు త్వరగా ఫిట్టింగ్ ప్లాంటింగ్ చెయ్యాలని తెలిపారు. అలాగే డ్రిప్ డిడి సైతం కట్టించి డ్రిప్ పెట్టించాలని తెలిపారు.ఆయిల్ ఫామ్ సాగు లాభదాయకం అని రెండు సంవత్సరాల వరకు అంతర పంటలు వేసుకోవచ్చు అని మూడవ సంవత్సరం నుండి ఆయిల్ ఫామ్ గెలలు వస్తాయని నాలుగో సంవత్సరం నుండి పంట వస్తుందని రైతులకు ఒక నమ్మకం కలిగించేలా ప్రతి ఒక్క అధికారి పని చెయ్యాలని ఆదేశించారు.ఆయిల్ ఫామ్ కర్మాగారం మన జిల్లాలోని ఉన్నందున ఎక్కువ మొత్తంలో ఆయిల్ ఫామ్ ప్లాంటేషన్ చేయించాలని విధుల్లో నిర్లక్ష్య భవిస్తే కఠిన చర్యలు తప్పవని తెలిపారు.

## మహబూబాబాద్ రైల్వే మెగా మెయింటెనెన్స్ డిపో మహబూబాబాద్ లోనే ఏర్పాటు కు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్

- ఎమ్మెల్యే భూక్య మురళి నాయక్ వెల్లడి
- అభినందనలు తెలిపిన రాజకీయ ప్రజా సంఘాలు



**మహబూబాబాద్ డిసెంబర్18( సమయం న్యూస్).:** నేడు రైల్వే మెగా మెయింటెనెన్స్ డిపో ఏర్పాటుకై అఖిలపక్ష ప్రజాసంఘాలు నేడు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మురళి నాయక్ గారితో సమావేశం అవడం జరిగింది ఈ సమావేశంలో ఎమ్మెల్యే డాక్టర్ బి మురళి నాయక్ మాట్లాడుతూ గత జూన్ నెల నుండి ఈ యొక్క రైల్వే మెగా మెయింటెనెన్స్ ప్రాజెక్ట్ ఏర్పాటు కోసం వివిధ రకాల ప్రయత్నాలను చేయటం జరిగిందని ఒక వైపున రాష్ట్ర ప్రభుత్వం మరోవైపున రైల్వే సంబంధిత ఉన్నతాధికారులతో ఎప్పటికప్పుడు చర్చించి మాట్లాడి వారి సూచనలు సలహాలు తీసుకున్నాము ఈ క్రమంలో ముఖ్యంగా గౌరవ ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి గారి సహకారంతో ప్రత్యేక శ్రద్ధతో ఈ ప్రక్రియను ముందుకు కొనసాగించడం జరిగిందని తెలిపారు ఈ క్రమంలో ప్రత్యేక పరిస్థితుల్లో రహస్యంగా భూ సర్వేలు నిర్వహించి సంబంధిత అనంతరం శివారులోని సుమారు409 ఎకరాలలో ఏర్పాటుకు కోసం సర్వే చేపించడం జరిగిందని ఇట్టి సర్వే వివరాలను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ద్వారా సౌత్ సెంట్రల్ రైల్వేజనరల్ మేనేజర్ కు రాష్ట్ర ప్రభుత్వ స్పెషల్ సెక్రటరీ ద్వారా పంపించడం జరిగిందని తెలియజేశారు ఇది ఎక్కడికి తరలిపోదని అలా జరిగే ప్రయత్నాలు అన్నీ కూడా అడ్డుకుంటామని అందుకోసం అవసరమైన సందర్భాల్లో రాజకీయ పార్టీలు కూడా మహబూబాబాద్ ప్రాంత అభివృద్ధికి ఈ డిపో ఏర్పాటుకు సహకరించాలని కోరారు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి గారికి ప్రత్యేక శ్రద్ధ పెట్టిన ఎమ్మెల్యే భూక్య మురళి నాయక్ గారికి సహకారం అందించిన ఎంపీ పోరిక బలరాం నాయక్ గారికి సహకరించిన ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావు గారికి అభినందనలు తెలిపిన అఖిలపక్షం శంకుస్థాపన మరియు ప్రారంభం అయ్యేవరకు కలిసికట్టుగా కృషి చేద్దాం సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి బి విజయ సారథి సిపిఎం జిల్లా కార్యదర్శిసాధుల శ్రీనివాస్ కోఆర్డినేటర్ మైస శ్రీనివాస్ సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి గౌని ఐలన్న, కాంగ్రెస్ పార్టీ అర్బన్ అధ్యక్షుడు గణపురపు అంజయ్య ప్రజాసంఘాల నాయకులు గుగ్గిళ్ల పీరయ్య పిల్లి సుధాకర్ కొండ్ర ఎల్లయ్య బీమా నాయక్ రమేష్ నాయక్ సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ జిల్లా నాయకుడు కొత్తపెల్లి రవి బీఎస్పీ రాష్ట్ర నాయకుడు దార్ల శివరాజ్ టిడిపి నాయకుడు ప్రేమ్చంద్ వ్యాస్, ఎం సి పి ఐ నేత కంచె వెంకన్న మైనార్టీ నేత ఇక్బాల్ సిపిఐ మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అజయ్ సారథి కాంగ్రెస్ నేతలు ఎండి మొహమ్మద్ ఖలీల్ ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

## జాతర ఏర్పాట్ల ప్రతిపాదనలు డిసెంబర్ 22 లోగా సమర్పించాలి

- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష
- సమ్మక్క సారలమ్మ జాతర నిర్వహణ పై సంబంధిత అధికారులతో రివ్యూ నిర్వహించిన జిల్లా కలెక్టర్



**పెద్దపల్లి, డిసెంబర్ 18:( సమయం న్యూస్) :** సమక్క సారలమ్మ జాతర ఏర్పాట్ల ప్రతిపాదనలు డిసెంబర్ 22 లోగా సమర్పించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు.గురువారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమ్మక్క సారలమ్మ జాతర నిర్వహణ పై సంబంధిత అధికారులతో రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, సమ్మక్క సారలమ్మ జాతర నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు పంచాయతీ రాజ్ అధికారులు కట్టుదిట్టంగా చేపట్టాలని అన్నారు. గోలివాడ సమ్మక్క సారలమ్మ జాతర నిర్వహణకు సంబంధించి చేపట్టాల్సిన పంచాయతీ రోడ్ల మరమ్మత్తులు, క్యూ లైన్ల ఏర్పాటు, ఇతర పనులకు సంబంధించి ప్రతిపాదనలు డిసెంబర్ 22 లోపు సమర్పించాలని కలెక్టర్ తెలిపారు.గోదావరిఖని, గోలివాడ జాతర నిర్వహణ ప్రాంతాలలో పారిశుధ్య నిర్వహణ సంబంధించి పంచాయతీ అధికారులు, కార్పొరేషన్ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అదనపు సిబ్బంది నియమించాలని కలెక్టర్ తెలిపారు. విద్యుత్ సరఫరా లో ఎటువంటి కోతల రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. జాతర దగ్గర స్టాండ్ బై ట్రాన్స్ ఫార్మర్ ఏర్పాటు చేయాలని అన్నారు. జాతర నిర్వహణ విధులలో పాల్గొనే సిబ్బందికి నాణ్యమైన భోజనం త్రాగునీరు ఇతర ఏర్పాట్లు కల్పించాలని దేవదాయ శాఖ అధికారులను కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో పెద్దపల్లి రెవెన్యూ డివిజన్ అధికారి బి గంగయ్య, కరీంనగర్ దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సుప్రియ, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల నుండి వచ్చిన విన్నొస్పాలను సత్వరమే పరిష్కరించాలి.

అదనపు కలెక్టర్ రెవెన్యూ మధుసూదన్ నాయక్




**మహబూబ్ నగర్ డిసెంబర్18( సమయ్యం న్యూస్) :**ఆర్డిఓ నవీన్ తో పాటు కలిసి అన్ని మండలాల తహశీల్దార్ తో డిప్యూటీ తహశీల్దార్లు రెవెన్యూ ఇన్స్పెక్టర్లు తో వీడియో కాన్ఫరెన్స్ తీసుకోవడం జరిగింది సిఎం మరియు కలెక్టరు ప్రజావాణి పెండింగ్ ధరఖాస్తు లను పరిష్కరించాలని అలాగే భూ భారతి ధరఖాస్తు లను త్వరగా క్లియర్ చేయాలని మరియు ఎన్నికల ఓటరు గుర్తింపు ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు

## అక్రమ నల్లా కనెక్షన్‌దారులపై ఎఫ్ఐఆర్ నమోదు




**హైదరాబాద్ డిసెంబర్18( సమయం న్యూస్) :** జలమండలి ఎండీ అశోక్ రెడ్డి ఆదేశాలతో అక్రమ నల్లా కనెక్షన్ దారులపై విజిలెన్స్ అధికారులు కొరడా ఝుళిపించారు. జలమండలి సరఫరా చేస్తున్న పైపులైను నుంచి అక్రమంగా నల్లా కనెక్షన్ పొందిన తొమ్మిది మందిపై క్రిమినల్ కేసులు నమోదు చేశారు. జలమండలి ఓ అండ్ ఎం డివిజన్ నం. 4 (రెడ్ హిల్స్), రెడ్ హిల్స్ లో-లెవెల్ సెక్షన్ పరిధిలో సీతారాం బాగ్ ప్రాంతంలో ఇటీవల జిహెచ్ఎంసీ నూతన రోడ్డు నిర్మాణం చేపట్టింది. ఇదే అదునుగా... కాలనీ తొమ్మిది మంది ఇంటికో అధికార కనెక్షన్ ఉండగా.. అధికారుల అనుమతులు లేకుండా వారే స్వంతంగా మొత్తం 15 అక్రమ నల్లా కనెక్షన్ తీసుకున్నారు. ఈ విషయాన్ని గుర్తించిన జలమండలి విజిలెన్స్ విభాగం ఎండీ సూచనలతో అక్రమ నల్లా కనెక్షన్‌ను తొలగించడంతో పాటు అక్రమ కనెక్షన్ తీసుకున్న తొమ్మిది మందిపై కేసు క్రిమినల్ కేసులు నమోదు చేశారు.అధికారుల అనుమతులు లేకుండా అక్రమ నల్లా కనెక్షన్లు తీసుకుంటే అలాంటి వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని జలమండలి అధికారులు ఈ సందర్భంగా హెచ్చరించారు. జలమండలి అధికారుల నుంచి అనుమతి లేకుండా ఎవరైనా అక్రమంగా తాగునీటి నల్లా, సీవరేజ్ పైపు లైన్ కనెక్షన్లు తీసుకుంటే.. క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని అధికారులు హెచ్చరించారు. ఎవరైనా అక్రమ నల్లా, సీవరేజ్ కనెక్షన్లు గుర్తిస్తే.. జలమండలి విజిలెన్స్ బృందానికి 9989998100, 9989987135 ఫోన్ నంబర్ల ద్వారా సమాచారం ఇవ్వగలరు.

## ఘాట్ రోడ్డులో అదుపుతప్పిన ఆర్టీసీ బస్సు..!



కుమరంభీం జిల్లాలో ఆర్టీసీ బస్సు ప్రమాదానికి గురయ్యింది. ఆదిలాబాద్ డిపోకు చెందిన బస్సు.. కెరమెరి మండలం పరందోలి నుంచి ఆదిలాబాద్‌కు బయల్దేరింది. మార్గమధ్యంలో పరందోలి ఘాట్ వద్ద అదుపుతప్పి పక్కనే ఉన్న పత్తి చేనులోకి దూసుకెళ్లింది.ఈ ఘటనలో బస్సులో ఉన్న 30 మంది ప్రయాణికులకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు.

## గండిపేట చెరువులో పాడు పనికి యత్నం..

మనుషుల్లో స్వార్థం పెరిగిపోయింది. ప్రాణాలు నిలుపుతున్న ప్రకృతినే పాడు చేయడానికి ప్రయత్నిస్తున్నారు. దారుణమైన పనులకు తెగబడుతున్నారు. పట్టణాలలోని కొంతమంది చేస్తున్న పనులు చూస్తే ... 'వీళ్లసలు మనుషులేనా?' అనిపించకమానదు. పర్యావరణాన్ని నాశనం చేయడానికి కంకణం కట్టుకున్నాట్లుగా ప్రవర్తిస్తున్నారు.

తాజాగా హైదరాబాద్‌లో జరిగిన ఓ సంఘటన ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణగా నిలుస్తోంది. గండిపేట వాసుల దప్పిక తీరుస్తున్న గండిపేట్ చెరువులో ఓ వ్యక్తి సెప్టిక్ ట్యాంకర్ ద్వారా మలమూత్ర వ్యర్థాలను వదిలే ప్రయత్నం చేశాడు. ఇది గమనించిన స్థానికులు వాటర్ బోర్డు అధికారులు ఫిర్యాదు చేశారు.

బుధవారం సింగరేణి కాలనీ, సైదాబాద్‌కి చెందిన శివ అనే వ్యక్తి గండిపేట్ చెరువులో సెప్టిక్ ట్యాంకర్ ద్వారా మలమూత్ర వ్యర్థాలను వదిలే ప్రయత్నం చేశాడు. ఇది గమనించిన స్థానికులు వాటర్ బోర్డు అధికారులకు ఫిర్యాదు చేశారు.

ఈ ఫిర్యాదుపై అధికారులు స్పందించారు. పోలీసులతో కలిసి సంఘటనా స్థలానికి వెళ్లారు. ఓ సెప్టిక్ ట్యాంకర్ హిమాయత్ నగర్ గ్రామంలోని ఎఫ్టీఎల్ పాయింట్ నెంబర్ 428 వద్ద ఉన్న ఉస్మాన్ సాగర్ రిజర్వాయర్‌లో మలమూత్ర వ్యర్థాలను పోస్తూ కనిపించింది. పోలీసులు శివను పట్టుకుని విచారించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.



## కారేపల్లి లో ఏసీబీ కి రెడ్ హ్యాండెడ్ గా చిక్కిన ఆర్ ఐ

దౌలూరి శుభ కామేశ్వరి దేవీ Ri కారేపల్లి ఫ్యామిలీ మెంబెర్ సర్టిఫికెట్ కోసం పది వేలు లంచం తీసుకుంటు ఉండగా ఏసీబీ డి ఎస్పీ వై. రమేష్ ఆధ్వర్యంలో దాడి..

## క్రీడల తో..శారీరక, మానసిక దృఢత్వం పెంపు

- విద్యార్థులలో క్రమశిక్షణ, ఏకాగ్రత, నాయకత్వ • లక్షణాలను పెంపొందించడమే లక్ష్యం
- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

**జనగాం డిసెంబర్18( సమయం న్యూస్). :** తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ హైదరాబాద్ ఆధ్వర్యంలో... జనగామ సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర పాఠశాలలో గురువారం 11వ రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి, డా. బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి, జెండా ఆవిష్కరణ చేసారుఅనంతరం టార్చ్ రిలేను వెలిగించి క్రీడా పోటీలను అధికారికంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా.... విద్యార్థుల నుండి కలెక్టర్ మార్చ్‌పాస్ట్ వందనం స్వీకరించిన అనంతరం.. రాష్ట్రవ్యాప్తంగా క్రీడా మీట్స్‌కు వచ్చిన విద్యార్థులను అభినందించారు. జనగామ జిల్లాలో రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు నిర్వహించుకోవడం ఎంతో గర్వకారణమని పేర్కొన్నారు. క్రీడలు శారీరక, మానసిక ఉల్లాసాన్ని పెంపొందించడమే కాకుండా నాయకత్వ లక్షణాలను అభివృద్ధి చేస్తాయని తెలిపారు. విద్యార్థులు శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండేందుకు క్రీడలు కీలక పాత్ర పోషిస్తాయని, అందరూ క్రీడల్లో ఉత్సాహంగా పాల్గొని ప్రతిభ కనబర్చాలని సూచించారు.ప్రిన్సిపాళ్లు, సిబ్బంది విద్యార్థులను సమర్థంగా చూసుకోవాలని, పీడి లు నిష్పక్షపాతంగా పోటీలను నిర్వహించాలని తెలిపారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పాల్గొనే లక్ష్యంతో విద్యార్థులు ముందుకు సాగాలని ఆకాంక్షించారు.విద్యార్థులు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతున్నారని పేర్కొన్నారు. గురుకులాల నుండి ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించిన పూర్ణ ఆనంద్ వంటి ఆదర్శ వ్యక్తులను మార్గదర్శకులుగా తీసుకొని క్రీడల్లో రాణించాలని విద్యార్థులకు సూచించారు. ఈకార్యక్రమంలో.. జాయింట్ సెక్రటరీ బి. సక్రు నాయక్,డాక్టర్ బి. విక్రమ్ కే. జితేందర్ రెడ్డి , జి. శంకర్ రెడ్డి ( జనగామ, శ్రీమతి హెచ్. అరుణకుమారి (మల్టీజోన్-1 ఆఫీసర్, ఎస్. విద్యారాణి (జోనల్ ఆఫీసర్%-%5), పి. శ్రీనివాసరావు (ప్రిన్సిపల్), అలగోని నరసింహులు గౌడ్ (వైస్ ప్రిన్సిపల్), వివిధ కళాశాలల ప్రిన్సిపాళ్లు, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ జి. శ్రీనివాస్ డి. కిషన్ అలాగే వివిధ కళాశాలల నుండి వచ్చిన పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.రాష్ట్రవ్యాప్తంగా వివిధ సంక్షేమ గురుకులాల నుండి వచ్చిన విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక, నృత్య ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచి, కార్యక్రమాన్ని మరింత విజయవంతం చేశాయి.

## పబ్లిక్ టాయిలెట్‌లను సక్రమంగా నిర్వహించేలా చూడండి

- నగర మేయర్ శ్రీమతి గుండు సుధారాణి
- వరంగల్ ఫైర్ స్టేషన్ సమీపం లో మరుగుదొడ్ల పరిశీలన.



**వరంగల్ డిసెంబర్ 18( సమయం న్యూస్) :** నగరం లో పబ్లిక్ టాయిలెట్ లను సక్రమం గా నిర్వహించేలా చూడాలని నగర మేయర్ శ్రీమతి గుండు సుధారాణి అధికారులను ఆదేశించారు గురువారం వరంగల్ పరిధి ఫైర్ స్టేషన్ సమీపం లో గల ప్రజా మరుగుదొడ్లను మేయర్ క్షేత్ర స్తాయి లో పరిశీలించి నిర్వహణ తీరు పట్ల అసహనం వ్యక్తం చేసి సమర్థవంతం గా నిర్వహించుటకు తగు సూచనలు చేశారు.ఈ సందరరే గా మేయర్ మాట్లాడుతూ పట్టణ ప్రగతి లో భాగం గా ఏర్పాటు చేసిన పబ్లిక్ టాయిలెట్ల నిర్వహణ సక్రమంగా జరగాలని టాయిలెట్స్ నిర్వహణ కోసం కేటాయించిన నిర్వాహకులు 24/7 స్థానికంగా ఉంటూ నిర్వహణ చేపట్టాలని అలా నిర్వహించే వారికే బిల్లుల చెల్లింపులు జరుగుతాయని సక్రమంగా నిర్వహించని పబ్లిక్ టాయిలెట్ ఆపరేటర్లకు నోటీసులు జారీ చేయాలని ఏం హెచ్ ఓ ను ఆదేశించారు. అనంతరం పోతన నగర్ లో గల సెకండ్ ట్రాన్స్ఫార్ స్టేషన్ ను క్షేత్రస్థాయిలో పరిశీలించిన మేయర్ ఎన్ని కంటైనర్ లు పని చేస్తున్నాయో అడిగి తెలుసుకోని మాట్లాడుతూ కంటైనర్ లు మరమత్తులకు గురి ఐతే వెంటనే పునరుద్ధరించాలని ట్రాన్స్ఫార్ స్టేషన్ ఆవరణ పరిశు భ్రం గా ఉండేలా చూడాలని ట్రాన్స్ఫార్ స్టేషన్ ఆవరణ లో హార్టికల్టర్ వారు మొక్కలు నాటేలా చూడాలని మేయర్ అన్నారు. ఈ కార్యక్రమం లో ఎం హెచ్ ఓ డా.రాజేష్ సానిటరీ సూపర్ వైజర్ లు పసునూరి భాస్కర్ గోల్కొండ శ్రీను తదితరులు పాల్గొన్నారు

## రోడ్డు భద్రతా ఎక్స్‌పో విజయవంతం

**హన్మకొండ డిసెంబర్18( సమయం న్యూస్ :** ఈ రోజు రోడ్డు భద్రతా కార్యక్రమంలో భాగంగా రోడ్డు భద్రతా చర్యలపై పోస్టర్ ప్రదర్శనతో పాటు రోడ్డు భద్రతా ఎక్స్‌పోను విజయవంతంగా నిర్వహించడం జరిగింది. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రదర్శనలను వివరిస్తూ, రోడ్డు భద్రతపై అవగాహనతో పాటు బాధ్యతాయుతమైన ద ృక్పథాన్ని ప్రదర్శించారు.ఈ కార్యక్రమాన్ని ఆంగ్ల విభాగం,"యూనిట్లు, మరియు లిటరరీ క్లబ్ల సహకారంతో నిర్వహించడం జరిగింది. ఇది సమన్వయం, సామాజిక బాధ్యత పట్ల కళాశాల నిబద్ధతకు నిదర్శనంగా నిలిచింది.ఈ కార్యక్రమానికి మా కళాశాల ప్రిన్సిపాల్ గారు, గౌరవనీయులైన ప్రొఫెసర్ జి. శ్రీనివాస్ గారు ముఖ్య అతిథిగా విచ్చేసి, విద్యార్థుల స ృజనాత్మకతను, నిబద్ధతను, రోడ్డు భద్రతపై అవగాహన కల్పించేందుకు చేసిన ప్రయత్నాలను హ ృదయపూర్వకంగా అభినందించారు.ఈ కార్యక్రమం ఘన విజయం సాధించడానికి సహకరించిన అన్ని అధ్యాపకులకు మా హ ృదయపూర్వక క ృతజ్ఞతలు. ప్రత్యేకంగా విద్యార్థులకు ప్రోత్సాహం, ఆశీర్వాదాలు అందించిన ప్రిన్సిపాల్ సహకారం మరువ లేనిదన్నారు.

# రసాయన రహిత వ్యవసాయ సాగు పైన అవగాహన కల్పించాలి

- ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ పొందిన కృషి సఖీలకు సర్టిఫికెట్ల ప్రదానం
- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



**జనగాం డిసెంబర్18( సమయం న్యూస్).:** ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ అభ్యసించిన కృషి సఖీలకు సర్టిఫికెట్ల ప్రధానోత్సవ కార్యక్రమం గురువారం కలెక్టరెట్ లోని వీసీ హాల్ లో ఏర్పాటు చేసారు ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ముఖ్య అతిథిగా పాల్గొని కృషి సఖీలను అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ మాట్లాడుతూ.... ప్రతి గ్రామంలో ప్రతి రైతుకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించాలన్నారు. మండల సమాఖ్య సమావేశాల్లో ఈ అంశాన్ని ప్రధాన అజెండాగా తీసుకొని, అంగన్వాడీ కేంద్రాలు పాఠశాల స్థాయిలో కూడా ప్రకృతి వ్యవసాయాన్ని ముందుకు తీసుకెళ్లాలని అధికారులను ఆదేశించారు. అనంతరం శిక్షణ పూర్తి చేసిన కృషి సఖీలకు సర్టిఫికెట్లు అందజేశారు.జిల్లాలో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రకృతి వ్యవసాయ కార్యక్రమంలో భాగంగా మహిళా సంఘాల నుంచి 30 మంది ప్రసిద్ధి గ్రూపు సభ్యులను ఎంపిక చేసి, మారీ స్వచ్ఛంద సంస్థ ద్వారా ఐదు రోజులపాటు శిక్షణ అందించారు.ప్రకృతి వ్యవసాయం అనేది రసాయన రహిత వ్యవసాయ విధానం. ఇందులో స్థానిక ఆవు జాతులను సమగ్రంగా వినియోగించడం, రైతు పొలంలోనే తయారు చేసే జీవామృతం, ఘన జీవామృతం, బీజామృతం, నీమాస్త్రం, దశపర్ణి వంటి జీవ పదార్థాల వినియోగం ప్రధాన అంశాలు. ఈ విధానం ద్వారా మట్టి ఆరోగ్యం మెరుగుపడటం, నీటి నిల్వ సామర్థ్యం పెరగటం, పంటల వైవిధ్యం ప్రోత్సహించబడటం, జీవ వైవిధ్యం సంరక్షించబడటం వంటి అనేక ప్రయోజనాలు కలుగుతాయని వివరించారు.జిల్లాలో మొదటి విడతగా 1875 మంది రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించగా, భవిష్యత్తులో మరింత విస్తృతంగా ఈ విధానాన్ని అమలు చేసేందుకు జిల్లా వ్యవసాయ శాఖ ముందుకు వస్తుందని తెలిపారు. శిక్షణ పూర్తిచేసుకున్న కృషి సఖీలు, శిక్షణ సమయంలో నేర్చుకున్న అంశాలను రైతులకు ఎలా చేరవేయాలి, అలాగే భవిష్యత్తులో కృషి సర్కిల్ ద్వారా చేపట్టాల్సిన ప్రణాళికలపై వారికి స్పష్టమైన మార్గనిర్దేశం చేసి ప్రోత్సహించారు.ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి అంబికా సోని,నాబార్డ్ ఏజీఎం చైతన్య రవి తంగ , వ్యవసాయ అధికారి శరత్ చంద్ర , డీఆర్డీఏ జిల్లా అధికారి వసంత , అసిస్టెంట్ డీఆర్డీఏ అధికారి నిరుద్దీన్ , డీపీఎం నలిని , మారి స్వచ్ఛంద సంస్థ ప్రోగ్రాం కార్యకర్తలు మారపాక వెంకటస్వామి, మల్కాపురం ప్రమోద్, రావుల రాజేందర్ గౌడ్, ఫార్మర్ మాస్టర్ ట్రైనర్ చెవ్వ కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు

# ఎన్నికల నిర్వహణలో పాల్గొన్న అన్ని శాఖల అధికారులు, సిబ్బందిని అభినందించారు


- మూడు దశల్లో నిర్వహించిన గ్రామ పంచాయతీ ఎన్నికలు
- ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా, విజయవంతంగా ముగియడం
- పట్ల జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఎంపీడీఓలు, డీపీఓతో పాటు ఎన్నికల నిర్వహణలో పాల్గొన్న
- అన్ని శాఖల అధికారులు, సిబ్బందిని అభినందించారు.



**భూపాల పల్లి డిసెంబర్18( సమయం న్యూస్) :** రాష్ట్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకటించిన నాటి నుండి ఎన్నికల ప్రక్రియ పూర్తి అయ్యే వరకు అధికారులు సమన్వయంతో పనిచేయడం వల్లనే ఎన్నికలు సజావుగా నిర్వహించగలిగామని జిల్లా కలెక్టర్ తెలిపారు. పోలింగ్ రోజు భద్రతా ఏర్పాట్లు, ఓటర్లకు కల్పించిన సౌకర్యాలు, ఎన్నికల నిబంధనల కచ్చితమైన అమలు ఎన్నికల విజయానికి దోహదపడ్డాయని ఆయన పేర్కొన్నారు. గురువారం గ్రామ పంచాయతీ ఎన్నికలు ముగిసిన సందరరేగా డీపీఓ, ఎంపీడీఓలు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మను శాలువతో సన్మానించి, విజయవంతమైన ఎన్నికల నిర్వహణకు అందించిన మార్గదర్శకత్వానికి క ృతజ్ఞతలు తెలిపారు. ఈ సందరరేగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి ప్రజలు చూపిన సహకారం అభినందనీయమని అన్నారు.ఈకార్యక్రమంలో డిపిఓ శ్రీలత, అన్ని మండలాల ఎంపిడిఓలు భాస్కర్, వెంకటేశ్వర్లు, అనిత, జయశ్రీ, రాం ప్రసాద్, తరుణి ప్రసాద్, వెంకటేశ్వర్లు, పవన్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు

## యాప్ బుకింగ్ వద్దు సోసైటి మరియు డీలర్లు ద్వారా యూరియా సరఫరా చేయాలి

- స్థానిక రైస్ మిల్లులకు ధాన్యం కేటాయింపులు చేయాలి
- తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు
- వైరా సోసైటి వైస్ చైర్మన్ కొణెదన కోటేశ్వరరావు



**వైరా: డిసెంబర్ 18( సమయం న్యూస్) : –** రబీ సీజన్ డిసెంబర్ 20 తేదీ నుంచి స్మార్ట్ ఫోన్ యాప్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులకు యూరియా సరఫరా చేయాలనే రాష్ట్ర ప్రభుత్వ ఆలోచన ఉపసంహరించుకోవాలని, స్థానిక రైస్ మిల్లులకు ధాన్యం కేటాయింపులు చేయాలి అని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు, వైరా సోసైటి వైస్ చైర్మన్ కొణెదన కోటేశ్వరరావు డిమాండ్ చేశారు.గురువారం వైరా మండలం అషగుర్తి గ్రామం లో జరిగిన రైతు సంఘం సమావేశం లో రాంబాబు, కోటేశ్వరరావు మాట్లాడుతూ చదువు రాని రైతులు, స్మార్ట్ ఫోన్లు ఉపయోగించే అవగాహన లేని రైతులు యూరియా పోందడం కష్టం అవుతుంది అని అన్నారు, పంటలకు యూరియా అవసరమైన అప్పుడు రైతులు స్మార్ట్ ఫోన్లు ద్వారా యూరియా బుక్ చేస్తే వారం, పది రోజుల తర్వాత సరఫరా అయి పంటలు దెబ్బతినే అవకాశం ఉంటుంది అని అన్నారు. గతం లో లాగా సోసైటి లు, డీలర్లు ద్వారా యూరియా సరఫరా చేయాలని కోరారు, వైరా మండలం లో ఉన్న రైస్ మిల్లులకు ధాన్యం కేటాయింపులు చేయాలి అని ఈ సంవత్సరం ధాన్యం దిగుబడి తగ్గింది అని రైతులు స్వంత ట్రాక్టర్లు ద్వారా రైస్ మిల్లులకు ధాన్యం తరలింపుకు అవకాశం ఉంటుంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో చిత్తారు నాగరాజు, రేమల్ల నారాయణ, శ్రీరమనేని సీతారామయ్య, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు

## పోచారం శ్రీనివాస్ రెడ్డి ని మర్యాద పూర్వకంగా కలిసిన నూతన సర్పంచ్ లు



**బాన్సువాడ, డిసెంబర్ 18 (సమయం న్యూస్) :** బాన్సువాడ నియోజకవర్గ శాసన సభ్యుడు పోచారం శ్రీనివాసరెడ్డి, మాజీ డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డిని బాన్సువాడ పట్టణ కేంద్రంలోని పోచారం నివాసంలో మూడవ విడత గ్రామ పంచాయతీ ఎన్నికల్లో గెలుపొందిన సర్పంచులు మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందరరేగా మూడవ విడత గ్రామ పంచాయతీ ఎన్నికల్లో నసురుల్లాబాద్, బీర్కూర్, బాన్సువాడ గ్రామీణ మండలాల పరిధిలోని 57 గ్రామ పంచాయతీ స్థానాలకు గాను పోచారం బలపరిచిన అభ్యర్థులు ఘన విజయం సాధించారు. ఇందులో ఏకగ్రీవంగా గెలుపొందిన 14 స్థానాలతో కలిపి మొత్తం 41 గ్రామ పంచాయతీ స్థానాల్లో పోచారం బలపరిచిన సర్పంచులు విజయం సాధించడంతో నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలం మరింత పెరిగినట్లు రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.గ్రామీణ ప్రజల సమస్యలపై నిరంతరం స్పందిస్తూ అభివ ృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల ముందుకు తీసుకెళ్లిన ఫలితమే ఈ విజయం అని పలువురు సర్పంచులు ఈ సందరరేగా అభిప్రాయపడ్డారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన, సాగునీటి వసతులు, రహదారులు, విద్యుత్, తాగునీరు వంటి అంశాల్లో గతంలో తీసుకున్న చర్యలకు ప్రజలు మద్దతుగా నిలిచారని తెలిపారు.ఈ సందరరేగా గెలుపొందిన సర్పంచులకు పోచారం శ్రీనివాసరెడ్డి, పోచారం భాస్కర్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలు ఇచ్చిన బాధ్యతను నిబద్ధతతో నిర్వర్తిస్తూ, ప్రభుత్వ సంక్షేమ పథకాలను గ్రామస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. గ్రామాభివ ృద్ధే లక్ష్యంగా సమన్వయంతో పని చేయాలని పిలుపునిచ్చారు.నూతనంగా ఎన్నికైన సర్పంచులతో పాటు ఆయా మండలాల నాయకులు, కార్యకర్తలు కూడా ఈ సందరరేగా పోచారం శ్రీనివాసరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ విజయం రాబోయే రోజుల్లో నియోజకవర్గ రాజకీయాల్లో కీలక మలుపుగా నిలుస్తుందని కార్యకర్తలు విశ్వాసం వ్యక్తం చేశారు.

# రోల్ బాల్ వరల్డ్ కప్ విజేతగా భారత్!



రోల్ బాల్ వరల్డ్ కప్‌లో భారత పురుషుల, మహిళల జట్లు విజేతగా నిలిచాయి. దుబాయ్ వేదికగా జరిగిన ఈ టోర్నీ ఫైనల్లో భారత పురుషుల జట్టు 11-10 తేడాతో, మహిళల జట్టు 3-2 తేడాతో కెన్యా పురుషుల, మహిళల జట్లను ఓడించాయి. ఈ గెలుపుతో ప్రపంచకప్ టైటిల్స్‌ను ముద్దాడాయి.ఆసాంతం ఉత్కంఠగా సాగిన ఫైనల్ మ్యాచ్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ కెన్యా భారత పురుషుల జట్టుకు గట్టి పోటీనిచ్చింది. ఒక దశలో భారత్ వెనుకంజలో నిలిచినప్పటికీ.. పుంజుకుని ఈ విజయాన్ని కైవసం చేసుకుంది. ఇది భారత పురుషుల జట్టుకు 5వ ప్రపంచకప్ టైటిల్. మహిళలకు మూడో ప్రపంచకప్ టైటిల్. ఈ మెగా ఈవెంట్‌లో భారత్, కెన్యా, పోలాండ్, అర్జెంటీనా, సౌదీ అరేబియా, పాకిస్థాన్ వంటి దేశాలు పాల్గొన్నాయి.2023లో పూణేలో జరిగిన ప్రపంచకప్‌లో కెన్యా చేతిలో ఎదురైన ఓటమికి భారత్ ప్రతీకారం తీర్చుకుంది. ఈసారి దుబాయ్ గడ్డపై భారత్ రెండు విభాగాల్లోనూ క్లీన్ స్వీప్ చేసింది. భారత మూలాలున్న ఈ క్రీడలో మన జట్లు ప్రపంచ స్థాయి ఆధిపత్యాన్ని చెలాయించాయి. భారత పురుషుల జట్టు విజయంలో రోహన్ దాభాడే, హితేష్ సింగ్, యష్ రాశియా, హర్షల్ ఘుగే కీలక పాత్ర పోషించాడు.రోలా బాల్ అనేది భారత్‌లో పుట్టి వినూత్నమైన క్రీడ. సింపుల్‌గా చెప్పాలంటే.. బాస్కెట్‌బాల్, హ్యాండ్‌బాల్, రోలర్ స్కేటింగ్ కలిసిన ఆట. ఈ క్రీడలో ఆటగాళ్ళు రోలర్ స్కేట్స్ ధరించి, బంతిని డ్రిబ్లింగ్ చేస్తూ ఎదుటి జట్టు గోల్ పోస్ట్‌లోకి పంపాలి. ప్రతి జట్టులో 12 మంది ఆటగాళ్ళు ఉంటారు. కానీ మైదానంలో ఒకేసారి 6 మంది మాత్రమే ఆడతారు. ఇందులో ఒక గోల్ కీపర్ ఉ ంటాడు.ఆటగాళ్ళు స్కేటింగ్ చేస్తూ బంతిని చేత్తో పట్టుకుని బాస్కెట్ బాల్ తరహాలో డ్రిబ్లింగ్ చేయాలి. బంతిని ఒక చేత్తో లేదా రెండు చేతులతో పాస్ చేయవచ్చు. కానీ గోల్ వేసేటప్పుడు మాత్రం ఒక చేయి మాత్రమే ఉపయోగించాలి. నిర్ణీత సమయంలో ఏ జట్టు ఎక్కువ గోల్స్ చేస్తే ఆ జట్టు విజేతగా నిలుస్తుంది. భారత్‌లో పుట్టిన ఈ క్రీడను ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా 50కి పైగా దేశాల్లో ఆడుతున్నారు.



## తెల్లని దుస్తుల్లో మెరిసిపోతున్న స్మృతి మంధాన

భారత మహిళా స్టార్ క్రికెటర్, వైస్ కెప్టెన్ స్మృతి మంధాన సోషల్ మీడియాలో తన తాజా ఫోటోలతో సందడి చేస్తోంది. ఇటీవల ఓ కార్యక్రమంలో పాల్గొన్న స్మృతి మంధాన.. తెల్లటి వన్-పీస్ డ్రెస్‌లో ఎంతో అందంగా కనిపించింది. బుగ్గపై డింపుల్, ముఖంలో చిరునవ్వుతో ఉన్న ఆమె ఫోటోలు ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతున్నాయి.గత నెలలో స్మృతి మంధాన వ్యక్తిగత జీవితంలో కొన్ని ఒడిదుడుకలు ఎదురైన విషయం తెలిసిందే. పలాష్ ముచ్చల్‌తో వివాహం రద్దయిందని స్వయంగా స్మృతి మంధాన సోషల్ మీడియా ద్వారా వెల్లడించింది. ఈ వార్త అభిమానులను కొంత ఆందోళనకు గురిచేసింది. అయితే కష్టకాలం నుంచి ఆమె వేగంగా కోలుకుంటోంది. "క్రికెట్టే నా సర్వస్వం, నా మొదటి ప్రేమ" అని ఆమె ఇటీవల పేర్కొంది. తాజా ఫోటోల్లో ఆమె ఉత్సాహంగా ఉండటం చూసి అభిమానులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.క్రికెట్ మైదానంలో స్మృతి మంధాన సందడి మళ్లీ మొదలుకానుంది. డిసెంబర్ 21 నుండి భారత్, శ్రీలంక జట్ల మధ్య 5 టీ20 మ్యాచ్‌ల సిరీస్ ప్రారంభం కానుంది. ఈ సిరీస్‌లో స్మృతి కీలక పాత్ర పోషించనుంది. జనవరి 9 నుంచి మహిళల ప్రీమియర్ లీగ్ ప్రారంభం కానుంది. ఇందులో స్మృతి మంధాన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టుకు సారథ్యం వహించనుంది.మహిళల ప్రీమియర్ లీగ్ మొదటి మ్యాచ్‌లోనే ఆసక్తికర పోరు జరగనుంది. జనవరి 9న యల్ ఛాలెంజర్స్ బెంగళూరు(స్మృతి మంధాన), ఇండియన్స్ (హర్మన్‌ప్రీత్ కౌర్) జట్లు తలపడనున్నాయి. టీమిండియా కెప్టెన్, స్ కెప్టెన్ తలపడనుండటంతో ఈ మ్యాచ్‌పై భారీ అంచనాలు నెలకొన్నాయి.

# మూడో టెస్ట్‌లోనూ ఆస్ట్రేలియా జోరు

## ఇంగ్లండ్ 68 ఓవర్లలో 8 వికెట్లకు 213 పరుగులు



ప్రతిష్టాత్మక యాషెస్ సిరీస్‌లో భాగంగా అడిలైడ్ వేదికగా జరుగుతున్న మూడో టెస్ట్‌లోనూ ఆస్ట్రేలియా పట్టుబిగించింది. ముందుగా బ్యాటింగ్‌లో సత్తా చాటిన ఆసీస్.. ఆ తర్వాత బౌలింగ్‌లోనూ చెలరేగింది. దాంతో రెండో రోజు ఆట ముగిసే సమయానికి ఇంగ్లండ్ 68 ఓవర్లలో 8 వికెట్లకు 213 పరుగులు చేసింది. కెప్టెన్ బెన్ స్టోక్స్(45 బ్యాటింగ్)తో పాటు జోఫ్రా ఆర్చర్(30 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. హ్యారీ బ్రూక్(45) పర్వాలేదనిపించగా.. మిగతా బ్యాటర్లు నిరాశపర్చారు. ఆసీస్ బౌలర్లలో ప్యాట్ కమిన్స్ మూడు వికెట్లు తీయగా.. స్కాట్ బోలాండ్, నాథన్ లయన్ రెండేసి వికెట్లు తీసారు. కామెరూన్ గ్రీన్‌కు ఒక వికెట్ దక్కింది.అంతకుముందు 326/8 ఓవర్‌నైట్ స్కోర్‌తో రెండో రోజు ఆటను కొనసాగించిన ఇంగ్లండ్.. 91.2 ఓవర్లలో 371 పరుగులకు కుప్పకూలింది. ఓవర్‌నైట్ బ్యాటర్లలో అలెక్స్ క్యారీ(106) త్వరగానే ఔటవ్వగా.. మిచెల్ స్టార్క్(54) హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. నాథన్ లయన్(9) విఫలమవ్వగా.. స్కాట్ బోలాండ్(14 నాటౌట్) అజేయంగా నిలిచాడు. ఇంగ్లండ్ బౌలర్లలో జోఫ్రా ఆర్చర్(5/53) ఐదు వికెట్లు తీయగా.. బ్రైడన్ కార్స్, విల్ జాక్స్ రెండేసి వికెట్లు పడగొట్టారు. జోష్ టంగ్‌కు ఓ వికెట్ దక్కింది. ఇంగ్లండ్ ఇంకా 158 పరుగుల వెనుకంజలో ఉంది. అద్భుతం జరిగితే తప్పా ఈ మ్యాచ్‌లో ఇంగ్లండ పుంజుకునే అవకాశాలు కనిపించడం లేదు. ఇప్పటికే ఈ సిరీస్‌లో ఇంగ్లండ్ 0-2తో వెనుకంజలో నిలిచింది. మరోవైపు డీఆర్‌ఎస్ విషయంలో తీవ్ర దుమారం రేగింది. సాంకేతిక లోపం కారణంగా ఆస్ట్రేలియా బ్యాటర్ అలెక్స్ క్యారీ ఔటయ్యే ప్రమాదం నుంచి తప్పించుకున్నాడు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్న అతను ఏకంగా శతకంతో చెలరేగాడు. ఇది ఇంగ్లండ్ జట్టుకు తీవ్ర నష్టం చేసింది.అలెక్స్ క్యారీ సెంచరీతో తొలి రోజు ఆటలో ఆసీస్ ఆధిపత్యం చెలాయించింది. మొదటి రోజు ఆట అనంతరం అలెక్స్ క్యారీ డీఆర్‌ఎస్ వివాదాంపై స్పందించాడు. తాను ఔటయ్యాననే విషయం తెలుసని, అంపైర్ నాటౌట్ ఇవ్వడంతో బ్యాటింగ్ కొనసాగించి సెంచరీ సాధించానని చెప్పాడు. ఈ వ్యాఖ్యలు మరింత అగ్గిని రాజేసాయి. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ఆసీస్ 94 పరుగులకే 4 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. ఈ పరిస్థితుల్లో క్రీజులోకి వచ్చిన అలెక్స్ క్యారీతో కలిసి ఉస్మాన్ ఖవాజా జట్టును ఆదుకునే ప్రయత్నం చేశాడు. అయితే జోష్ టంగ్ వేసిన 63వ ఓవర్ తొలి బంతి అలెక్స్ క్యారీ బ్యాట్‌ను తాకుతూ వికెట్ కీపర్ చేతిలో పడింది. ఫీల్డ్ అంపైర్ నాటౌట్ ఇచ్చాడు. బ్యాట్‌ను బంతి తాకిన శబ్దం స్పష్టంగా వినిపించింది. దాంతో ఇంగ్లండ్ రివ్యూకి వెళ్లింది. కానీ స్నికో మీటర్ టెక్నాలజీలో బంతి బ్యాట్‌ను తాకినట్లు తేలలేదు. బంతి బ్యాట్‌కు దూరంగా ఉన్నప్పుడు స్నికో మీటర్‌లో గీత వచ్చింది. దగ్గరగా ఉన్నప్పుడు మాత్రం ఎలాంటి మార్క్ చూపించలేదు. రిప్లేతో పాటు స్నికో మీటర్‌లో స్పష్టత లేకపోవడంతో థర్డ్ అంపైర్.. ఫీల్డ్ అంపైర్ నిర్ణయానికి కట్టుబడి నాటౌట్ ఇచ్చాడు. అయితే టెక్నాలజీ లోపం కారణంగానే ఈ తప్పిదం జరిగిందని తొలి రోజు ఆట అనంతరం తేలింది. ఈ మ్యాచ్ టెక్నాలజీ విభాగాన్ని నిర్వహిస్తున్న బీబీజీ స్పోర్ట్స్ కంపెనీ తమ తప్పుకు క్షమాపణలు చెప్పింది. 'అలెక్స్ క్యారీ బ్యాట్‌కు బంతి తగిలింది వాస్తవమే. ఆ సమయంలో మా స్నికో ఆపరేటర్ పొరపాటున బ్యాట్స్‌మన్ వైపు ఉన్న స్టంప్ మైక్‌ను కాకుండా బౌలర్ వైపు ఉన్న మైక్‌ను ఎంచుకున్నాడు. దాంతో ఆడియోలో లోపడం ఏర్పడింది. ఈ తప్పిదానికి మేం బాధ్యత వహిస్తాం.'అని స్పష్టం చేసింది.

# గాలి కాలుష్యం వల్లే మ్యాచ్ రద్దయ్యింది

## పొగ మంచు కారణం కాదు

## సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖేల్ యాదవ్

భారత్, సౌతాఫ్రికా మధ్య నాలుగో టీ20 రద్దుకు పొగ మంచు కారణం కాదని సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖేల్ యాదవ్ అన్నారు. గాలి కాలుష్యం వల్లే మ్యాచ్ రద్దయ్యిందని చెప్పారు. ఐదు టీ20ల సిరీస్‌లో భాగంగా లక్నో వేదికగా బుధవారం జరగాల్సిన మ్యాచ్ పొగమంచు కారణంగా రద్దయిన సంగతి తెలిసిందే. టాస్ సమయానికే మైదానాన్ని పొగమంచు కమ్మేయడంతో పలు మార్లు మైదానాన్ని పరిశీలించి, విజిబిలిటిని పరీక్షించిన అంపైర్లు చివరకు మ్యాచ్ రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ వ్యవహారంపై స్పందించిన అఖిలేష్ యాదవ్.. బీజేపీ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. ఢిల్లీ కాలుష్యం లక్నోకు చేరడంతోనే మ్యాచ్ రద్దయ్యిందని సోషల్ మీడియా వేదికగా పేర్కొన్నారు. 'ఢిల్లీ కాలుష్యం ఇప్పుడు లక్నోకు చేరుకుంది. అందుకే లక్నోలో జరగాల్సిన అంతర్జాతీయ క్రికెట్ మ్యాచ్ రద్దయ్యింది. ఈ మ్యాచ్ రద్దుకు మంచు కారణం కాదు. విషపూరితమైన గాలి కాలుష్యం.లక్నోలో స్వచ్ఛమైన గాలి కోసం మేం ఏర్పాటు చేసిన పార్కులను కూడా బీజేపీ నాశనం చేసింది. పార్కుల్లో అనవసరమైన కార్యక్రమాలు నిర్వహించి వాటిని దెబ్బతీసింది. మానవులతో పర్యవరణానికి బిజేపీ శ్రేయస్కారం కాదు. లక్నోలో ఉంటే మాస్క్ ధరించండి'అని అఖిలేష్ యాదవ్ ట్వీట్ చేశారు.పొగమంచుతో పాటు మైదానం గాలి నాణ్యత దారుణంగా పడిపోవడంతో టీమిండియా స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా మాస్క్ ధరించి కనిపించాడు. కాసేపు మైదానంలో ప్రాక్టీస్ చేసిన భారత ఆటగాళ్లు ఆ తర్వాత డ్రెస్సింగ్ రూమ్‌కు పరిమితమయ్యారు. రాత్రి 9.30 గంటలకు చివరిసారిగా మైదాన్ని పరిశీలించిన అంపైర్లు.. మ్యాచ్ రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు.ఈ మ్యాచ్ రద్దవ్వడంపై ఫ్యాన్స్ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బీసీసీఐపై మండిపడుతున్నారు. పొగమంచు కురిసే ప్రదేశాల్లో మ్యాచ్‌లు ఎందుకని, సౌత్ ఇండియాలో చాలా మైదానాలు అనుకూలంగా ఉన్నాయని అసహనం వ్యక్తం చేస్తున్నారు. తమ టికెట్ డబ్బులు రిటర్న్ చేయాలని ప్రేక్షకులు కోరుతున్నారు. ఈ ఐదు టీ20ల సిరీస్‌లో భారత్ 2-1తో ఆధిక్యంలో కొనసాగుతుంది. ఆఖరి మ్యాచ్ శుక్రవారం అహ్మదాబాద్ వేదికగా జరగనుంది. ఈ మ్యాచ్ గెలిచి సిరీస్ కైవసం చేసుకోవాలనే పట్టుదలతో భారత్ ఉంది.





# నార్త్‌లో మ్యాచ్‌లు నిర్వహించొద్దు


## కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, ఎంపీ శశి థరూర్



ఉత్తర భారతదేశంలో డిసెంబర్ మధ్య నుంచి జనవరి మధ్య వరకు తీవ్ర పొగమంచు సమస్య ఉండటంతో ఆ కాలంలో అక్కడ అంతర్జాతీయ క్రికెట్ మ్యాచ్‌లు నిర్వహించొద్దని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, ఎంపీ శశి థరూర్ బీసీసీఐని కోరారు. ఆ సీజన్‌లో మ్యాచ్‌లు పెడితే అభిమానులు తీవ్ర నిరాశకు గురవుతారని, ఇది క్రికెట్ ప్రేమికులను మోసం చేసినట్టేనని ఆయన వ్యాఖ్యానించారు.ఉ త్తర్?ప్రదేశ్?లోని లఖ్?నవూలో బుధవారం జరగాల్సిన భారత్ - దక్షిణాఫ్రికా మధ్య నాలుగో టీ20 మ్యాచ్ తీవ్ర పొగమంచు కారణంగా టాస్ కూడా వేయకుండానే రద్దుకావడంపై థరూర్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఎకానా స్టేడియాన్ని దట్టమైన పొగమంచు కమ్మేయడంతో ఆట కొనసాగించడం అసాధ్యమైంది. దీనితో ఉత్తర భారతంలో శీతాకాలంలో మ్యాచ్‌ల షెడ్యూలింగ్‌పై తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి.పార్లమెంట్ హౌస్ ప్రాంగణంలో మీడియాతో మాట్లాడిన శశి థరూర్ మాట్లాడుతూ, "డిసెంబర్ మధ్య నుంచి జనవరి మధ్య వరకు ఉత్తర భారతంలోని చాలా ప్రాంతాల్లో పొగమంచు సాధారణమే. ఆ సమయంలో బంతి కూడా కనిపించని పరిస్థితి ఉంటుంది. అలాంటి పరిస్థితుల్లో క్రికెట్ మ్యాచ్‌లు ఎలా నిర్వహిస్తారు?" అని ఆయన ప్రశ్నించారు. "నిన్న దేశం మొత్తం నిరాశకు గురైంది. భారత్ - దక్షిణాఫ్రికా మ్యాచ్ చూడాలని ఎదురు చూసిన అభిమానులు తీవ్రంగా బాధపడ్డారు. కాబట్టి నా వాదన ఒక్కటే. ఈ కాలంలో మ్యాచ్‌లను దక్షిణ భారతంలో నిర్వహించాలి" అని థరూర్ సూచించారు. "నా నియోజకవర్గమైన తిరువనంతపురంలో అద్భుతమైన స్టేడియం ఉంది. మేమంతా సిద్ధంగా ఉన్నాం. ఇక్కడ వాతావరణ పరిస్థితులు చాలా అనుకూలంగా ఉంటాయి. ఇక్కడికి వచ్చి మ్యాచ్‌లు ఆడండి" అని ఆయన అన్నారు. డిసెంబర్ చివర్లో మహిళల క్రికెట్ జట్టు తిరువనంతపురంలో ఆడబోతోందని గుర్తుచేసిన థరూర్, షెడ్యూలింగ్ చేస్తూ వాతావరణ పరిస్థితులను బీసీసీఐ తప్పకుండా పరిగణలోకి తీసుకోవాలని సూచించారు."కేరళతో పాటు దక్షిణ భారతంలోని ఇతర ప్రాంతాల్లో ఈ తరహా పొగమంచు సమస్య ఉండదు. కాబట్టి డిసెంబర్ మధ్య నుంచి జనవరి మధ్య వరకు ఉత్తర భారతంలో మ్యాచ్‌లు వద్దు క్రికెట్ అభిమానులను మోసం చేయొద్దు" అని ఆయన స్పష్టం చేశారు. ఈ అంశంపై బుధవారం రాత్రి సోషల్ మీడియా వేదిక ఎక్స్?లో కూడా థరూర్ పోస్టు చేశారు. లఖ్?నవూలో ఏక్యూఐ 411గా ఉండగా, తిరువనంతపురంలో కేవలం 68 మాత్రమేనని ఆయన పేర్కొన్నారు. "పొగమంచు కారణంగా మ్యాచ్ ప్రారంభించలేకపోయారు. ముందే తిరువనంతపురంలో షెడ్యూల్ చేసి ఉంటే సమస్యే ఉండేది కాదు" అని ఆయన విమర్శించారు. ఇదిలా ఉండగా, పార్లమెంట్‌లో శశి థరూర్‌తో పాటు బీసీసీఐ ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా మధ్య ఈ అంశంపై ఆసక్తికర చర్చ జరిగింది. డిసెంబర్ 15 నుంచి జనవరి 15 మధ్య మ్యాచ్‌ల షెడ్యూలింగ్‌పై మరింత జాగ్రత్త అవసరమని శుక్లా అంగీకరించారు. "ఈ కాలంలో తరచూ వాతావరణ సమస్యలు ఎదురవుతున్నాయి. కాబట్టి షెడ్యూలింగ్‌లో ఎక్కువ శ్రద్ధ పెట్టాలి" అని ఆయన తెలిపారు.దీనికి స్పందించిన థరూర్, జనవరిలో జరిగే మ్యాచ్‌లను కేరళకు మార్చాలని సూచించారు. అయితే ఇది కేవలం కేరళకే సంబంధించిన అంశం కాదని శుక్లా స్పష్టం చేశారు. "బీసీసీఐ రొటేషన్ పాలసీ ప్రకారం కేరళకు ఇప్పటికే మ్యాచ్‌లు వస్తున్నాయి" అని ఆయన చెప్పారు. థరూర్ మళ్లీ తన వాదనను కొనసాగించగా, అయితే అన్ని మ్యాచ్‌లను కేరళకే మార్చేస్తామంటూ శుక్లా సరదాగా వ్యాఖ్యానించారు.




# రవితేజ మూవీకి చిరు వాయిస్ ఓవర్





మాస్ మహారాజా రవితేజ హీరోగా ఇటీవల చాలా చిత్రాలు ప్రేక్షకుల ముందుకు వచ్చాయి. అందులో ఏ చిత్రం కూడా పెద్దగా ప్రేక్షకులని అలరించలేకపోయింది. ఇప్పుడు ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌లకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచిన దర్శకుడు కిశోర్ తిరుమల దర్శకత్వంలో చేస్తున్న తాజా చిత్రం 'భర్త మహాశయులకు విజ్ఞప్తి'. ఇప్పటికే ఈ సినిమా అనౌన్స్‌మెంట్ నుంచే ప్రేక్షకుల్లో మంచి ఆసక్తిని రేపుతోంది. ఈ చిత్రంలో రవితేజ సరసన ఆషికా రంగనాథ్, డింపుల్ హయాతి హీరోయిన్లుగా నటిస్తుండగా, ఫుల్ లెంగ్త్ ఎంటర్‌టైన్‌మెంట్‌తో పాటు బలమైన ఎమోషన్ కూడా ఉంటుందని టాక్ వినిపిస్తోంది. తాజా సమాచారం ప్రకారం, ఈ సినిమాలో రవితేజ పాత్రను ప్రత్యేకంగా పరిచయం చేస్తూ మెగాస్టార్ చిరంజీవి తన స్వరంతో వాయిస్ ఓవర్ ఇవ్వబోతున్నారని తెలుస్తోంది. సినిమాలో కీలకమైన సందర్భాల్లో రవితేజ పాత్ర గురించి వచ్చే వాయిస్ ఓవర్‌ను చిరంజీవి చెప్పనున్నారని, ఇది కథకు మరింత వెయిట్ పెంచడమే కాకుండా సినిమాపై బలమైన ముద్ర వేయబోతుందని ఫిల్మ్ నగర్ వర్గాలు చెబుతున్నాయి. చిరంజీవి వాయిస్ ఓవర్ ఉండటం వల్లే సినిమాపై అంచనాలు మరో స్థాయికి చేరుకున్నాయన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. మరోవైపు ఈ చిత్రానికి సంబంధించిన డిజిటల్, శాటిలైట్ హక్కుల డీల్స్ కూడా భారీ ధరకు పూర్తయ్యాయి. ప్రముఖ జీ గ్రూప్ ఈ సినిమా హక్కులను భారీ మొత్తానికి సొంతం చేసుకున్నట్లు సమాచారం. థియేట్రికల్ రిలీజ్ తర్వాత జీ5 ఓటీటీ ఎ÷-లాట్‌ఫామ్‌లో ఈ సినిమా స్ట్రీమింగ్‌కు రానుండగా, శాటిలైట్ ప్రసారాన్ని జీ తెలుగు మరియు జీ సినిమా ఛానల్స్ నిర్వహించనున్నాయి. జీ స్టూడియోస్ సమర్పణలో తెరకెక్కుతున్న ఈ చిత్రానికి భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్నారు. ఇప్పటికే భీమ్స్ మ్యూజిక్‌పై ఉన్న క్రేజ్‌కు తోడు రవితేజ ఎనర్జీ, కిశోర్ తిరుమల కథనం కలిసి ఈ సినిమాను హిట్ ట్రాక్‌లో నిలబెడతాయనే నమ్మకం వ్యక్తమవుతోంది. ఫ్యామిలీ ఆడియన్స్‌తో పాటు మాస్ ప్రేక్షకులను కూడా ఆకట్టుకునే అంశాలతో 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' సిద్ధమవుతోందని, రిలీజ్ దగ్గరపడే కొద్దీ ఈ సినిమాపై అంచనాలు మరింత పెరుగుతున్నాయని ట్రేడ్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

# 'డాక్టర్ కాదు దొంగ'.. శేష్ డెకాయిట్



టాలీవుడ్ యంగ్ హీరో అడివి శేష్, క్రేజీ హీరోయిన్ మృణాల్ ఠాకూర్ లీడ్ రోల్స్ లో డెకాయిట్ మూవీ రూపొందుతున్న విషయం తెలిసిందే. రొమాంటిక్ యాక్షన్ డ్రామాగా రూపొందుతున్న ఆ సినిమాకు షానీల్ డియో దర్శకత్వం వహిస్తున్నారు. డెకాయిట్ తోనే ఆయన డెబ్యూ ఇస్తుండగా.. యంగ్ ప్రొడ్యూసర్ సుప్రియ యార్లగడ్డ గ్రాండ్ గా రూపొందిస్తున్నారు. అనురాగ్ కశ్యప్ కీలక పాత్ర పోషిస్తున్న డెకాయిట్ మూవీ క్రిస్మస్ కానుకగా రిలీజ్ కావాల్సి ఉంది. కానీ వచ్చే ఏడాది ఉగాది పండుగకు వాయిదా వేశారు మేకర్స్. మార్చి 19వ తేదీన విడుదల చేయనున్నట్లు తెలిపారు. రీసెంట్ గా శేష్ బర్త్ డే సందర్భంగా స్పెషల్ పోస్టర్ ను విడుదల చేసిన మేకర్స్.. తాజాగా టీజర్ ను సోషల్ మీడియాలో రివీల్ చేశారు. నది ఒడ్డున అడివి శేష్ ఫోన్ లో మాట్లాడుతున్న సీన్ తో టీజర్ స్టార్ట్ అయింది. ఆ తర్వాత హీరో హీరోయిన్స్ కారులో ఉ ండగా.. శేష్ ముద్దు పెట్టేదా అంటూ అడుగుతూ సైగ చేస్తారు. ఇంతలో టీజర్ మలుపు తిరుగుతుంది. బ్యాక్ గ్రౌండ్ లో బ్లాక్ బస్టర్ సాంగ్ కన్నె పిట్టరో కన్ను కొట్టరో సాంగ్ ప్లే అవుతుండగా.. ఖైదీగా అడివి శేష్ ఎంట్రీ ఇస్తారు. ఆ తర్వాత సినిమాలోని కీలక సీన్స్ చూపించిన మేకర్స్.. అనురాగ్ కశ్యప్, ప్రకాష్ రాజ్, అతుల్ కులకర్ణి, సునీల్ ను పరిచయం చేశారు. చివర్లో నీవు డాక్టర్ వా అని అడిగితే.. కాదు దొంగ అని చెబుతారు అడివి శేష్. అయితే టీజర్.. పవర్ ఫుల్ గా ఉండి అందరినీ ఆకట్టుకుంటోంది. సోషల్ మీడియాలో వైరల్ గా మారి.. దూసుకుపోతుందనే చెప్పాలి. ఓవరాల్ గా టీజర్ బట్టి సినిమా ప్రేమ, దోపిడీ అంశాల చుట్టూ తిరుగుతున్నట్లు కనిపిస్తోంది. మాస్ ఓరియెంటెడ్ రోల్ లో అడివి శేష్ తొలిసారి కనిపించారు. సినిమాలో ఆయన రోల్ వివిధ షేడ్స్ తో ఉన్నట్లు తెలుస్తోంది. మదనపల్లె యాసలో ప్రావీణ్యం సంపాదించి, డైలాగ్స్ విషయంలో తన టాలెంట్ చూపించినట్లు కనిపిస్తున్నారు. మృణాల్ రోల్.. సినిమాకు ఎమోషనల్ టచ్ ఇచ్చినట్లు కనిపిస్తోంది. అనురాగ్, ప్రకాష్ రాజ్, అతుల్, సునీల్.. పవర్ ఫుల్ రోల్స్ లో సందడి చేయనున్నట్లు స్పష్టంగా తెలుస్తోంది. సినిమాటోగ్రాఫర్ ధనుష్ భాస్కర్ విజువల్స్ స్పెషల్ అట్రాక్షన్ గా నిలవడం పక్కా అనేలా చెప్పాలి. నిర్మాణ విలువలు ఉన్నతంగా ఉండగా.. గ్యానీ బ్యాక్ గ్రౌండ్ స్కోర్ పెర్ఫెక్ట్ గా సెట్ అయింది. ఐకానిక్ సాంగ్ కన్నె పిట్టరో మంచి ఎక్స్పీరియన్స్ ఇచ్చేలా ఉంది. మరి డెకాయిట్ మూవీ ఎలాంటి విజయం సాధిస్తుందో చూడాలి.

# అల్లు అర్జున్ సిస్టర్‌గా మృణాల్ ఠాకూర్?

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, స్టార్ దర్శకుడు అట్లీ కాంబినేషన్‌లో తెరకెక్కబోయే భారీ చిత్రంపై బన్నీ ఫ్యాన్స్‌తో పాటు సినీ ఇండస్ట్రీలోనూ భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ ప్రాజెక్ట్ అనౌన్స్‌మెంట్ వచ్చినప్పటి నుంచే అధికారిక అప్‌డేట్స్ కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ క్రమంలో తాజాగా ఈ సినిమాకు సంబంధించిన మరో క్రేజీ టాక్ సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది. ఈ మూవీలో బాలీవుడ్ నటి మృణాల్ ఠాకూర్ కీలక పాత్రలో కనిపించనున్నట్టు ఇప్పటికే వార్తలు వచ్చాయి. అయితే తాజాగా వినిపిస్తున్న సమాచారం ప్రకారం, మృణాల్ ఠాకూర్ ఈ సినిమాలో అల్లు అర్జున్‌కు సిస్టర్ రోల్‌లో నటించబోతున్నారట. ఈ పాత్ర కథలో చాలా కీలకమైనదిగా, బలమైన ఎమోషనల్ టోన్‌తో సాగుతుందని టాక్. అన్నచెలలెల మధ్య బంధం, భావోద్వేగాలను అట్లీ తన మార్క్ స్టైల్‌లో చూపించబోతున్నాడని, ఈ పాత్ర ప్రేక్షకులను బాగా కనెక్ట్ చేస్తుందని అంటున్నారు. అయితే ఇది అధికారికంగా ధృవీకరించాల్సి ఉంది. నిజంగా మృణాల్ సిస్టర్ రోల్‌లో కనిపిస్తారా? లేక మరో షేడ్స్ ఉన్న క్యారెక్టర్‌లో వస్తారా? అన్నది వేచి చూడాల్సిందే.ఇక ఈ సినిమాకు సంబంధించిన మరో హైలైట్ ఏమిటంటే.. బాలీవుడ్ స్టార్ హీరోయిన్ దీపికా పడుకోణె ఇందులో మెయిన్ హీరోయిన్‌గా నటించనుండగా, జాన్వీ కపూర్ మరో కీలక హీరోయిన్ పాత్రలో కనిపించనుంది. ఒకే సినిమాలో ఇంతమంది స్టార్ హీరోయిన్లు ఉండటం వల్ల ఈ ప్రాజెక్ట్‌పై మరింత క్రేజ్ పెరుగుతోంది.కథ విషయానికి వస్తే.. మాఫియా బ్యాక్‌డ్రాప్‌లో ఓ డాన్ చుట్టూ తిరిగే పవర్‌ఫుల్ కథను అట్లీ సిద్ధం చేశాడట. యాక్షన్, ఎమోషన్, డ్రామా అన్నీ సమపాళ్లలో ఉండేలా స్క్రిప్ట్‌ను రూపొందించినట్టు సమాచారం. అల్లు అర్జున్‌ను ఇప్పటివరకు ఎప్పుడూ చూడని విధంగా, ఒక కొత్త షేడ్స్ ఉన్న పాత్రలో చూపించేందుకు అట్లీ ప్రత్యేక శ్రద్ధ పెట్టినట్టు తెలుస్తోంది. ఈ భారీ ప్రాజెక్ట్‌ను సన్ పిక్చర్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్నారు. ప్రొడక్షన్ వ్యాల్యూస్ విషయంలో ఏ మాత్రం రాజీ పడకుండా, హాలీవుడ్ రేంజ్‌లో సినిమాను తెరకెక్కించేందుకు ఎ÷-లాన్ చేస్తున్నారట. అంతేకాదు, ఈ సినిమాలో కొన్ని ప్రత్యేక గెస్ట్ రోల్స్ కూడా ఉండబోతున్నాయని టాక్. వాటి కోసం అట్లీ పలువురు స్టార్ నటులను సంప్రదించనున్నారని సమాచారం. ఆ గెస్ట్ రోల్స్‌లో ఎవరు కనిపిస్తారన్నది మరో ఆసక్తికర అంశంగా మారింది.



# హద్దుమీరిన అభిమానం

## నిధి అగర్వాల్‌కు చేదు అనుభవం

కొన్నిసార్లు అభిమానం హద్దులు దాటితే అది అభిమానంగా కాకుండా వేధింపుగా మారుతుంది. ముఖ్యంగా హీరోయిన్ల విషయంలో కొంతమంది అభిమానుల ప్రవర్తనపై ఇప్పటికే తీవ్ర విమర్శలు వస్తున్నాయి. తాజాగా ప్రభాస్ నటిస్తున్న 'రాజాసాబ్' హీరోయిన్ నిధి అగర్వాల్‌కు ఇలాంటి షాకింగ్ అనుభవమే ఎదురైంది. ఆమెను చుట్టుముట్టిన అభిమానులు తోసేసుకుంటూ హీరోయిన్‌పైకి ఎగబడిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ప్రభాస్ హీరోగా నటిస్తున్న హారర్ కామెడీ థ్రిల్లర్ 'రాజాసాబ్'లో ముగ్గురు హీరోయిన్లలో నిధి అగర్వాల్ ఒకరు. ఈ చిత్రంలోని 'సహన సహన' పాటను బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని లూలూ మాల్‌లో సాంగ్ లాంచ్ ఈవెంట్ నిర్వహించారు. ఈ ఈవెంట్‌కు నిధి అగర్వాల్‌తో పాటు మరో హీరోయిన్ రిధి కుమార్ కూడా హాజరయ్యారు. సాంగ్ లాంచ్ కార్యక్రమానికి భారీగా అభిమానులు తరలివచ్చారు. ఈవెంట్ జరుగుతున్నంతసేపూ స్టేజ్ ముందు గుమిగూడిన అభిమానులు తోసుకుంటూనే కనిపించారు. అయితే ఈవెంట్ ముగిసిన తర్వాత పరిస్థితి మరింత దారుణంగా మారింది. నిధి అగర్వాల్ బయటకు వెళ్లే సమయంలో ఒక్కసారిగా అభిమానులు ఆమెపైకి ఎగబడారు. తోసుకుంటూ ముందుకు రావడం, చేతులు వేయడం వంటి ఘటనలు చోటు చేసుకున్నాయి. సెక్యూరిటీ సిబ్బంది తీవ్రంగా శ్రమించడంతో చివరికి నిధి అగర్వాల్ కారులోకి ఎక్కగలిగింది. కారులో కూర్చోగానే ఆమె 'ఓ మై గాడ్' అంటూ షాక్‌కు గురైన దృశ్యాలు వీడియోల్లో కనిపిస్తున్నాయి. ఇదిలా ఉండగా, ప్రభాస్ నటిస్తున్న 'రాజాసాబ్' సినిమా 2026 సంక్రాంతికి విడుదల కానుంది. జనవరి 9న థియేటర్లలో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతోంది.



Printed, Published by **Mohammed Murthuza.** Printed at Vivek Art Printers APHP SHOP NO.12, OSMANIA UNVERSITY ROAD,HYDERABAD. PUBLISHED ROOM NO.10, Ground Flour, Budha Bhavan, M.G.Road, Secunderabad -03. Ali Publication, Hyderabad. www.samayam.net Mobile No. 98660 19778, 89789 60131

# శాంతిభద్రతల్లో రాజీ పడొద్దు

**కలెక్టర్ల సమావేశంలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్**



**అమరావతి డిసెంబర్ 18 (సమయం న్యూస్):**

శాంతి భద్రతల విషయంలో కలెక్టర్లు, ఎస్పీలు కఠినంగా ఉండాలని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అన్నారు. శాంతి భద్రతలపై సమీక్షలో వివిధ అంశాలపై కలెక్టర్లు, ఎస్పీలకు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సూచనలు చేశారు. ప్రజా ప్రయోజనాలకు విఘాతం కలిగించే నేరాలను అస్సలు ఉపేక్షించొద్దని చెప్పారు. 15 శాతం వృద్ధిరేటు సాధించాలంటే శాంతిభద్రతలు చాలా ముఖ్యం అని పేర్కొన్నారు. నేరాల్లో నిర్లిప్తంగా ఉండటం సరికాదని పవన్ కళ్యాణ్ సూచించారు.'15 శాతం వృద్ధి రేటు సాధించాలంటే శాంతిభద్రతలు చాలా ముఖ్యం. విశాఖలో కొందరు ఆకస్మికంగా వచ్చి దాడి చేస్తే పోలీసు స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేసినా ఏమీ పట్టించుకోలేదు. కొందరు రాజకీయ నేతలు దీని వెనుక ఉన్నారు, చర్యలు తీసుకోకపోవటం ఇబ్బందికరం. నేరాల్లో నిర్లిప్తంగా ఉండటం సరికాదు. అధికారంలో ఉండి కూడా ఏమీ చేయటం లేదనే విమర్శలు ఎదుర్కోంటున్నాం. కఠినంగా వ్యవహరించాలని ఎస్పీలు, కలెక్టర్లను ఆదేశిస్తున్నాం. ప్రజాప్రయోజనాలకు విఘాతం కలిగించేలా జరుగుతున్న నేరాల పట్ల నిర్లక్ష్యంగా ఉండొద్దు' అని కలెక్టర్లు, ఎస్పీలతో డిప్యూటీ సీఎం పవన్ అన్నారు. ఇక 22వ తేదీన జనసేన 'పదవి బాధ్యత' సమావేశం జరగనుంది. కూటమి ప్రభుత్వంలో జనసేన పార్టీ తరపున నామినేటెడ్ పదవులు పొందిన వారితో విస్తృత స్థాయి సమావేశం ఏర్పాటు చేయనున్నారు. ఈ సమావేశం ద్వారా వారికి పవన్ కళ్యాణ్ దిశా నిర్దేశర చేస్తారు. మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, రాష్ట్ర స్థాయిలో వివిధ కార్పొరేషన్ ఛైర్మన్లు, డైరెక్టర్లు, జిల్లా స్థాయి పదవులు, ఏఎంసీ, పిఏసిఎస్, నీటి సంఘాలలో నామినేటెడ్ పదవులకు ఎంపికైన వారు ఈ సమావేశంలో పాల్గొంటారు.

# సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్‌లు

**గంట్యాడ దర్బార్‌లో మంత్రి కొండపల్లి శ్రీనివాస్**



**విజయనగరం,డిసెంబర్ 18 (సమయం న్యూస్):**

ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్ కార్యక్రమం అని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. విజయనగరం జిల్లాలోని గంట్యాడ మండలంలో నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో మంత్రి పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రజా దర్బార్‌లో సామాన్య ప్రజల నుంచి వస్తున్న సమస్యలకు సత్వర పరిష్కారం చూపాలని అన్నారు. అధికార యంత్రాంగం సామాన్య ప్రజల సమస్యల పరిష్కారం కోసం అంకితభావంతో పనిచేయాలని తెలిపారు. ప్రజల దైనందిన జీవితంలో ఎదురయ్యే సమస్యలను పరిష్కరించేందుకే ప్రజాదర్బార్ నిర్యహించటం జరుగుతుందని స్పష్టం చేశారు. ఈ ప్రజాదర్బార్ కార్యక్రమంలో ప్రజల నుంచి 124 అర్జీలు వచ్చాయన్నారు. రెవిన్యూ, విద్యుత్, పెన్షన్లు, ఉపాధి అవకాశాల గురించిన అర్జీలు ప్రజలు సమర్పించినట్లు చెప్పారు. ప్రజల నుంచి వచ్చిన అర్జీలను సంబంధిత అధికారులకు పంపి వాటికి పరిష్కారం చూపాలన్నారు.ప్రజల సమస్యలు పరిష్కారం అయ్యేంత వరకు ఎప్పటికప్పుడు కార్యాలయ సిబ్బంది సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేయాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు మండల అధికారులు, ప్రజాప్రతినిధులు, టీడీపీ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

# సంఖ్యాబలం ఉండడంతోనే అవిశ్వాసం

**మేయర్ స్రవంతిపై అవిశ్వాసంపై కోటంరెడ్డి**

**నెల్లూరు,డిసెంబర్18 (సమయం న్యూస్):**

సంఖ్యా బలం ఉండటంతో మేయర్ స్రవంతిపై అవిశ్వాస తీర్మానం పెట్టామని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి తెలిపారు. గురువారం నాడు మున్సిపల్ కార్పొరేషన్ ఇన్‌ఛార్జ్ మేయర్‌గా డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ బాధ్యతలు చేపట్టారు.ఈ సందర్భంగా రూప్‌కుమార్‌కు ఎమ్మెల్యే కోటంరెడ్డి, కార్పొరేటర్లు, నేతలు అభినందనలు తెలియజేశారు.అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అవిశ్వాసం పెట్టిన తర్వాత స్రవంతి రాజీనామా చేశారని.. రాజీనామాను ప్రభుత్వం ఆమోదించిందని తెలిపారు. కౌన్సిల్ మీటింగ్‌లో కూడా సభ్యులు ఆమె రాజీనామాను ఆమోదించారన్నారు. కొత్త మేయర్ వచ్చే వరకు ఇన్‌ఛార్జి మేయర్‌గా రూప్ కుమార్ ఉంటారని... ఆయన కార్పొరేషన్‌ను అన్ని విధాలుగా అభివృద్ధి చేయాలని కోరారు. రాబోయే కార్పొరేషన్ ఎన్నికల్లో నూటికి నూరు శాతం గెలిచేలా పనిచేస్తామని ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.అవిశ్వాసంతో తమకు సంబంధం లేదని వైసీపీ జిల్లా నేతలు చెబితే... ఓ కమెడియన్ వచ్చి హంగామా చేశారని ఇన్‌ఛార్జ్ మేయర్ రూప్ కుమార్ అన్నారు. తోలుబొమ్మలాటలో కేటుగాళ్లులాగా వచ్చారంటూ వ్యాఖ్యలు చేశారు. కిక్ ఉండాలంటూ కొందరిని లాక్కునే ప్రయత్నం చేసి, నవ్వుల పాలయ్యారన్నారు. చట్టం గురించి అవగాహన లేని కొంత మంది అసత్యాలు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. కొత్త మేయర్ ఎన్నిక చట్ట ప్రకారం జరుగుతుందని తెలిపారు. కొత్త మేయర్ వచ్చే వరకు తాత్కాలిక మేయర్ ఉంటారని ఇన్‌ఛార్జ్ మేయర్ రూప్ కుమార్ పేర్కొన్నారు.

# రాష్ట్రాన్ని ప్రగతిపథంలో నడిపించేలా దిశానిర్దేశం

**సమావేశ వివరాలను వెల్లడించిన మంత్రి పార్థసారథి**

**అమరావతి, డిసెంబర్18 (సమయం న్యూస్):**

రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపించడమే లక్ష్యంగా సిఎం చంద్రబాబు పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారని, కలెక్టర్లకు దిశానిర్దేశం చేశారని సమాచారశాఖ మంత్రి మంత్రి కొలుసు పార్థసారథి వెల్లడించారు. ప్రజల్లోకి ప్రభుత్వ నిర్ణయాలను తీసుకుని వెళ్లడమే లక్ష్యంగా కలెక్టర్ల సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసకున్నట్టు పార్థసారథి తెలిపారు. రాష్ట్ర భవిష్యత్తుకు దిక్సూచిగా రెండు రోజుల కలెక్టర్ల సమావేశం జరిగిందని మంత్రి వెల్లడించారు. కలెక్టర్ల మధ్య అభివృద్ధి, సంక్షేమంలో పోటీ తత్వాన్ని పెంపొందించేలా సమావేశాల్లో చర్చలు జరిగాయన్నారు. ప్రజలకు వేగంగా సుపరిపాలన అందించేలా, పలు సమస్యల పరిష్కరించేలా సమావేశం జరిగిందన్నారు. 18 నెలలల్లో రాష్ట్రం సాధించిన ప్రగతి, సంక్షేమం, అభివృద్ధిపై చర్చ జరిపినట్లు తెలిపారు. విద్యాసంస్థల్లో అమలుచేసే ముస్తాబు కార్యక్రమాన్ని అన్ని జిల్లాల్లో అమలుచేయాలని సీఎం ఆదేశించారని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ పిల్లల భవిష్యత్తు కోసం ప్రత్యేకంగా కోచింగ్ ఇవ్వాలని సీఎం ఆదేశించినట్లు చెప్పారు. పీజీఆర్ఎస్‌లో లక్షల సంఖ్యలో సమస్యలు ప్రభుత్వం దృష్టికి తెచ్చారన్న మంత్రి... ఆర్థికేతర సమస్యలన్నింటినీ వీలైనంత త్వరగా పరిష్కరించాలని సీఎం ఆదేశించినట్లు తెలిపారు. నిర్దిష్ట కాల పరిమితిలో రెవెన్యూ సమస్యలు పరిష్కరించాలని సీఎం గట్టిగా ఆదేశించారని తెలిపారు. రీసర్వే, 22ఏ, పాస్ బుక్‌ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించినట్లు తెలిపారు.

# 4.84 లక్షల ఉద్యోగాలు కల్పించాం

- 20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యం
- ప్రతి నియోజకవర్గంలో ఒక జాబ్ మేళా
- హెచ్ ఆర్డీ శాఖ కార్యదర్శి కోన శశిధర్

**అమరావతి డిసెంబర్ 18 (సమయం న్యూస్):**

ఈ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ఇప్పటి వరకు 4,84,450 మందికి ఉద్యోగాలు కల్పించామని మానవ వనరుల అభివృద్ధి శాఖ కార్యదర్శి కోన శశిధర్ వెల్లడించారు. జిల్లా కలెక్టర్ల సదస్సులో ఆయన మాట్లాడుతూ నైపుణ్యాలు, ఉద్యోగాల కల్పన గురించి చేపడుతున్న కార్యక్రమాల గురించి వివరించారు. 20 లక్షల ఉద్యోగాలు కల్పించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని, ఈ దిశగా ప్రయత్నాలు జరుగుతున్నాయని చెప్పారు. ఇప్పటికే 4.84 లక్షల ఉద్యోగాలు కల్పించామని చెప్పారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి ప్రతి నియోజకవర్గంలో ఒక జాబ్ మేళా నిర్వహించేలా చేస్తున్నామని తెలిపారు. ఇప్పటికి 1232 జాబ్ మేళాలు నిర్వహించాలని లక్ష్యం కాగా దాన్ని మించి 1483 జాబ్ మేళాలు నిర్వహించి, వీటి ద్వారా 99,665 మందికి ఉద్యోగాలు కల్పించామని చెప్పారు. ఈ జాబ్ మేళాలలో 10,145 కంపెనీలు, సంస్థలు పాల్గొన్నాయని తెలిపారు. పాఠశాల స్థాయి నుంచే నైపుణ్యంపాఠశాల స్థాయి నుంచే విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంపొందించేలా పని చేస్తున్నామని చెప్పారు. పరిశ్రమల డిమాండుకు తగ్గ నైపుణ్య వనరుల తయారు చేయడానికి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. 6,84,310 ఎంఎస్ ఎం ఈ సంస్థలు 21,668 ఉద్యోగాలు కల్పించాయని చెప్పారు. నైపుణ్యం పోర్టల్ ద్వారా సంక్రాంతి కల్లా లక్ష మందికి ఏఐ విద్యా ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. నర్సింగ్ కరిక్యులమ్‌లో జర్మనీ భాష నైపుణ్యాలను కూడా అనుసంధానం చేశామన్నారు. 10వ తరగతి ఫలితాలపై దృష్టి పెట్టండిరాష్ట్రంలోని 10వ తరగతి పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టకుందని, ఇందుకోసం విద్యార్థుల కోసం 100 రోజుల యాక్షన్ ప్లాన్ అమలు చేసి ప్రత్యేకంగా శిక్షణ ఇస్తూ, టెస్టులు పెడుతున్నామని చెప్పారు. ఈ కార్యక్రమం తమ జిల్లాలో ఎలా అమలవ్వుతోందని అనేది జిల్లా కలెక్టర్లు పర్యవేక్షించాలని చెప్పారు. పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించడానికి ఈ



వంద రోజులు యాక్షన్ ప్లాన్ ఎంతో ఊతమిస్తుందని, రోజూ విద్యార్థులకు స్లిప్ టెస్టులు పెడుతున్నామని, విద్యార్థులందరూ ఈ పరీక్షలు రాస్తున్నారా లేదా అనేది కూడా పర్యవేక్షించాలని చెప్పారు.

# పోలవరం నిర్మాణ పనులపై కేంద్రం నిఘా



- కాంక్రీట్ నాణ్యతను పరిశీలించిన శాస్త్రవేత్తలు
- డయాఫ్రం వాల్ పనులపై ప్రత్యేక దృష్టి
- నమూనాలను సేకరించిన సీఎస్ఎంఆర్ఎస్ బృందం

**పోలవరం, డిసెంబర్ 18 (సమయం న్యూస్):**

జాతీయ ప్రాజెక్ట్ అయిన పోలవరం నిర్మాణంలో నాణ్యత ప్రమాణాల పాటించడంపై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ప్రాజెక్ట్ నిర్మాణంలో అత్యంత కీలకమైన కాంక్రీట్ పనులకు ఉపయోగిస్తున్న కంకర నాణ్యతను కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ పరిధిలోని సెంట్రల్ సాయిల్ అండ్ మెటీరియల్స్ రీసెర్చ్ స్టేషన్ శాస్త్రవేత్తల బృందం గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించింది.ప్రాజెక్ట్ పనుల్లో భాగంగా భారీ స్థాయిలో కాంక్రీటింగ్ పనులు జరుగుతున్న నేపథ్యంలో, కేంద్ర శాస్త్రవేత్తలు రవి అగర్వాల్, లలిత్ కుమార్ సోలంకి నిర్మాణ ప్రాంతాన్ని సందర్శించారు. ముఖ్యంగా కాంక్రీట్ పనుల కోసం ఉపయోగిస్తున్న 20 మిల్లీమీటర్లు, 40 మిల్లీమీటర్ల కంకరను శాస్త్రవేత్తలు సవివరంగా పరీక్షించారు. ప్రాజెక్ట్ స్థలంలోనే ప్రాథమిక పరీక్షలు నిర్వహించి, కంకర నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా ఉందో లేదో ఆరా తీశారు.

**డయాఫ్రం వాల్ పనుల పరిశీలన**

ప్రస్తుతం పోలవరం ప్రాజెక్ట్‌లో అత్యంత కీలకమైన డయాఫ్రం వాల్ నిర్మాణ పనులను కేంద్ర బృందం ప్రత్యేకంగా సందర్శించింది. నాణ్యత నియంత్రణలో భాగంగా వినియోగంలో ఉన్న కంకరను బ్లాక్‌ల రూపంలో నిల్వ చేసిన ప్రాంతాలను శాస్త్రవేత్తలు తనిఖీ చేశారు. నిర్మాణంలో వాడే పదార్థాల బలం మరియు మన్నికపై సాంకేతిక విశ్లేషణ చేశారు.

**లోతైన విశ్లేషణ కోసం నమూనాల సేకరణ**

కేవలం క్షేత్రస్థాయిలోనే కాకుండా, మరింత శాస్త్రీయమైన విశ్లేషణ కోసం ఈ బృందం నమూనాలను సేకరించింది. ప్రాజెక్ట్ ప్రాంగణంలోని ల్యాబొరేటరీలో పరీక్షలు నిర్వహించడంతో పాటు, కొన్ని నమూనాలను సేకరించి ఢిల్లీలోని కేంద్ర ప్రయోగశాలకు తరలించనున్నారు. అక్కడ ఈ కంకర బలం, భౌతిక ధర్మాలను విస్తృతంగా పరీక్షించనున్నారు. ఈ బృందం తమ పర్యటనలో భాగంగా శుక్రవారం కూడా ప్రాజెక్ట్ ప్రాంతంలో పర్యటించి మరిన్ని తనిఖీలు చేపట్టనుంది.

**అధికారులతో సమన్వయం**

ఈ పరిశీలన కార్యక్రమంలో రాష్ట్ర నీటి వనరుల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు డి. శ్రీనివాస్, బాలకృష్ణ పాల్గొన్నారు. వారితో పాటు మేఘా ఇంజినీరింగ్ జనరల్ మేనేజర్ ఏ. గంగాధర్, డిప్యూటీ జీఎం మురళీ పమ్మి తదితరులు శాస్త్రవేత్తలకు నిర్మాణ ప్రక్రియను, వాడుతున్న మెటీరియల్ వివరాలను వివరించారు.

# 21న వజ్రగడలో క్రికెట్ టోర్నమెంట్

## పోస్టర్‌ను ఆవిష్కరించిన స్పీకర్ అయ్యన్నపాత్రుడు



**నర్సీపట్నం:** సంక్రాంతి పండుగను పురస్కరించుకుని మాకవరపాలెం మండలం వజ్రగడ గ్రామంలో సంక్రాంతి సంబరాలు నిర్వహించేందుకు సమాయత్తమయ్యారు. దీనిలో భాగంగా క్రికెట్ టోర్నమెంట్ ను నిర్వహించేందుకు యువత నడుం బిగించారు. ఈ మేరకు ఏపీ శాసనసభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు క్యాంప్ కార్యాలయంలో గురువారం క్రికెట్ టోర్నమెంట్ పోస్టర్ ను స్పీకర్ ఆవిష్కరించారు. గ్రామీణ ప్రాంత క్రీడాకారుల్లోని నైపుణ్యాన్ని వెలికితీయడమే లక్ష్యంగా నిర్వహిస్తున్న ఈ పోటీలలో గెలుపొందిన విజేతలకు నగదు బహుమతులు ప్రకటించారు. మొదటి బహుమతిగా 30 వేల రూపాయలు, ద్వితీయ బహుమతిగా 20 వేల రూపాయలు అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ క్రికెట్ పోటీలు డిసెంబర్ 21వ తేదీన వజ్రగడ గ్రామంలో ఘనంగా ప్రారంభించేందుకు యువత కార్యాచరణ ప్రణాళిక రూపొందించారు. ఈ క్రికెట్ టోర్నమెంట్‌కు వజ్రగడ టీడీపీ నాయకులు తమరాన అప్పలనాయుడు స్పాన్సర్ గా వ్యవహరిస్తూ, తమ వంతు ఆర్థిక సహకారాన్ని అందజేసారు. క్రీడలను ప్రోత్సహించడంలో అప్పలనాయుడు చూపిస్తున్న చొరవను స్పీకర్ అయ్యన్నపాత్రుడు అభినందించారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగు యువత వైస్ ప్రెసిడెంట్ లగుడు చంద్రశేఖర్, వజ్రగడ గ్రామ యువత, క్రీడాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సంక్రాంతి సంబరాల్లో భాగంగా నిర్వహించే ఈ క్రికెట్ టోర్నమెంట్‌ను విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

# ఎలివేటెడ్ ఫ్లైఓవర్ నిర్మించండి

**ఆకుల శ్రీనివాస్ వినతి**

**విజయవాడ:** విజయవాడ నగర ప్రజల, ప్రయాణికుల సౌకర్యార్థం విజయవాడ నగరంలో రద్దీని తగ్గించేందుకు వీలుగా మహానాడు జంక్షన్ నుంచి నిడమానూరు వరకు ఏడు కిలోమీటర్ల మేర ఎలివేటెడ్ ఫ్లైఓవర్ ను నిర్మించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కేంద్ర రోడ్డు రవాణా, హైవేస్ మంత్రి నితిన్ గట్కరికి సీనియర్ రాజకీయ నాయకుడు, సోషల్ వర్కర్ ఆకుల శ్రీనివాస్ కుమార్ ఒక వినతి పత్రం సమర్పించారు. న్యూఢిల్లీలోని పార్లమెంట్ భవన్లో కేంద్రమంత్రిని కలిసిన ఆకుల శ్రీనివాస్ ఈ మేరకు ఆయనకు వినతిపత్రం అందజేశారు. గతంలో సుమారు 700 కోట్ల రూపాయల వ్యయంతో ఈ ఎలివేటెడ్ ఫ్లైఓవర్ ను నిర్మించేందుకు ఎన్హెచ్ఏఐ నిర్ణయించడం జరిగిందన్నారు. అయితే విజయవాడ పశ్చిమ బైపాస్, ఓఆర్ఆర్ నిర్మాణ ప్రతిపాదనల వలన ఎలివేటెడ్ ఫ్లైఓవర్ నిర్మాణాన్ని నిలిపివేయాలని ఎన్హెచ్ఏఐ నిర్ణయించడం విజయవాడ నగర ప్రజలకు తీవ్ర నిరాశను కలిగించిందని మంత్రికి తెలిపారు. విజయవాడ నగరంలో ఇప్పటికే ట్రాఫిక్ సమస్య బాగా పెరిగిందని, ఈ ఎలివేటెడ్ ఫ్లైఓవర్ నిర్మాణం వలన తమ ట్రాఫిక్ కష్టాలు తీరుతాయని ప్రజలు ఆశిస్తున్నారని చెప్పారు. చెన్నై – కోల్ కతా నేషనల్ హైవే (ఎన్.హెచ్ 65)పై ఉదయం, సాయంత్రం వేళల్లో మహానాడు జంక్షన్ నుంచి నిడమానూరు వరకు విపరీతమైన ట్రాఫిక్ రద్దీ ఉంటుందని ,రద్దీ కారణంగా వాహనాలు పెద్ద సంఖ్యలో నిలిచిపోతున్నాయని కేంద్రమంత్రికి ఆకుల శ్రీనివాస్ వివరించారు. ముఖ్యంగా మహానాడు జంక్షన్, రామవరప్పాడు రింగ్, ఎనికెపాడు, నిడమానూరు కూడలి ప్రాంతాల్లో రద్దీ విపరీతంగా ఉంటుందని, ప్రజలకు ట్రాఫిక్ కష్టాల నుండి విముక్తి లభించాలంటే మహానాడు జంక్షన్ నుంచి నిడమానూరు వరకు ఎలివేటెడ్ ఫ్లైఓవర్ నిర్మాణం ఒక్కటే ఏకైక మార్గమని మంత్రికి తెలియచేశారు. విజయవాడ నగరంలో ఉన్న ట్రాఫిక్ రద్దీని, ప్రజల కష్టాలను దృష్టిలో ఉంచుకొని ఈ ప్రాంతంలో వెంటనే ఎలివేటెడ్ ఫ్లైఓవర్ నిర్మాణానికి తగిన చర్యలు తీసుకోవాలని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరికి ఆకుల శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు.

# దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్ల సాధికారతే లక్ష్యం

**దివ్యాంగులు, ట్రాన్స్ జెండర్ల సాధికారతే లక్ష్యం**

**ఉచిత ఆన్‌లైన్ శిక్షణ ప్రారంభం!**

**21 సెంచరీ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ సహకారంతో నైపుణ్య శిక్షణ**

**మంత్రి డీఎస్ బీవీ స్వామి వెల్లడి**

**అమరావతి, డిసెంబర్ 18 (సమయం న్యూస్):**

రాష్ట్రంలోని దివ్యాంగులు, ట్రాన్స్ జెండర్ల జీవితాల్లో వెలుగులు నింపేందుకు ప్రభుత్వం మరో ముందడుగు వేసింది. వారిని ఆర్థికంగా, సామాజికంగా బలోపేతం చేసేందుకు '21 సెంచరీ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్' సహకారంతో ఉచిత ఆన్‌లైన్ శిక్షణా కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టింది. గురువారం సచివాలయం నుంచి జూమ్ ద్వారా రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డీఎస్ బీవీ స్వామి ఈ కార్యక్రమాన్ని అధికారికంగా ప్రారంభించారు. ఈ శిక్షణా కార్యక్రమం ద్వారా దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్లకు పోటీ ప్రపంచంలో రాణించేలా ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నారు. నేటి కాలానికి అవసరమైన కంప్యూటర్, డిజిటల్ నైపుణ్యాలపై శిక్షణ, భాషా నైపుణ్యం, ఇంటర్వ్యూలు ఎదుర్కొనే విధానంపై అవగాహన, కెరీర్ గైడెన్స్ అండ్ మెంటార్ షిప్ పోటీ పరీక్షలకు సిద్ధమవ్వడం, స్వయం ఉపాధి మార్గాలను ఎంచుకోవడంపై నిపుణుల ద్వారా మార్గదర్శకత్వం అందించనున్నారు.

### దివ్యాంగుల కోసం సీఎం చంద్రబాబు '7 వరాలు'

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దివ్యాంగుల సంక్షేమం కోసం ప్రకటించిన ఏడు వరాలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని మంత్రి పేర్కొన్నారు. దివ్యాంగులకు ఇబ్బంది కలగకుండా అన్ని కలెక్టరేట్లు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో త్వరలోనే లిఫ్టుల ఏర్పాటు. అర్హులైన దివ్యాంగులకు త్వరలోనే ఉచితంగా త్రీ వీలర్స్ (మూడు చక్రాల వాహనాలు) పంపిణీ చేయనున్నట్లు ప్రకటించారు.

### ట్రాన్స్ జెండర్ల గుర్తింపు - సంక్షేమ పథకాలు

ట్రాన్స్ జెండర్ల హక్కుల కోసం కృషి చేసిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు గారికే దక్కుతుందని మంత్రి స్వామి కొనియాడారు. ట్రాన్స్ జెండర్లకు పింఛన్లు మంజూరు చేసిన అంశాన్ని గుర్తు చేస్తూ, వారి సామాజిక భద్రతకు ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. ప్రతి ట్రాన్స్



జెండర్‌కు అధికారిక గుర్తింపు కార్డులతో పాటు, రేషన్ కార్డుల పంపిణీకి త్వరితగతిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

# పీపీపీ విధానం తప్పైతే నన్ను, ప్రధాని మోడీని జైలుకు పంపుతారా?

**జగన్‌కు మంత్రి సత్య కుమార్ సవాల్!**

- 'విజిటింగ్ పొలిటీషియన్' డ్రామాలు ఆపాలి
- సంతకాల సేకరణ అంతా అబద్ధం
- నిప్పులు చెరిగిన ఆరోగ్యశాఖ మంత్రి

**అమరావతి, డిసెంబర్ 18 (సమయం న్యూస్):**

వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి వైఖరిపై రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గురువారం సచివాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జగన్ వ్యాఖ్యలను, ఆయన అనుసరిస్తున్న తీరును కడిగిపారేశారు. పీపీపీ విధానంపై జగన్ చేస్తున్న విమర్శలను అహంకారపూరితమైనవిగా అభివర్ణించారు.

### పీపీపీ విధానంపై బహిరంగ సవాల్

ప్రభుత్వ వైద్య కళాశాలల నిర్వహణలో పీపీపీ విధానంపై జగన్ చేస్తున్న వ్యాఖ్యలపై మంత్రి తీవ్రంగా స్పందించారు. "పీపీపీ విధానం తప్పైతే, ఈ విధానాన్ని అమలు చేస్తున్న నన్ను జైలుకు పంపండి. దీనికి నేతృత్వం వహిస్తున్న ప్రధాని నరేంద్ర మోదీని, ఎన్డీయే ప్రభుత్వాన్ని కూడా జైలుకు పంపుతారా?" అని నిలదీశారు. నిర్మాణ పనులు చేపడుతున్న సంస్థలను జైలుకు పంపిస్తామన్న జగన్ మాటలు హాస్యాస్పదమని, ఆ సంస్థల తల మీద వెంట్రుక





కూడా పీకలేరని మంత్రి హెచ్చరించారు. దమ్ముంటే కోర్టుకు వెళ్లి సీబీఐ విచారణ కోరాలని సవాల్ విసిరారు.

### 'కోటి సంతకాలు' ఒక పెద్ద నాటకం

గవర్నర్‌ను కలిసి కోటి సంతకాల పత్రాలు సమర్పించడంపై మంత్రి సెటైర్లు వేశారు. రాష్ట్రంలో ఎక్కడా కోటి సంతకాల సేకరణ జరగలేదని, ప్రజల నుంచి కనీస స్పందన లేదని ఎద్దేవా చేశారు. రాజ్యాంగబద్ధ పదవిలో ఉన్న గవర్నర్‌ను జగన్ తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. జగన్ కేవలం పరామర్శలకో, బలప్రదర్శనలకో బయటకు వచ్చే 'విజిటింగ్ పొలిటీషియన్' అని, ఆయన పర్యటనలన్నీ డ్రామాలని కొట్టిపారేశారు.

### గత చరిత్రను గుర్తుచేసిన మంత్రి

వైసీపీ హయాంలో జరిగిన విధానాలను మంత్రి ఈ సందర్భంగా ఎత్తిచూపారు. జగన్ హయాంలో ఆరోగ్యశ్రీ బిల్లులను రూ. 2500 కోట్లు బకాయి పెట్టి వ్యవస్థను నాశనం చేశారని ఆరోపించారు. మరి అప్పుడు 104, 108 సేవలు పీపీపీ విధానంలో లేవా? అని ప్రశ్నించారు. కడపలో సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాను మూతపడేలా చేసి, అదే పునాదులపై భారతి సిమెంట్స్ నిర్మించిన జగన్ కు నీతులు చెప్పే హక్కు లేదన్నారు. జగన్, ఆయన తండ్రి రాజశేఖర రెడ్డి కూడా గతంలో అనేక పీపీపీ ప్రాజెక్టులు చేపట్టిన విషయాన్ని గుర్తుచేశారు.

### వ్యక్తిగత విమర్శలు - రాజకీయ భవిష్యత్తు

జగన్ మానసిక స్థితిపై మంత్రి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. జగన్ కు తీవ్రమైన అహంకారం, కక్షపూరిత మనస్తత్వం ఉన్నాయని, ఆయనకు వెంటనే మానసిక చికిత్స అవసరమని సూచించారు. అక్రమాస్తుల కేసుల్లో 30 కేసులు ఉండి, జైలుకు వెళ్లొచ్చిన వ్యక్తి మంచి విధానాలను తప్పుపట్టడం 'దెయ్యాలు వేదాలు వల్లించినట్లు' ఉందన్నారు. ఇలాగే కొనసాగితే జగన్ తన రాజకీయ సమాధిని తానే కట్టుకుంటారని హెచ్చరించారు.

# ఈజిప్ట్‌కు 'మేడ్ ఇన్ శ్రీసిటీ' మహా ట్యాంక్

**క్రయోజెనిక్ రంగంలో మరో ఘన విజయగాథ**



**శ్రీసిటీ:** క్రయోజెనిక్ ట్యాంకుల తయారీలో అగ్రగామిగా నిలిచిన యూఎస్ఏ చార్ట్ ఇండస్ట్రీస్‌కు చెందిన వీఆర్వీ ఆసియా పసిఫిక్ ప్రైవేట్ లిమిటెడ్ మరో అంతర్జాతీయ మైలురాయిని అధిగమించింది. అత్యాధునిక క్రయోజెనిక్ సాంకేతికతతో తయారైన భారీ లిక్విడ్ నైట్రోజన్ స్టోరేజ్ ట్యాంక్‌ను ఈజిప్ట్‌లోని ప్రముఖ సంస్థ ఎయిర్ లిక్విడ్‌కు విజయవంతంగా ఎగుమతి చేసింది. 531 కిలోలీటర్ల సామర్థ్యం, 168 టన్నుల బరువు, సుమారు 39 మీటర్ల పొడవు, 5.45 మీటర్ల వ్యాసం కలిగిన ఈ మహా ట్యాంక్ క్రయోజెనిక్ ఇంజినీరింగ్‌లో అత్యున్నత ప్రమాణాలకు నిదర్శనంగా నిలుస్తోంది. ఈ భారీ నిర్మాణాన్ని శ్రీసిటీ నుంచి చెన్నై పోర్ట్‌కు తరలించేందుకు ప్రత్యేక మల్టీ-యాక్సిల్ లాజిస్టిక్స్ వినియోగించడం విశేషం. శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి మాట్లాడుతూ, ఈ ఎగుమతి 'మేక్ ఇన్ ఇండియా' కార్యక్రమానికి గొప్ప విజయమని అన్నారు. ప్రపంచ స్థాయి క్రయోజెనిక్ ఇంజినీరింగ్‌లో వీఆర్వీ సామర్థ్యాన్ని ఇది మరింత బలపరుస్తుందని పేర్కొన్నారు. శ్రీసిటీలో మొట్టమొదటి సంస్థగా అడుగుపెట్టిన వీఆర్వీ, నేడు ఏరోస్పేస్, హెల్త్‌కేర్ వంటి కీలక రంగాలకు సేవలందించే గ్లోబల్ కంపెనీగా ఎదిగిందన్నారు. ఇస్రోతో భాగస్వామ్యం, కోవిడ్ మహమ్మారి సమయంలో ప్రాణాలను కాపాడిన ఆక్సిజన్ మౌలిక వసతుల సరఫరా వంటి ఘన చరిత్ర కలిగిన వీఆర్వీ, తాజా ఎగుమతితో క్రయోజెనిక్ టెక్నాలజీలో భారత్ సామర్థ్యాన్ని ప్రపంచానికి చాటింది.

# కాపులూరు జడ్పీ హైస్కూల్‌కు కొత్త ఊపిరి

**మౌలిక వసతుల అభివృద్ధికి ఎమ్మెల్యే హామీ**



**నాయుడుపేట:** కాపులూరు జడ్పీ హైస్కూల్ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ స్పష్టం చేశారు. గురువారం ఆమె పాఠశాలను సందర్శించి అక్కడి పరిస్థితులను ప్రత్యక్షంగా పరిశీలించారు. స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు కాపులూరు చక్రపాణి ఎమ్మెల్యేకు శాలువా కప్పి పూలమాల వేసి ఘనంగా సన్మానించారు. అనంతరం ప్రధానోపాధ్యాయులు చలం బాబు, ఉపాధ్యాయులు రుద్రకుమార్‌తో పాటు ఇతర ఉపాధ్యాయులు పాఠశాలలో మౌలిక వసతులు మెరుగుపరచాలని ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. పాఠశాల ఆవరణలో చిన్నపాటి వర్షానికే రెండడుగుల లోతు వరకు నీరు నిలిచిపోతుందని, ఇటీవల కురిసిన వర్షాల కారణంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని వివరించారు. అలాగే మరుగుదొడ్ల నిర్మాణం అత్యవసరమని కోరారు. ఈ అంశాలపై స్పందించిన ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ కాపులూరు జడ్పీ హైస్కూల్‌లో అవసరమైన మౌలిక వసతులు మెరుగుపరచేందుకు తగిన చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. విద్యార్థులకు మెరుగైన విద్యావాతావరణం కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం తరఫున పూర్తి సహకారం అందిస్తామని ఆమె తెలిపారు.

# 17వ గ్రాండ్ క్రిస్మస్ వేడుకలకు ఎమ్మెల్యేకు టీఎస్ఆర్ ఆహ్వానం

**ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, యువ నేత వెంకట్రామ్‌లకు ఆహ్వాన పత్రాలు అందజేసిన టీఎస్ఆర్**



**కోడూరు:** టీఎస్ఆర్ గ్రూప్ చైర్మన్, టీఎస్ఆర్ మినిస్ట్రీస్ అధినేత తిరుపతి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఈనెల 25వ తేదీన కోడూరులోని ఐదవ వార్డులో జరుగుతున్న 17వ మెగా గ్రాండ్ క్రిస్మస్ వేడుకలకు అవనిగడ్డ శాసనసభ్యులు, శాసనసభ ఎథిక్స్ కమిటీ చైర్మన్ డాక్టర్ మండలి బుద్ధప్రసాద్, యువ నేత మండలి వెంకట్రామ్ లను తిరుపతి శ్రీనివాసరావు ఆహ్వానించారు. గురువారం అవనిగడ్డలోని మండలి బుద్ధ ప్రసాద్ కార్యాలయంలో ఆయనను తిరుపతి శ్రీనివాసరావు మర్యాదపూర్వకంగా కలుసుకొని ఈనెల 25వ తేదీన కోడూరులో జరిగే క్రిస్మస్ వేడుకలకు ఆహ్వాన పత్రాలను అందజేశారు. 17వ గ్రాండ్ క్రిస్మస్ సందర్భంగా 17,000 మందికి ఆత్మీయ విందు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. గ్రాండ్ క్రిస్మస్ కార్యక్రమంలో చేపడుతున్న ఈ వివిధ కార్యక్రమాల గురించి ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాదుకు తిరుపతి శ్రీనివాసరావు వివరించారు.

# అనధికార నిర్మాణంపై మున్సిపల్ కొరడా

**పార్కింగ్ స్థలంలో నిర్మాణాలు కూల్చివేత**





**నాయుడుపేట:** మున్సిపాలిటీ పరిధిలోని భరత్‌నగర్ ప్రాంతంలో ఉన్న యష్ ధన్య అపార్ట్‌మెంట్‌లో పార్కింగ్ స్థలంలో అనధికారంగా చేపట్టిన నిర్మాణంపై మున్సిపల్ అధికారులు కఠిన చర్యలు చేపట్టారు. ఈ నిర్మాణంపై ఫ్లాట్ యజమానులు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ ద్వారా ఫిర్యాదు చేయగా, మున్సిపల్ అధికారుల విచారణలో పార్కింగ్ ప్రాంతంలో చేపట్టిన నిర్మాణం పూర్తిగా అనధికారమని నిర్ధారణ అయింది. దీంతో చట్ట నిబంధనల ప్రకారం మున్సిపల్ అధికారులు పార్కింగ్ స్థలంలోని అనధికార నిర్మాణాన్ని చట్టబద్ధంగా కూల్చివేశారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడితే ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని అధికారులు స్పష్టం చేశారు. నాయుడుపేట మున్సిపాలిటీ పరిధిలో అనుమతించిన ప్లాన్‌కు విరుద్ధంగా నిర్మించిన భవనాలు, అదనపు అంతస్తులు లేదా ఇతర విచలనాలు ఉన్న భవన యజమానులు ప్రభుత్వం ప్రవేశపెట్టిన అనధికార నిర్మాణాలను క్రమబద్ధీకరించే పథకం కింద తమ భవనాల ప్లాన్‌లను మార్చి 3వ తేదీ లోపు సమర్పించి చట్టబద్ధం చేసుకోవాలని మున్సిపల్ అధికారులు సూచించారు. గడువు లోపు చర్యలు తీసుకోని పక్షంలో కఠిన చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

# పల్స్ పోలియోపై శిక్షణా కార్యక్రమం



**విజయవాడ:** ఈనెల 21న జరుగు పల్స్ పోలియో కార్యక్రమం, నిర్వహించుటకు, విధివిధానాలని వివరించేందుకు నగరంలోని అన్ని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారులకు సూపర్వైజర్లకు, ఏఎన్ఎంలకు, బూత్ వాలంటీర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. తుమ్మలపల్లి కళాక్షేత్రంలో గురువారం జరిగిన ఈ కార్యక్రమంలో డీఎం అండ్ హెచ్వో డాక్టర్ సుహాసిని మాట్లాడుతూ, అప్పుడే పుట్టిన, శిశువు నుండి అయిదు సంవత్సరాల్లోపు పిల్లలందరికీ అదనపు రెండు చుక్కలు పోలియో డోస్ తప్పక ఇప్పించాలని అన్నారు. తీవ్రమైన జలుబు దగ్గు జ్వరం ఉన్నప్పుడు మాత్రమే వైద్యుని సంప్రదించి ఈ అదనపు పోలియో డ్రాప్స్ వేయించాలని అన్నారు. జిల్లాలో 966 పోలియో బూత్స్ పరిధిలో 2,48,900 మంది పిల్లలకు లక్ష్యంగా నిర్దేశించుకుని, ఈ పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహించబడుతుందని పేర్కొన్నారు. వైద్య సిబ్బందికి ప్రజలు, తల్లిదండ్రులు సహకరించి వారి పిల్లలకు ఈ అదనపు పోలియో చుక్కలు వేయించవలసిందిగా తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఎంహెచ్వో డాక్టర్ అర్జున్ రావు, ఏఎంహెచ్వోలు డాక్టర్ బాబు శ్రీనివాసరావు, డాక్టర్ గోపాలకృష్ణ, వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.